




# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 11 సంచిక : 190 పేజీలు :12 సంపాదకులు : గంట్యాడ అప్పారావు ప్రచురణ : ఒంగోలు ఆదివారం 16 మార్చి 2025 వెల : 5/-రూ॥

VOLUME :11 ISSUE : 190 PAGES :12 EDITOR : GANTYADA APPARAO PUBLISHED :ONGOLE SUN 16 MARCH 2025 PRICE : 5/- RS

Simultaneously Published form Ongole, Kakinada, Visakhapatnam, Circulated by Srikakulam, Vizianagaram, Eluru, Vijayawada, Guntur, Nelloru, Chittur, YSR Kadapa, Kurnool, Anantapur


## పారిశుద్ధ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తాం



- ఆల్ఫా హెూటల్ వద్ద పారిశుద్ధ్య కార్మికులతో కలిసి టీ తాగిన నారా లోకేశ్
- మంగళగిరిలో పారిశుద్ధ్య కార్మికులను కలిసిన లోకేశ్
- కార్మికులతో ఆప్యాయంగా ముచ్చటించిన వైనం
- వారిని సత్కరించి, కానుకల బహూకరణ

వివరాలు 2లో..



# ఎక్కడా చెత్త కనిపించొద్దు - ఎప్పుడైనా వచ్చి తనిఖీ చేస్తా

- 45 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను జగన్ వారసత్వంగా ఇచ్చి వెళ్లారు: సీఎం చంద్రబాబు
- పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం
- స్థానికులతో ముఖాముఖి నిర్వహించిన సీఎం చంద్రబాబు
- జగన్ కనీసం మురికి కాలువల్లో పూడిక కూడా తీయించలేదని విమర్శలు





పెన్ పవర్ డెస్క్:పశ్చిమ గోదావరి జిల్లా తణుకులో ఇవాళ స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న సీఎం చంద్రబాబు స్థానికులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జగన్ ఐదేళ్ల పాలనలో కనీసం మురికి కాలువల్లో పూడిక కూడా తీయించలేదని విమర్శించారు. 45 లక్షల మెట్రిక్ టన్నుల చెత్తను జగన్ వారసత్వంగా ఇచ్చి వెళ్లారని ఎద్దేవా చేశారు. స్వచ్ఛ ఆంధ్ర కోసం ప్రతి ఒక్కరూ కంకణం కట్టుకోవాల్సిన అవసరం ఉందని అన్నారు. స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర తన జీవితాశయం అని స్పష్టం చేశారు. ప్రజల ఆహార అలవాట్లు మారడంతో వ్యాధులు పెరిగాయని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. కొన్ని రకాల జబ్బులకు ఖరీదైన చికిత్స అవసరమవుతోందని తెలిపారు. ఇలాంటివన్నీ దృష్టిలో ఉంచుకుని రాష్ట్ర ప్రజలకు ఉచితంగా ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. స్వర్ణాంధ్ర-2047 పేరుతో స్పష్టమైన విధానం తీసుకువచ్చామని... అభివృద్ధి, సంక్షేమం, సుపరిపాలనతో ముందుకు వెళుతున్నామని వెల్లడించారు. రాష్ట్ర ప్రజల తలసరి ఆదాయం పెంచేందుకు కృషి చేస్తున్నామని చంద్రబాబు వివరించారు. గత ప్రభుత్వ ఐదేళ్ల పాలనలో ఏపీ అన్ని విధాలా విధ్వంసానికి గురైందని ఆవేదన వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం విపరీతంగా అప్పులు చేసి వెళ్లిందని, ఇప్పుడా అప్పులు తీర్చడంతో పాటు వడ్డీ కూడా కట్టాల్సి వస్తోందని తెలిపారు.

## కేంద్రంపై ఉమ్మేస్తే... ఆకాశంపై ఉమ్మేసినట్టే

- రాష్ట్రంలో 10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయన్న బండి సంజయ్
- దమ్ముంటే ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని సవాల్
- కాంగ్రెస్, బీజేపీలు నాటకాలు ఆడుతున్నాయని మండిపాటు




పెన్ పవర్ డెస్క్:తెలంగాణలో 10 లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపో యినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి బాధ లేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రైతు భరోసా ఇవ్వరని, రుణమాఫీ చేయరని, పంటనష్టం ఇవ్వరని విమర్శించారు. దమ్ముంటే ఆరు గ్యారెంటీలను

వివరాలు 2లో..

## గుంటూరు మేయర్ మనోహర్ నాయుడు రాజీనామా

- ఏడాది పదవీకాలం ఉండగానే రాజీనామా
- 2021లో వైసీపీ నుంచి మేయర్‌గా ఎన్నికైన మనోహర్ నాయుడు
- గత కొంతకాలంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ మధ్య వివాదం



వివరాలు 2లో..

## పాకిస్థాన్ లో ఆర్మీ కాన్వాయ్ పై మరో దాడి

- చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ మార్గంలో ఆర్మీ కాన్వాయ్ లక్ష్యంగా దాడి
- పెద్ద సంఖ్యలో మరణాలు సంభవించినట్టు సమాచారం
- గత 24 గంటల్లో ఇది రెండో దాడి



పెన్ పవర్ డెస్క్:పాకిస్థాన్ లోని బలూచిస్థాన్ ప్రావిన్స్ లో పాక్ ఆర్మీపై మరోసారి దాడి జరిగింది. చైనా-పాకిస్థాన్ ఎకనామిక్ కారిడార్ మార్గంలో పాక్ బలగాలకు చెందిన కాన్వాయ్ లక్ష్యంగా శక్తివంతమైన బాంబు పేలుడు సంభవించింది. ఈ దాడిలో పెద్ద ఎత్తున మరణాలు సంభవించినట్టు సమాచారం. పాకిస్థాన్ బలగాలపై

వివరాలు 2లో..

## ఏపీ సర్కార్ ఆసక్తికర నిర్ణయం... ఎంపీలు, ఎమ్మెల్యేలకు అవార్డులు!




- ఎంపీలు, ఎమ్మెల్యేలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు వినూత్న కార్యక్రమం
- ప్రజా సమస్యలపై అసెంబ్లీలో, పార్లమెంట్‌లో పోరాటం చేసే వారికి అవార్డులు
- పార్టీలకు అతీతంగా అవార్డుల ప్రదానం ఉంటుందన్న కూటమి ప్రభుత్వం

వివరాలు 2లో..

## దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి



- కులగణనపై బీఎస్పీ అధినేత్రి మాయావతి కీలక సూచన
- దేశంలో కులగణన చేయాలని ఎన్డీయే ప్రభుత్వానికి డిమాండ్
- కేంద్ర ప్రభుత్వం ఈ దిశగా చర్యలు తీసుకోవాలన్న మాయావతి
- సమగ్ర అభివృద్ధి కోసం జనగణన అవసరమని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్: దేశంలో కులగణన చేపట్టాలని ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, బీఎస్పీ అధినేత్రి మాయా వతి డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం

వివరాలు 2లో..

## నాయకులు ప్రజల్లోంచి పుట్టాలన్నాడు.... ఎమ్మెల్సీని మాత్రం అన్నకు ఇచ్చుకున్నాడు

- జయకేతనం సభలో పవన్ చేసిన వ్యాఖ్యలపై అంబటి ప్రెస్ మీట్
- పవన్ ను ఊసరవెల్లితో పోల్చిన అంబటి
- పవన్ అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాడని విమర్శలు

పెన్ పవర్ డెస్క్:పిఠాపురం మండలం చిత్రాడలో నిన్న జరిగిన జనసేన ఆవిర్భావ సభలో పవన్ కల్యాణ్ చేసిన వ్యాఖ్యల పట్ల వైసీపీ నేత అంబటి రాంబాబు ప్రెస్ మీట్ నిర్వహిం చారు. ఈ మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పవన్ కల్యాణ్ ఊసరవెల్లి లాంటి వాడని, అవకాశవాద రాజకీయాలు చేస్తున్నాడని విమర్శించారు.

వివరాలు 2లో..




## శ్రీశైలం భక్తులను ముంచేస్తున్న నకిలీ వెబ్ సైట్




- శ్రీశైలం దేవస్థానం పేరుతో నకిలీ వెబ్ సైట్ క్రియేట్ చేసిన కేటుగాళ్లు
- నకిలీ వెబ్ సైట్ కు డబ్బులు కూడా చెల్లించిన కొందరు భక్తులు
- శ్రీశైలం వచ్చిన తర్వాత తాము మోసపోయామని గుర్తించిన బాధిత భక్తులు

పెన్ పవర్ డెస్క్:శ్రీశైలం భ్రమరాంబికా మల్లికార్జునస్వామి వారిని దర్శించుకోవడానికి ప్రతి రోజు వేలాది మంది భక్తులు వస్తుంటారు. శ్రీశైలంకు వచ్చే భక్తులు వసతి కోసం శ్రీశైలం దేవస్థానం అధికారిక

వివరాలు 2లో..

## జైల్లో నా పట్ల కఠినంగా వ్యవహరించారు

- ఇందిరాగాంధీ హయాంలో తనను జైల్లో పెట్టారన్న అమిత్ షా
- వారం రోజులు జైల్లో ఉంటే భౌతికంగా దాడి చేశారన్న అమిత్ షా
- కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నిర్బంధాలను ఎదుర్కొన్నామన్న కేంద్ర మంత్రి
- బీజేపీ అధికారంలోకి వచ్చాక అసోంలో శాంతిభద్రతలు మెరుగయ్యాయన్న అమిత్ షా



పెన్ పవర్ డెస్క్:ఇందిరాగాంధీ హయాంలో ఆమెకు వ్యతిరేకంగా విద్యార్థుల మంతా కలిసి ఆందోళన నిర్వహించామని, ఆ సమయంలో తాను వారం రోజులు జైల్లో ఉన్నానని కేంద్ర మంత్రి అమిత్ షా అన్నారు.

వివరాలు 2లో..

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ కు హరిరామజోగయ్య బహిరంగ లేఖ



- రాజధాని పేరిట ఇప్పటికే రూ. 50 వేల కోట్లు ఖర్చు చేశారన్న జోగయ్య
- మరో రూ. 50 వేల కోట్లు ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉన్నారని వెల్లడి
- మిగిలిన జిల్లాల పరిస్థితి ఏమిటని ప్రశ్న

పెన్ పవర్ డెస్క్:ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ లకు మాజీ మంత్రి, కాపు సంక్షేమ సేన అధ్యక్షుడు హరిరామజోగయ్య బహిరంగ లేఖ రాశారు. గుంటూరు, కృష్ణ జిల్లాల్లో రాజధాని పేరిట ఇప్పటికే సుమారు రూ. 50 వేల కోట్లు ఖర్చు చేశారని... మరో రూ. 50 వేల కోట్లు ఖర్చు చేయడానికి సిద్ధంగా ఉన్నారని లేఖలో ఆయన తెలిపారు. పరిపాలన సౌలభ్యం కోసం శాసనసభ, శాసనమండలి, హైకోర్టు, ప్రభుత్వ కార్యాలయాల కోసం ఖర్చు చేయడం మంచిదేనని...

వివరాలు 2లో..

## హిందీ తప్పనిసరి అని అందులో ఎక్కడా చెప్పలేదు



- జయకేతనం సభలో పవన్ చేసిన వ్యాఖ్యలపై దుమారం
- సోషల్ మీడియాలో స్పందించిన జనసేనాని
- ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని విమర్శలు

పెన్ పవర్ డెస్క్:జాతీయ, సాంస్కృతిక సమైక్యతను సాధించడంలో భాషను బలవంతంగా రుద్దడం లేదా గుడ్డిగా వ్యతిరేకించడం రెండూ సహాయపడవని పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. తాను హిందీ భాషకు వ్యతిరేకం కాదని, దానిని తప్పనిసరి చేయడాన్నే వ్యతిరేకించానన్నారు. జాతీయ విద్యా విధానం-2020లో హిందీని తప్పనిసరి చేయనప్పుడు, బలవంతంగా రుద్దుతున్నారంటూ అసత్య కథనాలు వ్యాప్తి చేయడం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నమని ఆయన విమర్శించారు. "జాతీయ విద్యా విధానం-2020 ప్రకారం,

వివరాలు 2లో..

## రేవంత్ రెడ్డి 'మార్చురీ' అన్న పదం ఒక వ్యక్తిని ఉద్దేశించి అన్నది కాదు

- ఏదైనా ఉంటే రాజకీయంగా ఎదుర్కోవాలన్న సీతక్క
- సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయవద్దని హితవు
- సోషల్ మీడియాకు హద్దు ఉండాలన్న సీతక్క



పెన్ పవర్ డెస్క్:తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 'మార్చురీ' అన్న పదం ఒక వ్యక్తిని ఉద్దేశించి అన్నది కాదని మంత్రి సీతక్క అన్నారు. ఈరోజు ఆమె మీడియాతో మాట్లాడుతూ, ఏదైనా ఉంటే

వివరాలు 2లో..

## ఎడిటర్ వ్యూ

# ఆర్థిక మాంద్యం దిశగా ప్రపంచం...

**2022 తర్వాత అతిపెద్ద ఇంట్రాడే నష్టాలు రికార్డు**

అమెరికాలో అసలేం జరుగుతోంది..? డొనాల్డ్ ట్రంప్ ప్రెసిడెంట్‌గా రెండోసారి పదవి చేపట్టిన తర్వాత ప్రపంచంలో పరిస్థితులన్నీ అల్లకల్లోలంగా మారాయి. ఇప్పుడు ఏకంగా అమెరికా ఆర్థిక వ్యవస్థే అతలాకుతలం అయ్యే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ట్రంప్ దెబ్బకు ఇది వరకు ఎన్నడూ లేని విధంగా తాజాగా అమెరికన్ స్టాక్ మార్కెట్ భారీ పతనాన్ని చవిచూసింది. ప్రస్తుత పరిణామాలు చూస్తుంటే, అమెరికాలో మళ్లీ మాంద్యం రాబోతోందా అనే డౌట్లు వస్తున్నాయి. అమెరికా స్టాక్ మార్కెట్ క్రాష్ అయ్యింది. ఇటీవల ఎప్పుడూ లేనంతగా భారీ పతనాన్ని చవి చూసింది. అధిక అమ్మకాల ఒత్తిడితో అమెరికన్ మార్కెట్ టెన్షన్ పెంచింది. నాస్‌డాక్, ఎస్ అండ్ పీ దారుణంగా పడిపోగా? ఏకంగా నాలుగు ట్రిలియన్ డాలర్లు? అంటే, రూ.349 లక్షల కోట్ల మేరకు తుడిచిపెట్టుకుపోయింది. ఫ్రాన్స్, యూకే వంటి కొన్ని దేశాల జీడిపి కంటే ఇది ఎక్కువ మొత్తం. ఈ పరిణామంతో అగ్రరాజ్యంలో ఆర్థికమాంద్యం నెలకొందనే వాదనలు మళ్లీ ఊపందుకున్నాయి. అయితే, దీనింతటికీ కారణం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనుసరిస్తోన్న వాణిజ్య విధానాలే అని అభిప్రాయం ఉంది. మెక్సికో, కెనడా, చైనాలపై భారీగా సుంకాలు విధించడం వంటి చర్యలు స్టాక్ మార్కెట్ కుప్పకూలిపోవడానికి దారి తీశాయని అంటున్నారు. భారత్ సహా వివిధ దేశాలపై ట్రంప్ టారిఫ్ యుద్ధం తర్వాత ప్రపంచంలోని అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలో ట్రేడ్ వార్ మొదలవ్వగా? ఆర్థిక మాంద్యం ఏర్పడిందనే ఆందోళనలు ఇన్వెస్టర్లను భయాందోళనలకు గురి చేస్తున్నాయి. ఫలితంగా భారీగా అమ్మకాలు కొనసాగాయి. ప్రధానంగా టెక్నాలజీ సెగ్మెంట్‌కు చెందిన షేర్లను ఇన్వెస్టర్లు అమ్ముకున్నారు. 2022 తర్వాత ఈ సెగ్మెంట్‌లో అతిపెద్ద ఇంట్రాడే నష్టాలు రికార్డు ఇదే. ఈక్విటీలు మాత్రమే కాకుండా? కార్పొరేట్ బాండ్స్, క్రిప్టోకరెన్సీ సహా ఇతర రంగాల్లో కూడా భారీ అమ్మకాల రోజంతా కొనసాగాయి. ఇక, భారత్ సహా కెనడా, మెక్సికో, చైనా వంటి అనేక దేశాలపై డొనాల్డ్ ట్రంప్ కొత్తగా టారిఫ్‌ను ప్రకటించడం మార్కెట్‌లో అనిశ్చితికి దారి తీసినట్టయింది. ఎస్ అండ్ పీ 2.7, నాస్‌డాక్ నాలుగు శాతం మేర క్షీణించింది. గత ఏడాది డిసెంబర్‌లో గరిష్ట స్థాయిలో అమెరికా షేర్ మార్కెట్ పతనం కాగా.. ఈ నాలుగు నెలల్లో దాన్ని మించిన స్థాయిలో పడిపోవడం చర్చనీయాంశమైంది. డౌ జోన్స్ ఇండస్ట్రియల్ యావరేజ్ 890 పాయింట్లు పతనమైంది 41,911.71 వద్ద దాని ట్రేడింగ్ ముగిసింది. ఎస్ అండ్ పీ 155.64 పాయింట్లను నష్టపోయి.. 5,614.56 వద్ద ముగిసింది. ఈ ఏడాదిలో ఇదే అతిపెద్ద పతనం. ఈ క్రమంలో? నాస్‌డాక్ 727.90 పాయింట్ల మేర నష్టపోయింది. 17,468.32 వద్ద ట్రేడింగ్ ముగిసింది. ఇక, ఎలాన్ మస్క్‌కు చెందిన టెస్లా షేర్లు కూడా 15 శాతానికి పైగా పడిపోయాయి. డిసెంబర్ 17 నుండి ఈ సంస్థ షేర్ వాల్యూ 50 శాతం ఆవిరయ్యింది. 2020 సెప్టెంబర్ తర్వాత అతిపెద్ద ఇంట్రాడే పతనం ఇదే. దీనితో, ఆర్థిక మాంద్యం భయంతో అమెరికా ట్రెజరీ దిగుమతులు భారీగా పడిపోయాయి. టాప్ టెక్ కంపెనీలైన మైక్రోసాఫ్ట్, ఎన్విడియా, టెస్లా, మెటా, ఆల్ఫాబెట్ తీవ్రమైన అమ్మకాల ఒత్తిడిని ఎదుర్కోగా వాటి షేర్ల ధరలు 4% నుండి 11% మధ్య పడిపోయాయి. మైక్రోసాఫ్ట్, అమెజాన్ షేర్లు కూడా కుదేలయ్యాయి.అమెరికా మార్కెట్ల పతనం ప్రపంచవ్యాప్తంగా ప్రభావం చూపించింది. ట్రంప్ ఇటీవల ఇచ్చిన ఇంటర్వ్యూలో చేసిన వ్యాఖ్యల తర్వాత పెట్టుబడిదారుల విశ్వాసం తగ్గింది. దీనితో అమెరికా ప్రభుత్వ బాండ్లకు డిమాండ్ తగ్గింది. సాధారణంగా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేటు అంచనాలతో పాటు కదిలే 2 సంవత్సరాల నోట్ దిగుబడి 10.4 బేసిస్ పాయింట్లు తగ్గి 3.898 శాతానికి చేరుకుంది. ఇది మార్చి 7న ఆలస్యంగా 4.002 శాతం నుండి, సెప్టెంబర్ తర్వాత అతిపెద్ద రోజువారీ తగ్గుదలకు దారి తీసింది. బెంచ్‌మార్క్ యూఎస్ 10-సంవత్సరాల నోట్ల దిగుబడి 9.3 బేసిస్ పాయింట్లు తగ్గి 4.225 శాతానికి చేరుకోగా? 30-సంవత్సరాల బాండ్ దిగుబడి 6.9 బేసిస్ పాయింట్లు తగ్గి 4.548 శాతానికి చేరుకుంది. ఇక, ట్రంప్ ప్రకటించిన టారిఫ్‌లలో అనిశ్చితి ఒపెక్ + ఉత్పత్తిదారుల నుండి పెరుగుతున్న ఉత్పత్తితో పాటు పెట్టుబడిదారులను టెన్షన్ పెట్టగా? చమురు ధరలు కూడా పడిపోయాయి. అయితే, ఇరానియన్ చమురు ఎగుమతులపై ఆంక్షలు నష్టాలను పరిమితం చేశాయి. అలాగే, గత వారం చివర్లో అమెరికా ద్రవ్యోల్బణ డేటాపై ఆధారపడి? భౌగోళిక రాజకీయ అనిశ్చితి కారణంగా బంగారం ధరలు కూడా పడిపోయాయి. చివరికి, క్రిప్టోకరెన్సీ కూడా నవంబర్ తర్వాత కనిష్ట స్థాయిని తాకింది.అమెరికా ఫెడరల్ రిజర్వ్? మాంద్యాన్ని ఎదుర్కోవడం కోసం చాలా ప్రయత్నాలు చేస్తూ వస్తోంది. నాలుగు దశాబ్దాలలో అత్యంత తీవ్రమైన ద్రవ్యోల్బణాన్ని తగ్గించి, అమెరికా ఆర్థిక వ్యవస్థ మాంద్యంలోకి మునిగిపోకుండా కాపాడారు. అయితే, ఇటీవలి ఆర్థిక నివేదికల ప్రకారం? దేశం ఇంకా మాంద్యం ప్రమాదం నుండి బయటపడలేదని హెచ్చరించాయి. నిజానికి, 2006లో హౌసింగ్ మార్కెట్ పతనం వంటి ఆర్థిక అసమతుల్యతల నుండి? 2020లో ప్రపంచ వ్యాపారాన్ని తీవ్రంగా దెబ్బతీసిన కరోనా మహమ్మారి వంటి ఆర్థిక షాక్ వరకు మాంద్యాలు అనేక విధాలుగా మొదలౌతాయి. అయితే, ఇప్పుడు అమెరికా ఎదుర్కుంటున్న మాంద్యం ఇంతకు మించింది. అనేక వ్యాపారాలు, వినియోగదారులు ఎదుర్కొంటున్న కఠినమైన ఆర్థిక పరిస్థితుల నుండి ఈ మాంద్యం పెరుగుతున్నట్లు కనిపిస్తోంది. గతేడాది ఫెడ్ వడ్డీ రేట్లను 23 సంవత్సరాల్లో అత్యధిక స్థాయికి పెంచడం ద్వారా? ఆస్తిని కొనుగోలు చేయడానికి రుణాలు కోరుకునే వాళ్లకి, లేదంటే, క్రెడిట్ కార్డ్ రుణాన్ని ఉన్న అమెరికన్లను మరింతగా ఇబ్బందులకు గురిచేస్తోంది. ఇక, ఇటీవలి మార్కెట్ పతనం ఆర్థిక వ్యవస్థపై విశ్వాసాన్ని దెబ్బతీసింది. దీనితో కంపెనీలు ఉద్యోగాలను తగ్గించడం, కొత్త నియామకాలను నిలిపివేయడం వంటి సమస్యలు పెరిగే అవకాశం ఉంది. అదే సమయంలో వినియోగదారులు డబ్బు ఖర్చు చేయడానికి వెనుకాడే పరిస్థితి వస్తోంది. ఇదే మాంద్యాన్ని మరింత పెంచే అవకాశం ఉంది. ట్రంప్ మాత్రం దాని దిశగా ఎలాంటి కామెంట్లు చేయట్లేదు. పైగా, 2025లో ఆర్థిక మాంద్యం వస్తుందా అని ట్రంప్‌ను అడిగితే మండిపడుతున్నారు. 'ఇలాంటి విషయాలను అంచనా వేయడం అసహ్యం అనీ? ఇది పరివర్తన కాలం గనుక? యునైటెడ్ స్టేట్స్‌కు డబ్బును తిరిగి తీసుకొచ్చే క్రమంలో? కాస్త సమయం పడుతుందంటూ వ్యాఖ్యానిస్తున్నారు. అయితే, అమెరికా ఆర్థిక వ్యవస్థ పటిష్టమైన స్థితిలో ఉందని, కానీ రుణ వ్యయాలను తగ్గించుకునేందుకు అప్రమత్తంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని ఫెడరల్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ అన్నారు. మరోవైపు, మార్కెట్లు పతనం అవుతున్నా ఆర్థిక వ్యవస్థ మాత్రం బలంగానే ఉందని వైట్ హౌస్ అధికార వర్గాలు చెబుతున్నాయి. మాంద్యం భయాలు అవసరం లేదనీ? ట్రంప్ వేస్తున్న సుంకాల విషయంలో కూడా అస్పష్టత త్వరలో తొలగిపోతుందని అంటున్నారు. ఈ పన్ను కోతలు పెట్టుబడులను ప్రోత్సహిస్తాయని ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.పరిస్థితుల్లో ఇన్వెస్టర్లకు ఉన్న ఒకే ఒక్క హోప్? ఫెడరల్ రిజర్వ్, వడ్డీ రేట్లపై తీసుకునే నిర్ణయం మాత్రమే. అందుకే, దాని కోసం పెట్టుబడీదారులు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరీ, రాబోయే రోజుల్లో ఏం జరుగుతుందో చూడాలి.

# నాయకులు ప్రజల్లోంచి పుట్టాలన్నాడు.... ఎమ్మెల్సీని మాత్రం అన్నకు ఇచ్చుకున్నాడు

- మొదటి పేజీ తరువాయి
గతంలో నాయకులు ప్రజల్లోంచి పుట్టాలన్న పవన్... ఇప్పుడు ఎమ్మెల్సీని తన అన్నకు ఇచ్చుకున్నాడని ఆరోపించారు. కుటుంబ, వారసత్వ రాజకీయాలకు వ్యతిరేకమన్న పవన్... ఇప్పుడు అన్నకు ఎలా లబ్ధి చేకూర్చాడని ప్రశ్నించారు. గతంలో ఉత్తరాది వారి అహంకారం ఏమిటి? ఉత్తరాది వారు పెత్తనం చలాయించడం ఏంటి? అని చించుకున్న పవన్ కల్యాణ్... ఇప్పుడు ఉత్తరాది వారిని కాపాడడం కోసం ఓ సైనికుడిలా తయారయ్యాడని విమర్శించారు. షణ్ముఖ వ్యూహం అంట... అదేంటో తనకు అర్థం కావడంలేదని అంబటి అన్నారు. ఒక్కో వ్యూహం మార్చుకుంటూ వెళుతుండడమేనా షణ్ముఖ వ్యూహం అని వ్యాఖ్యానించారు. "మొదటేమో ఎర్ర కండువా వేసున్నాడు... మళ్లీ కాషాయ రంగు కండువా వేసుకున్నాడు. ఎందుకు అలా వ్యూహం మార్చాడనేది, ఎందుకు అలా సిద్ధాంతం మార్పు చెందుతూ వచ్చిందనేది చెప్పాలి కదా. ఎక్కడో చోట సెటిల్ అవ్వాలి కదా... సెటిల్ అవ్వడంలేదు... గాలికి కొట్టుకుపోతున్నాడు. అప్పట్లో తుపాకీ గొట్టం ద్వారా రాజ్యాధికారం రావాలి అన్నాడు... మీకు గుర్తుందోలేదో కానీ.... మా వాడు అడవుల్లోకి వెళ్లిపోతాడేమోనని భయపడ్డామండీ అన్నాడు" అని అంబటి వివరించారు. ఇక, బాలినేని వంటి నేతలను నమ్ముకుని పవన్ కల్యాణ్ రాజకీయాలు చేస్తే గోవిందా గోవింద అంటూ వ్యంగ్యం ప్రదర్శించారు.

# జైల్లో నా పట్ల కఠినంగా వ్యవహరించారు

- మొదటి పేజీ తరువాయి
తన పట్ల కఠినంగా వ్యవహరించారని, తనపై భౌతికంగా దాడి చేశారని ఆరోపించారు. అసోంలోని డెర్గావ్‌లో గల లచిత్ బర్ఫుకాన్ పోలీస్ అకాడమీ ప్రారంభోత్సవం సందర్భంగా అమిత్ షా మాట్లాడుతూ, అసోంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు నిర్బంధాలను ఎదుర్కొన్నానని అన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అసోంలో శాంతికి ఏమాత్రం కృషి చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చిన పదేళ్లలో రాష్ట్రంలో శాంతిభద్రతలు మెరుగయ్యాయని అన్నారు. పది వేల మంది యువత ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశారని

పేర్కొన్నారు. మొఘలుల దాష్టీకాలను, సామ్రాజ్యవాదాన్ని ఎదుర్కొన్న లచిత్ బర్ఫుకాన్ పేరును పోలీస్ అకాడమీకి పెట్టడం హర్షణీయమన్నారు. చరిత్రను కేవలం అసోంకు మాత్రమే పరిమితం చేయకుండా దేశవ్యాప్తంగా తెలియజేయాల్సి ఉందని అన్నారు.

# శ్రీశైలం భక్తులను ముంచేస్తున్న నకిలీ వెబ్ సైట్

- మొదటి పేజీ తరువాయి
వెబ్ సైట్ ను సందర్శిస్తూ ఉంటారు. ఈ క్రమంలో ఒక మోసం తెరపైకి వచ్చింది. వసతి కోసం దేవస్థానం అధికారిక వెబ్ సైట్ ను సందర్శించే భక్తులను మోసం చేస్తున్న ఘటన వెలుగులోకి వచ్చింది. కొందరు కేటుగాళ్లు శ్రీశైలం దేవస్థానం పేరుతో నకిలీ వెబ్ సైట్ క్రియేట్ చేశారు. ఈ క్రమంలో కొందరు భక్తులు తెలియక ఆ వెబ్ సైట్ లోకి వెళ్లి, డబ్బులు కూడా చెల్లించారు. శ్రీశైలంకు వచ్చిన తర్వాత తాము మోసపోయామనే విషయాన్ని సదరు భక్తులు గుర్తించారు.

వెంటనే ఆలయ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో, నకిలీ వెబ్ సైట్ గుట్టు రట్టయింది. మరోవైపు, ఇలాంటి మోసాలు జరగకుండా ఆలయ అధికారులు దృష్టి పెట్టాలని భక్తులు కోరుతున్నారు.

# ఏపీ సర్కార్ ఆసక్తికర నిర్ణయం... ఎంపీలు, ఎమ్మెల్యేలకు అవార్డులు!

**పెన్ పవర్ డెస్క్:**ఏపీలోని కూటమి ప్రభుత్వం ఆసక్తికర నిర్ణయం తీసుకుంది. ప్రజలకు ఎంపీలు, ఎమ్మెల్యేలను మరింత చేరువ చేసేందుకు వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. ఎవరైతే ప్రజా సమస్యలు తెలుసుకుని వారి కోసం అసెంబ్లీలో, పార్లమెంట్‌లో పోరాటం చేస్తారో వారికి అవార్డులు ఇవ్వాలని నిర్ణయించింది. పార్టీలకు అతీతంగా ఈ అవార్డుల ప్రదానం ఉంటుందని తెలిపింది. ఏ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అయినా సరే ప్రజల వద్దకు వెళ్లాలని కోరింది. ఇలా ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రజలకు మరింత దగ్గరవుతారని, ప్రజల సమస్యలను అసెంబ్లీ, పార్లమెంట్‌కు వినిపిస్తారని భావిస్తోంది. ఇక ప్రజా సమస్యలపై అసెంబ్లీలో గళం విప్పితే 'ఉత్తమ లెజిస్లేచర్', అదే పార్లమెంట్లో అయితే 'ఉత్తమ పార్లమెంటేరియన్' తరహాలో అవార్డులు ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం. ఇందులో భాగంగా సభలో సభ్యుల పనితీరు, వారి ప్రవర్తనను పరిగణలోకి తీసుకుని అవార్డు అందజేయనుందని తెలుస్తోంది. కాగా, విజేతల ఎంపిక కోసం ఓ ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి, ఆ కమిటీ ఎంపిక చేసిన ఎంపీ, ఎమ్మెల్యేలకు అవార్డులు అందిస్తారని సమాచారం.

# గుంటూరు మేయర్ మనోహర్ నాయుడు రాజీనామా

**పెన్ పవర్ డెస్క్:**గుంటూరు మేయర్, వైసీపీ నేత కావటి మనోహర్ నాయుడు తన పదవికి రాజీనామా చేశారు. 2021లో మేయర్‌గా ఎన్నికైన మనోహర్, ఏడాది పదవీకాలం ఉండగానే రాజీనామా చేశారు. కాగా, గత నెలలో జరిగిన గుంటూరు నగరపాలక స్టాండింగ్ కమిటీ ఎన్నికల్లో ఆరు స్థానాలను టీడీపీ, జనసేన కార్పొరేటర్లు కైవసం చేసుకున్నారు. అటు, వైసీపీ నుంచి కార్పొరేటర్లు కూటమిలో చేరడంతో వైసీపీకి పరాభవం తప్పలేదు. ఈ నెల 17న స్టాండింగ్ కమిటీ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో మనోహర్ నాయుడిపై అవిశ్వాస తీర్మానం పెట్టే అవకాశం ఉంది. మరోవైపు గత కొంతకాలంగా నగర కమిషనర్ పులి శ్రీనివాసులు, మేయర్ మనోహర్ మధ్య వివాదం నెలకొంది. ఈ నేపథ్యంలో మరో ఏడాది పదవీకాలం ఉండగానే ఆయన రాజీనామా చేశారు.

## పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తాం

**పెన్ పవర్ డెస్క్:**పారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తాపింపారిశుధ్యం, పరిసరాల పరిశుభ్రత పట్ల ప్రజల్లో చైతన్యం కల్పించేందుకు మంగళగిరి నియోజకవర్గంలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తామని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి ఎయిమ్స్ సమీపంలోని ఎకో పార్క్ లో నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. పార్క్ లో చెత్తను శుభ్రంచేసి స్వయంగా చెత్తకుండీలో వేశారు. పారిశుధ్య కార్మికుడు ఎమ్.నాగార్జున యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పారిశుధ్య కార్మికుడు నాగార్జునను మంత్రి శాలువాతో సత్కరించారు. అంతకుముందు ఎకో పార్క్ లో వాకింగ్ చేసే మంగళగిరివాసులకు సొంత నిధులు రూ.5 లక్షలు వెచ్చించి ఉచిత ప్రవేశం కల్పించిన మంత్రి నారా లోకేష్ ను నేచర్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఏపీ మంత్రి నారా లోకేశ్ ఇవాళ మంగళగిరిలోని ఆల్ఫా అరేబియన్ రెస్టారెంట్ వద్ద పారిశుధ్య కార్మికులతో కలిసి టీ తాగారు. వారితో ఉల్లాసంగా ముచ్చటించారు. వారిని సత్కరించి, కానుకలు అందజేశారు. ఈ విషయాన్ని లోకేశ్ తన సోషల్ మీడియా అకౌంట్ల ద్వారా వెల్లడించారు. "మంగళగిరి పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచుతూ, తెర వెనుక యోధులు అనదగ్గ పారిశుధ్య కార్మికులను కలవడం గౌరవంగా భావిస్తున్నాను. పని పట్ల వారి అంకితభావం నిజంగా స్ఫూర్తిదాయకం. మన వీధులు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి వారు అవిశ్రాంతంగా శ్రమిస్తుండడం పట్ల ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను" అని లోకేశ్ వివరించారు. ఈ మేరకు పారిశుధ్య కార్మికులతో ఫొటోలను పంచుకున్నారు.

# పాకిస్థాన్ లో ఆర్మీ కాన్వాయ్ పై మరో దాడి

- మొదటి పేజీ తరువాయి
దాడి జరగడం గత 24 గంటల్లో ఇది రెండోసారి. హర్నైలో బాంబ్ డీఫ్యూజ్ స్క్వాడ్ రైల్వే ట్రాక్ ని క్లియర్ చేస్తున్న సమయంలో బాంబు పేలుడు జరిగింది. ఈ వారం ప్రారంభంలో బోలాన్ ప్రాంతంలో క్వెట్టా నుంచి పెషావర్ వెళుతున్న రైలును బలూచ్ లిబరేషన్ ఆర్మీ (బీఎల్ఏ) హైజాక్ చేసింది. 200కు పైగా పాకిస్థాన్ సైనికులు, ఐఎస్ఐ సిబ్బందిని బీఎల్ఏ బందీలుగా పట్టుకుంది. తమకు చెందిన ఖైదీలను పాక్ ప్రభుత్వం విడుదల చేయాలని, లేకపోతే అందరినీ చంపేస్తామని పాక్ ప్రభుత్వానికి అల్టిమేటం విధించింది. అయితే, తాము విధించిన గడువు ముగియడంతో... 214 మందిని చంపేశామని బీఎల్ఏ ప్రకటించింది.

## రేవంత్ రెడ్డి 'మార్చురీ' అన్న పదం ఒక వ్యక్తిని ఉద్దేశించి అన్నది కాదు

- మొదటి పేజీ తరువాయి
రాజకీయంగా ఎదుర్కోవాలని ఆమె అన్నారు. సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ప్రచారం చేయడం, బాడీ షేమింగ్ చేయడం సరికాదని ఆమె హితవు పలికారు. సామాజిక మాధ్యమాల్లో కొందరు చేసిన పోస్టులతో తానూ ఇబ్బందిపడ్డానని అన్నారు. తనపై పెట్టిన పోస్టులకు మానసికంగా ధైర్యాన్ని కోల్పోయానని అన్నారు. నిజాయతీగా పని చేసే మహిళల ధైర్యాన్ని సోషల్ మీడియా దెబ్బతీస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సోషల్ మీడియాకు హద్దు ఉండాలని ఆమె అభిప్రాయపడ్డారు. బీఆర్ఎస్ అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్‌గా మారిందని విమర్శించారు. ఒక అబద్ధాన్ని వందసార్లు చెబితే నిజం అవుతుందని బీఆర్ఎస్ నమ్ముతున్నట్లుగా ఉందని ఆమె అన్నారు. సోషల్ మీడియాలో బీజేపీ, బీఆర్ఎస్ అన్నదమ్ములని ఎద్దేవా చేశారు.

## చంద్రబాబు, పవన్ కల్యాణ్ కు హరిరామజోగయ్య బహిరంగ లేఖ

- మొదటి పేజీ తరువాయి
కానీ మిగిలిన జిల్లాల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.ఉభయగోదావరి జిల్లాలను దత్తత తీసుకుంటానని వారాహి సభలో పవన్ కల్యాణ్ చెప్పారని... ఆ జిల్లాల అభివృద్ధి కోసం ఏం చేశారో పవన్ చెప్పాల్సిన అవసరం ఉందని జోగయ్య పేర్కొన్నారు. సాగునీరు, తాగునీరు, విద్య, వైద్యం, రోడ్లు, రవాణా, పరిశ్రమలు, వ్యవసారం, వ్యాపారం, ఓడరేవులు తదితర అంశాలపై కూడా దృష్టి సారించాలని సూచించారు. ఏళ్ల తరబడి సమగ్ర అభివృద్ధికి నోచుకోని ఉభయ గోదావరి జిల్లాలకు కూటమి ప్రభుత్వం ఏయే పథకాలకు ఎంతెంత ఖర్చు చేసిందో శ్వేతపత్రం విడుదల చేయాలని జోగయ్య డిమాండ్ చేశారు. ప్రతి జిల్లాకు ప్రతి ఏడాది ఎంత ఖర్చు చేశారనే దానిపై శ్వేతపత్రం విడుదల చేస్తే ప్రజలు సంతోషిస్తారని సూచించారు.

## హిందీ తప్పనిసరి అని అందులో ఎక్కడా చెప్పలేదు

- మొదటి పేజీ తరువాయి
విద్యార్థులకు ఒక విదేశీ భాషతో పాటు తమ మాతృభాషతో సహా రెండు భారతీయ భాషలను నేర్చుకునే అవకాశం ఉంది. హిందీ నేర్చుకోవడానికి ఇష్టం లేనివారు తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, మరాఠీ, సంస్కృతం, గుజరాతీ, అస్సామీ, కాశ్మీరీ, ఒడియా, బెంగాలీ, పంజాబీ, సింధీ, బోడో, డోగ్రీ, కొంకణి, మైథిలి, మెయిటీ, నేపాలీ, సంతాలీ, ఉర్దూ లేదా ఇతర భారతీయ భాషలను ఎంచుకోవచ్చు. బహుళ భాషా విధానం విద్యార్థులకు ఎంపిక చేసుకునే స్వేచ్ఛను ఇవ్వడానికి, జాతీయ ఐక్యతను ప్రోత్సహించడానికి, భారతదేశ గొప్ప భాషా వైవిధ్యాన్ని పరిరక్షించడానికి రూపొందించారు. రాజకీయ ఎజెండాల కోసం ఈ విధానాన్ని తప్పుగా అర్థం చేసుకోవడం, నేను వైఖరిని మార్చుకున్నానని చెప్పడం కేవలం అవగాహన లేమిని ప్రతిబింబిస్తుంది. భాషా స్వేచ్ఛ, ప్రతి భారతీయుడికి విద్యా స్వేచ్ఛ అనే సూత్రానికి జనసేన పార్టీ కట్టుబడి ఉంటుంది" అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు.

## కేంద్రంపై ఉమ్మేస్తే... ఆకాశంపై ఉమ్మేసినట్టే

- మొదటి పేజీ తరువాయి
అమలు చేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం మీద ఉమ్మేస్తే ఆకాశం మీద ఉమ్మేసినట్టేనని చెప్పారు. కేంద్రంపై, బీజేపీ నేతలపై విమర్శలు చేయడాన్ని మానుకోవాలని హితవు పలికారు. అసెంబ్లీలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. రాజకీయ నాయకుల స్టేచర్ గురించి కాకుండా రైతుల ఫ్యూచర్ గురించి ఆలోచించాలని అన్నారు. కష్టాల్లో ఉన్న రైతులను ఆదుకోవాలని చెప్పారు. రైతు సమస్యలపై అసెంబ్లీలో చర్చించాలని సూచించారు.

## దేశవ్యాప్తంగా కులగణన చేపట్టాలి

- మొదటి పేజీ తరువాయి
ఈ దిశగా చర్యలు తీసుకోవాలని ఆమె అన్నారు. కాన్షీరామ్ జయంతి సందర్భంగా 'ఎక్స్' వేదికగా ట్వీట్ చేసిన ఆమె కులగణన చేయాలని పునరుద్ఘాటించారు.సమగ్ర అభివృద్ధి కోసం జనగణన అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. ప్రభుత్వం దీనిని విస్మరించకూడదని పేర్కొన్నారు. కులగణన చేయకుంటే అది సుపరిపాలన కాబోదని ఆమె రాసుకొచ్చారు. కులగణన చేయకపోవడంపై ఒక పార్లమెంటరీ కమిటీ కూడా అసంతృప్తిని వ్యక్తం చేసిందని గుర్తు చేశారు.ఉత్తరప్రదేశ్‌లో 80 శాతం మంది బహుజనులు ఉన్నారని, ఇలాంటి చోట్ల కులగణన చాలా ముఖ్యమని పేర్కొన్నారు. మరో ట్వీట్‌లో మాయావతి తనను తాను ఉక్కు మహిళగా పేర్కొన్నారు. ఉక్కు మహిళ నాయకత్వంలోని బీఎస్పీ మాటల కంటే చేతలకు ఎంతటి విలువను ఇస్తుందో ఉత్తరప్రదేశ్ ప్రజలకు తెలుసని అన్నారు.



పెన్ పవర్
ప్రకాశం

# వైద్య శాల ఎప్పుడు తెరుస్తారు ??

# ఎప్పుడు మూస్తారో తెలపండి ?

## అనుమలవీడు వైద్యశాల డాక్టర్ల డ్యూటీలు తెలపండి ??

## వైద్యాధికారులు ఎప్పుడు వస్తారు ?

## ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపమా ?






**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

గిద్దలూరు నియోజకవర్గం రాచర్ల మండలం అనుమలవీడు గ్రామములో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్ ఇది. ఇక్కడ డాక్టర్లు ఎప్పుడు వస్తారో ఎప్పుడు పోతారో తెలియదు. ఇప్పుడు హాస్పిటల్ కు వెళితే ఇద్దరు డాక్టర్లలో ఒక్కరు కూడా ఉండరు. ఒక డాక్టర్ ఏమో పలుగుంటి పల్లి గ్రామములో 104 డ్యూటీ లో ఉన్నారంట. ఇంకో డాక్టర్ ఎక్కడ డ్యూటీ చేస్తున్నట్లు. ఈ హాస్పిటల్ ఏమో 24 గంటల హాస్పిటల్ అంట. కాని రాత్రి డ్యూటీలో ఎవరు ఉంటారో ఇంత వరకు ఎవరికీ తెలియని రహస్యం. రాత్రి పూట ఎలియన్స్ వచ్చి డ్యూటీ చేస్తారు అని గ్రామ ప్రజలు అంటున్నారు. ఎన్నో పిర్యాదులు వచ్చాయి ఈ హాస్పిటల్ మీద కాని ఇంత వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ మధ్య డీఎం%ఇ%ఎహెచ్ ఓ వచ్చారు 5 మంది స్టాఫ్ కు మెమో ఇచ్చారు అయినా సిబ్బంది మారలేదు. సిఎం%ఇ%ఎహెచ్ ఓ ఇలాంటి సిబ్బంది మాకు అవసరం లేదు. మొన్న మీరు వచ్చారు వెళ్లారు ఎలాంటి మార్పు లేదు. సిబ్బందికి ఒంటి పూట స్కూల్స్ లాగ ఉదయం 11 నుండి మధ్యాహ్నం1 గంట వరకు డ్యూటీ వేయండి. రాత్రి పూట ఎలియన్స్ కు డ్యూటీ వేయండని ప్రజలు వాపోతున్నారు. ఇక్కడ వైద్య శాల ఉండి ఉపయోగం ఏమిటని ప్రజలు విమర్శలు గుప్పిస్తున్నారు. డాక్టర్లు రాకపోతే వైద్య శాల ఎందుకు!! పూర్వం అప్పటి మంత్రి పిడతల రంగారెడ్డి కృషి ఫలితంగా ఇక్కడ వైద్యశాలను ఏర్పాటు చేశారు. కానీ నేడు ఆవైద్యశాలకు డాక్టర్లను నియమించిన వారు రారు, ఇక్కడ నిర్మించిన డాక్టర్ క్వార్టర్స్ సిబ్బంది క్వార్టర్స్ శిధిలమయ్యాయి, ఆక్రమణలకు గురువుతున్నా పట్టించుకునేనాదుడే కరువయ్యారు అనే ఆరోపణలు ఉన్నాయి. ఎన్ని ఫిర్యాదులు చేసినా చర్యలు లేక పోవటం తో రౌతు మెత్తనైతే గుర్రం మూడు కాళ్లతో నడుస్తుందని సామెత గుర్తు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఈ వైద్యశాలపై దృష్టి సారించి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందెలాచూడాలని ప్రజలు కోరుతున్నారు.



# పోలం కాదు

# తహశీల్దారు కార్యలయ ప్రాంగణం

**ఆర్ సి ఇన్ చార్జీ యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి 15**



ఎండి పోయిన ఈ చెట్లను చూస్తే నీళ్ళ కరువు కొరతతొ ఎండిపోయిన పొలంలోని ఏ కంది పంటో,మిర్చిపంటో అనుకుంటే పోరపాటే.మండలానికి కేంద్ర బిందువు అయిన తహశీల్దారు కార్యలయం ప్రాంగణం.రాష్ట్ర వ్యాపితంగా స్వర్ణ ఆంద్ర, స్వచ్ఛ ఆంధ్ర ,స్వచ్ఛ దివాస్, అంటు పారిశు ధ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని ప్రతిజ్ఞలు చేసి అవగాహన కార్యక్రమాలు చేపడుతుంటే, తహశీల్దారు కార్యలయంలో మాత్రం ఇలా పోలాన్ని తలపిస్తున్న దృశ్యం విమర్శలకు తావిస్తుంది.పట్టణ నడిబొడ్డున ఉన్న ఈ తహశీల్దారు కార్యలయానికి నిత్యం వందల సంఖ్యలో ప్రజలు వస్తుంటారు,అప్పుడప్పుడు మార్కాపురం సబ్ కలెక్టర్ ,డిప్యూటి కలెక్టర్లు ,జిల్లాఅధికారులు వివిధ కార్యక్రమాలకు సందర్శిస్తుంటారు, అయిన కార్యలయంలో నెలకొన్న అపరిశుభ్రతతను పట్టించుకున్న చర్యలు మాత్రం లేవు.కార్యలయ ప్రాంగణంలోని సర్వేయర్లు,విఆర్ ఓలు ఉండే గదుల ఎదుటే అడవిని తలపిస్తున్నా ఈ చెట్లను తోలగించక పొవడంతో విష సర్పాలు ఈ ప్రాంతంలో వాకింగ్ చేస్తునేఉంటాయి.ఇటివల కాలంలో తహశీల్దారు కార్యలయం ఇన్ చార్జీ అధికారులతో, సస్పెండ్ల పర్వంతొ గందరగోళం నెలకోని ఉంది. కార్యలయ ప్రాంగణంలో ఏపుగా పెరిగిన చెట్లను తొలగించి ,తహశీల్దారు కార్యలయంలో పరిశుభ్రతకు చోటివ్వాలని మండల ప్రజలు కోరుతున్నారు.



# అకాల పొగ మంచుతో అల్లాడిన

# ప్రయాణికులు, ప్రజలు



అకాల
వర్షాలు గురించి విన్నాము కానీ
అకాల పొగ మంచు గతంలో ఎప్పుడూ
సంభవించలేదని వ్యాఖ్యానిస్తున్న ప్రజలు.
శనివారం ఉదయం 6 గంటల నుంచి గంట
పాటు దట్టంగా వ్యాపించిన పొగ మంచు.
ఇబ్బందులు పడ్డ ప్రయాణికులు,
ప్రజలు.

**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**

అకాల వర్షాల గురించి విన్నాము కానీ ,అకాల పొగ మంచు గురించి ఎప్పుడు వినలేదని ఈరోజే చూస్తున్నామని కొమరోలు మండల ప్రజలు వ్యాఖ్యానిస్తున్నారు.సాధారణంగా పొగ మంచు చలికాలంలో డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి మాసాలలో కురుస్తూ ఉంటుందని రైతులు చెబుతున్నారు.అయితే ఈ నెల 15వ తేదీ శనివారం ఉదయం అకాల పొగ మంచు దట్టంగా వ్యాపించడంతో ప్రజలు ఆశ్చర్యానికి, ఇబ్బందులకు గురయ్యారు .శనివారం ఉదయం 6 గంటల వరకు వాతావరణం చల్లగా ఉండింది.ఆరు గంటల నుంచి ఆకస్మికంగా పొగ మంచు దట్టంగా వ్యాపించడం ప్రారంభించింది.అయితే సాధారణ రోజులలో పొగ మంచు ప్రారంభంలో దట్టంగా వ్యాపించినప్పటికీ, తెల్లవారి సూర్యకిరణాలు ప్రసరించే కొలది పొగ మంచు పలుచబడి పోతూ ఉండేది.అయితే శనివారం ఉదయం వ్యాపించిన పొగ మంచు ప్రారంభంలో కొంత పల్చగా ఉన్నప్పటికీ సమయం గడిచే కొలది దట్టంగా వ్యాపించడం ప్రారంభించింది.దాదాపు గంటపాటు పొగ మంచు దట్టంగా వ్యాపించి ప్రజలను ప్రయాణికులను ఇబ్బందుల గురిచేసింది.ఆ సమయంలో చిన్నారులు, వృద్ధులు, రోగులు ఇల్లు దాటి బయటకు వచ్చేందుకు, ప్రయాణాలు సాగించేందుకు తీవ్ర అసౌకర్యానికి గురి అయ్యారు. పొగ మంచులో తిరగటం, తడవటం ఆరోగ్యానికి అంత మంచిది కాదని డాక్టర్లు సలహాలు ఇస్తున్నారు.

# వెలుగొండ ప్రాజెక్టు ముంపు గ్రామాల

# ప్రజల సమస్యలు పరిష్కరించాలి

*జిల్లా కలెక్టర్ ను కలిసి డిమాండ్లతొ వినతిపత్రం అందజేసిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్'*

*తమ సమస్యలు పరిష్కరించాలని కోరిన సుంకేసుల గ్రామస్తులు*



**ఆర్ సి ఇన్ చార్జీ యర్రగొండపాలెం పెన్ పవర్ మార్చి15**

ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం తదితర విషయాల్లో, పార్టీలకతీతంగా, పక్షపాత ధోరణితో లేకుండా అరత ఉన్న ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత వరుస క్రమంలో ఇవ్వాలని వైయస్సార్ సిపి రాష్ట్ర అధికారప్రతినిధి ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియాను కోరారు.శనివారం సుంకేసుల గ్రామస్తులు ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ఆద్వర్యంలో తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాను, మరియు జిల్లా జాయింట్ కలెక్టర్ ఆర్.గోపాలకృష్ణ లను విన్నవించుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మాట్లాడుతు గెజిట్ నోటిఫికేషన్ లో ఉన్న జాబితా ప్రకారం వరుస క్రమంలో పరిహారం అందజేయాలని,గెజిట్ లో ఉన్న ప్రతి ఒక్కరికి ప్యాకేజి మంజూరు చేయాలని,ముంపు గ్రామాల పునరావాస కాలనీలో వెంటనే అభివృద్ధి పనులు పూర్తిచేయాలని,18 సంవత్సరాలు నిండిన యువతి యువకులకు ప్రత్యేక ప్యాకేజి ఇవ్వాలని,కోరారు.అర్హత ఉండి సర్వేలో మిగిలిపోయిన కుటుంభాలకు గెజిట్ లో చేర్చాలని,2148 కుటుంభాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి మంజూరై మిగిలిన 848 మందికి పెండింగ్ పూర్తిచేయాలని, డిమాండ్లతొ కూడిన వినతి పత్రాన్ని అందజేసారు. ఎమ్మెల్యే వెంట వైసీపీ మండల పార్టీ కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి,సుంకేసుల సర్పంచ్ గుడ్డేపొగు రమేష్ ,నాయకులు కోటకొండ కోటేశ్వరరావు, మల్ల పెద్దగాలిం,మాజీ సర్పంచి మోటకట్ల అక్కిరెడ్డి,ఆవుల నాగిరెడ్డి, ఏరువ సహదేవుడు,సానికొమ్ము పుల్లారెడ్డి,ఆవుల శ్రీనివాసరెడ్డి,గుర్రం ముత్యాలయ్య,రేల రమణారెడ్డి, భోగెం రామకృష్ణుడు, తంగిరాల ఆవులయ్య,భూతపాటి రామయ్య, మండ్లా రామయ్య, గుర్రం నడిపి అల్లూరయ్య,చిన్న మస్తాన్,నాసర్ రెడ్డి,అంజి నరసింహులు,తదితరులు ఉన్నారు.



# ప్లాస్టిక్ రహిత పట్టణంగా గిద్దలూరు తీర్చిదిద్దేందుకు కృషి చేదాం

## స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

## గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల






**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

పారిశుధ్యం, పరిసరాల శుభ్రత పట్ల ప్రజల్లో మార్పు రావలసిన అవసరం ఎంతైనా ఉందని, ప్రజల్లో చైతన్యం కల్పించేందుకే ఈ ర్యాలీలు నిర్వహిస్తున్నామని గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వం శనివారం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొని ప్రసంగించారు గిద్దలూరు పట్టణం సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల అశోక్ రెడ్డి పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పట్టణంలోని నగర పంచాయతీ కార్యాలయం నుండి మెయిన్ బజారు మీదుగా పొట్టి శ్రీరాములు విగ్రహం వరకు నిర్వహించిన ర్యాలీలో గిద్దలూరు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం "స్వచ్ఛ ఆంధ్ర " ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో గిద్దలూరును ముందంజలో ఉంచడంతో పాటు ప్లాస్టిక్ రహిత నియోజకవర్గగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రతి నెల మూడవ శనివారం జరిగే స్వర్ణాంధ్ర-స్వచ్ఛఆంధ్ర కార్యక్రమంలో అధికారులు ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కరూ పాల్గొని గిద్దలూరు పట్టణాన్ని పరిశుభ్రంగా



ఉంచేందుకు చర్యలు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో ప్లాస్టిక్ ను పూర్తిగా నిర్మూలించడానికి ప్రతి ఒక్కరు సమన్వయంతో పని చేయాలన్నారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై పట్టణాన్ని, వార్డులను పరిశుభ్రంగా తీర్చిదిద్దాలన్నారు. కాలుష్య కారకాలైన ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించి ప్లాస్టిక్ రహిత పట్టణంగా గుర్తింపు తీసుకురావాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ్ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ అంకితభావంతో పనిచేసి ప్రభుత్వ ప్రైవేటు కార్యాలయాలను, పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ప్రజలు కూడా ఎక్కడా పడితే అక్కడ చెత్త వేసేవిధాననికి స్వస్తి పలికి పారిశుధ్య కార్మికులు సహకరించాలన్నారు. కొందరు చెత్త చెదారాలను సైడ్ కాలువల్లో వేయటం, నిర్ధేశించిన ప్రదేశాల్లో కాకుండా రోడ్లపై వేయటం చేస్తుంటారని, అలా చేయటం మురికి చేరటం, అది డ్రైనేజీల్లో కదిలి పోకపోవటం వలన మనకే దుర్వాసన లు వేడెజల్లుతాయనిపేర్కొన్నారు పారిశుధ్య కార్మికులు కూడా మన తోటి మనుషులేనని గుర్తించాలన్నారు డ్రైనేజీల్లో ఎక్కువగా ప్లాస్టిక్ వ్యర్థాలు వేస్తుంటారని , డ్రైనేజి నుంచి పారిశుధ్య కార్మికులు వెలికి తీయాలంటే ఎంత కష్టమో ప్రజలు ఆలోచించాలని అశోక్ రెడ్డికోరారు. సైడ్ కాలువల్లో, డ్రైనేజీల్లో ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలను, చెత్తా చెదారాలను వేయవద్దని హితవుపలికారు. ఈ కార్యక్రమంలో గిద్దలూరు నగర పంచాయతీ చైర్మన్ పాముల వెంకట సుబ్బయ్య, కమిషనర్ ఐ. శ్రీనివాసులు, ఎమ్మార్వో ఆంజనేయ రెడ్డి, పట్టణ కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే కదిరి కుటుంబ సభ్యులు





**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 15**

మాలకొండ శ్రీ మాల్యాద్రి లక్ష్మి నరసింహ స్వామి వారిని మరియు భైరవకోనలో శ్రీ. త్రిముఖ దుర్గాదేవి, బర్గులేశ్వర స్వామి ,కాలభైరవ స్వామి వార్లను శనివారం కనిగిరి మాజీ ఎమ్మెల్యే కదిరి బాబురావు కుటుంబ సభ్యులు దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.అనంతరం భైరవకోనలో జలపాతాన్ని వీక్షించారు .ఈ సందర్భంగా ఆలయ అర్చకులు స్వామివారి శేష వస్త్రాలతో సత్కరించి ఆశీర్వచనం చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ అధికారిణి అరుణ,వాణి ,సుధా,మాధవి,నిషిత,తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయాధికార్యాలయం స్వర్ణ ఆంధ్రస్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమ



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

గిద్దలూరు మండలం మండల వ్యవసాయాధికార్యాలయం లో స్వర్ణ ఆంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించి, పర్యావరణ పరిరక్షణ, పరిశుభ్రతల ప్రాముఖ్యత పై అవగాహన కల్పించి స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు గిద్దలూరు డి బాలాజీ నాయక్ మాట్లాడుతూ స్వచ్ఛత ఆరోగ్యానికి చాలా ముఖ్యమని ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని,ప్రతినెలా మూడో శనివారము తప్పకుండా ఈ కార్యక్రమం నిర్వహించాలని రైతు సేవా కేంద్ర సిబ్బందికి, డీలర్లకు తెలియజేశారు. అనంతరం కార్యాలయం ప్రాంగణం మొత్తం శుభ్రం చేశారు మండల వ్యవసాయ అధికారి వై విజయ భాస్కర్ రెడ్డి మాట్లాడుతూ ఎల్లప్పుడూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సాంకేతిక వ్యవసాయ అధికారి మహబూబ్ బాషా, రైతు సేవా కేంద్ర సిబ్బంది, వ్యవసాయ ఇన్పుట్ డీలర్స్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నిషేధానికి అందరూ గట్టి కృషి చేయాలి

### పొదిలి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు



**పొదిలి, పెన్ పవర్ మార్చి 15**

ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ గట్టి కృషి చేయాలని పొదిలి నగర పంచాయతీ కమిషనర్ పి శ్రీనివాసులు కోరారు శనివారం నాడు పొదిలిలో స్వచ్ఛభారత్, స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసులు మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు అందువల్ల ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేసి, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి అందరూ పాటుపడాలని ఆయన సూచించారు పొదిలి నగర పంచాయతీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ముల్లా కుద్దూస్ మాట్లాడుతూ సమాజానికి ఇబ్బందికరంగా మారిన ప్లాస్టిక్ వినియోగానికి అందరూ స్వస్తి పలకాలన్నారు ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, విద్యార్థులు, తెలుగుదేశం నాయకులు మాజీ సర్పంచ్ కాటూరి వెంకటనారాయణ ప్రతాప్, మాజీ ఉపసర్పంచ్ షేక్ జిలాని భాష తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కంఠ భరితంగా సాగిన ఎడ్లు బండ లాగుడు పోటీలు

### ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న ఆకవీడు వృషభ రాజాలు





**పెన్ పవర్ గిద్దలూరు మార్చ్ 15**

గిద్దలూరు మండలం నరవ శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు పురస్కరించుకుని రెండు పండ్ల కోడెల బల ప్రదర్శన ను ఆలయ కమిటీ గ్రామా పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించారు. రెండు పండ్ల విభాగంలో 26 కాండ్లు పాల్గొన్నాయి. ఈ బల ప్రదర్శన ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ ఎడ్ల బండ లాగుడు పోటీలను తిలకించేందుకు వేలాదిమంది ఔత్సాహిక, ప్రోత్సాహకు లు శ్రీ స్వామి వారి కొండను సైతం ఆక్రమించుకొని కూర్చొని తిలకించారు.ఈ బల ప్రదర్శన లో రాచర్ల మండలంలోని ఆకవీడు గ్రామానికి చెందిన వృషభ రాజాలు ప్రథమ బహుమతి కైవసం చేసుకో గా,ద్వితీయ బహుమతి గిద్దలూరు మండల %ళి% ముండ్లపాడు గ్రామానికి చెందిన ఎడ్ల జత కైవసం చేసుకో గా,తృతీయ స్థానం లో వై ఎస్ ఆర్ కడప జిల్లా అనువారిపల్లి గ్రామానికి చెందిన ఎడ్ల జత కైవసం చేసుకున్నాయి.ఈ పోటీల్లో 8 బహుమతుల ను అంద చేశారు.మొదటి బహుమతి రాచర్ల మండలం ఆకవీడు గ్రామానికి చెందిన బచ్చ గారి విజయ లక్ష్మి నాయుడు కు చెందిన ఎడ్ల జత 4105.11 అడుగుల బండ ను లాగి ప్రథమ స్థానం లో నిలిచి 20000 నగదు బహుమతి ని కైవసం చేసుకున్నాయి.ద్వితీయ స్థానం లో గిద్దలూరు మండల %ళి% ముండ్లపాడు గ్రామానికి చెందిన కంచర్ల తనీష్ కుమార్ గౌడ్ ఎడ్ల జత3779.8 అడుగుల దూరం బండ ను లాగి ద్వితీయ స్థానం లో నిలువగా, తృతీయ స్థానం లో వై ఎస్ ఆర్ కడపజిల్లా అనువారి పల్లి వృషభ రాజము కంభం మండలం బసినెపల్లి కి చెందిన వెంకట చైతన్య కుమార్ ,శీలం జగన్మోహన్ రెడ్డి ఎడ్లు సంయుక్త %ళి% గా 3739.8 అడుగుల దూరం బండ ను లాగి నగదు బహుమతి ని కైవసం చేసుకున్నాయి.చతుర్ద స్థానం లో ఆకవీడు గ్రామానికి చెందిన బచ్చ గారి విజయ లక్ష్మి నాయుడు ఎడ్ల జత 3721.2 అడుగుల దూరం బండ ను లాగాయి.5,6,7,8 స్థానాల్లో బురుజుపల్లి, గ్రామానికి చెందిన ఎర్రమల బాల వెంకట్ రెడ్డి ఎడ్ల జత ఆరవ స్థానం లో నంద్యాల జిల్లా సింగవరం గ్రామం జమాల్ భాష ఎడ్లు 7 వ స్థానం లో నంద్యాల జిల్లా బ్రాహ్మణ పల్లి కి చెందిన జమ్మయ్య రామ కృష్ణా పురం నాగేంద్ర కు చెందిన ఎడ్ల జత నిలిచాయి. ఎనిమిద వ స్థానము లో నంద్యాల జిల్లా నర్సీపల్లి గ్రామానికి చెందిన పురుషోత్తం ఎడ్లు నిలిచాయి. ఈ పోటీలు ఆధ్యా%ళి%తం ఉత్కంఠ భరితంగా సాగాయి.

## 10వ తరగతి విద్యార్థులకు పరీక్ష సామాగ్రి పంపిణీ



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

గిద్దలూరు మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పొదిలికొండ పల్లెలో 10.వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్ష వ్రాయడానికి అవసరమైన పరీక్ష ప్యాడ్, పెన్నులు, స్కేల్ మొదలైన పరీక్ష సామాగ్రి ని యడవల్లి గ్రామానికి చెందిన యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ గౌరవ అధ్యక్షులు డాక్టర్ మొర్రి. పిచ్చయ్య పాఠశాల హిందీ ఉపాధ్యాయులు తన సొంత నిధులు ఖర్చు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వరలక్ష్మమ్మ కు శనివారం అందజేయగా వాటిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ మొర్రి.పిచ్చయ్య హిందీ ఉపాధ్యాయులుగా ఇదే పాఠశాలలో పనిచేస్తూ ప్రతి సంవత్సరం ఈ పాఠశాలకు సహకరిస్తున్నారని తెలిపారు. మొర్రి. పిచ్చయ్య మాట్లాడుతూ పరీక్షలు వ్రాసేటప్పుడు తీసుకోవాల్సిన మెలకువలను విద్యార్థులకు వివరించారు. విద్యార్థులందరూ 10.వ తరగతి పరీక్షలు బాగా వ్రాసి అత్యధిక మార్కులు తీసుకొచ్చి పాఠశాలకు మంచి పేరు ప్రతిష్ఠ లు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొని పిచ్చయ్యను అభినందించారు.

## ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలి

### పొదిలి ఎంపీడీవో శోభన్ బాబు

**పొదిలి, పెన్ పవర్ మార్చి 15**

ప్లాస్టిక్ రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరు గట్టి కృషి చేయాలని పొదిలి మండల అభివృద్ధి అధికారి జి శోభన్ బాబు కోరారు స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర లో భాగంగా శనివారం నాడు మండలంలోని అన్నవరం గ్రామంలో జరిగిన సమావేశానికి ఎంపీడీవో శోభన్ బాబు ముఖ్యఅతిథిగా విచ్చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల జరిగే అనర్థాల గురించి గ్రామ ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించారు ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తో పాటు సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## మున్సిపల్ మి నిస్టీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీ ఆవిష్కరణ -ఎమ్మెల్యే ముత్తుముల



**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

గిద్దలూరు నగర పంచాయతీ కార్యాలయంలో శనివారం ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్ట్రీరియల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ డైరీ గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి చేత ఆవిష్కరింపచేశారు. ఈ కార్యక్రమము లో చైర్ పర్సన్ శ్రీ పాముల వెంకటసుబ్బయ్య కౌన్సిల్ సభ్యులు , కోఆప్షన్ సభ్యులు, కమిషనర్ ఐ శ్రీనివాసులు మేనేజర్ బి.వి రంగారావు గారు, అసిస్టెంట్ ఇంజనీర్ వై రవీంద్రుడు గారు ఎన్విరాన్మెంటల్ ఇంజనీరు శ్రీమతి కె పోర్షియా గారు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ శ్రీమతి ఎన్. శాంతి గారు, సీనియర్ సహాయకులు మరియు ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ మినిస్ట్రీయల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు షేక్ టపా ఖాదర్ వలి , సీనియర్ సహాయకులు ఏ మధు, జూనియర్ సహాయకులు సయ్యద్ ఇసామియా, పాలుగుళ్ల ఆదినారాయణ రెడ్డి , చింతబోట్ల వినయ్ కృష్ణ , సచివాలయ సిబ్బంది కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొనియున్నారు.

# వస్తు వినిమయ వ్యవస్థలో

# వినియోగదారుడే రారాజు..

### రోజురోజుకు పెరుగుతున్న ధరలు. కల్తీ అవుతున్న సరుకులు. తూకములోను మోసాలు. హైటెక్ ట్రిక్కులతో జిమ్మిక్కులు.

### ఇలా నిత్యవసరాల విషయములో వినియోగదారులు నిత్యం దగా పడుతున్నారు...

### వినియోగదారుడే దేశ ఆర్థిక వ్యవస్థకు మూలం. మేలుకో.....ఏమి చేయాలో తెలుసుకో...హక్కులు సరే ....అవగాహన ఏది?

### జన విజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి.స్వరూపరెడ్డి...

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

గుండు సూది నుండి విమాన ప్రయాణం వరకు..ఏం కొన్నా ...ఎంత ఖర్చు చేసిన వాళ్లు వినియోగదారులే అవుతారు. కొన్న వస్తువు నాణ్యముగా లేకపోయిన, సేవలు ప్రమాణాలకు తగ్గట్టుగా లేకపోయిన నష్టపోయేది వినియోగదారుడే నని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు పి స్వరూపరెడ్డి పేర్కొన్నారు శనివారంనాడు జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవంలో పాల్గొని ప్రసంగించారు .జరిగిన నష్టాన్ని చూస్తూ భరించ వలసిన అవసరం వినియోగదారుడికి లేదని.వీటికి అడ్డుకట్ట వేయాలంటే తమ హక్కులను గుర్తించి రక్షణ పొందవచ్చునన్నారు. కేవలం వివిధ మాధ్యమాల్లో వచ్చే వాణిజ్య ప్రకటనల ఆధారంగా వస్తువులను కొనుగోలు చేయకూడదన్నారు. విలువైన వస్తువులు కొనేటప్పుడు నలుగురు ని సంప్రదిస్తే మంచిదని.కరోనా తర్వాత ఆన్లైన్ ద్వారా చేసే వ్యాపార లావాదేవీలు పెరిగాయన్నారు. ఫలితంగా కొత్త రకం మోసాలకు సైబర్ నేరగాళ్లు తెర దీస్తున్నారని. దీని వల్ల సాంకేతిక పరిజ్ఞానం పై అంతగా అవగాహన లేని వినియోగదారులు ఎక్కువగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. నాణ్యమైన సేవలు పొందే హక్కు వినియోగదారులకు వుంటుందని పేర్కొన్నారు. ఒక దేశం ఆర్థిక వ్యవస్థలో వినియోగదారులు కీలక పాత్ర వహిస్తారని .ఎందుకంటే తయారు అయ్యే వస్తువులు కానీ,సేవలనువినియోగదారులు వాడకుంటే , ఉత్పత్తిదారులకు ఉత్పత్తి చేయడానికి ప్రేరణనే ఉండదన్నారు. ఆర్థిక రంగం, వ్యాపార రంగం , ప్రచార రంగాలలో, వినియోగదారుడు కంపెనీ, సంస్థలు ఉత్పత్తి చేసే వస్తువులు, వారి సేవలను వినియోగించుకునే వ్యక్తిగా నిర్వచించబడతాడన్నారు. వినియోగదారుడు ఒక వ్యక్తి (వ్యక్తుల



సమూహం, సంస్థలు ) కావచ్చు, సాధారణంగా తుది వినియోగదారుని గా వర్గీకరించబడుతుందనన్నారు . వారి వస్తువుల లేదా ఉత్పత్తి, సేవల కోసం సమర్థవంతంగా పంపిణి చేయుటకు వ్యాపార నైపుణ్యత (మార్కెటింగ్) , విక్రయించడానికి ఒక లక్ష్యంను కలిగి ఉండాలని. వినియోగదారుల ఉద్యమ పితామహుడిగా పేరుగాంచిన 'రాల్ఫ్‌నాడార్' కృషివల్లే... ప్రపంచమంతటా వినియోగదారుల ఉద్యమ సంఘాలు ఏర్పడ్డాయన్నారు. ఇవి వినియోగదారుల సంరక్షణ, సంక్షేమం,సేవలు, విద్య తదితర అంశాల్లో నెలకొన్న అనిశ్చితి వల్లే ప్రత్యేక హక్కుల కోసం గతంలో.. ప్రపంచవ్యాప్తంగా అనేక ఉద్యమాలు జరిగాయని పేర్కొన్నారు. మొదటిసారిగా 1920లో ప్రారంభమైన వినియోగదారుల ఉద్యమం క్రమక్రమంగా వివిధ దేశాలకు వ్యాపించిందన్నారు. 1962లో మార్చి 15న అప్పటి అమెరికా దేశాధ్యక్షుడు జాన్ ఎఫ్.కెన్నెడి దేశ పౌరుల కోసం ప్రప్రథమంగా వినియోగదారుల హక్కులు ప్రకటించారని. 1972లో అంతర్జాతీయ వినియోగదారుల సంఘాల సంస్థ ప్రాంతీయ సంచాలకుడు అన్వర్ ఫజల్ మార్చి 15 తేదీనే 'ప్రపంచ వినియోగదారుల హక్కుల దినోత్సవం'గా పరిగణించాలని తీర్మానించారని పేర్కొన్నారు. దాంతో 1973 నుంచి ప్రపంచ వ్యాప్తంగా మార్చి15 రోజే వినియోగదారుల హక్కుల దినంగా పాటించడం మొదలు పెట్టారన్నారు. వినియోగదారుల ప్రయోజనాలు , వారి హక్కులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించడానికి భారతదేశం లో ప్రతి సంవత్సరం డిసెంబర్ 24 న జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని జరుపుకుంటారని. డిసెంబర్ 24, 1986 న, వినియోగదారుల రక్షణ చట్టం 1986 భారత రాష్ట్రపతి ఆమోదం పొంది అమల్లోకి వచ్చిందన్నారు. వినియోగదారుల రక్షణ చట్టం ప్రధాన లక్ష్యం లోపభూయిష్ట వస్తువులు, అసంతృప్తికరమైన సేవలు, మోసపూరితమైన వాణిజ్య పద్ధతులు వంటి వివిధ రకాల దోపిడీకి వ్యతిరేకంగా వినియోగదారులకు సమర్థవంతమైన భద్రతలను అందించడం ఈ చట్టం ఉదేశ్యం అని తెలిపారు. విషం పెట్టి చంపడం ఎంత నేరమో,ఆకర్షణీయమైన పద్ధతిలో ఆహారం కల్తీ అనే విషాన్ని నింపి,జనం చేత మింగించి చంపడం కూడా అంతే నేరం.అలాంటి ఘోరమైన నేరాలకు పాల్పడే వారిని శిక్షించి, ప్రజలను రక్షించినపుడే వినియోగదారుల చట్టాలకు సార్థక త చేకూరుతుందని స్వరూప రెడ్డి పేర్కొన్నారు.

## ఘోర రోడ్డుప్రమాదం

### గొర్రెల కాపరి పై దూసుకొచ్చిన లారీ

### 5గొర్రెలు,గొర్రెల కాపరి మృతీ



**పుల్లల చెరువు పెన్ పవర్ మార్చి 15**

పుల్లల చెరువు మండలంలో తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. పుల్లల చెరువు మండలం మళ్ళపాలెం గ్రామంలో నేషనల్ 565హైవే పై శనివారం ఉదయం 5.15 గంటల సమయంలో పుల్లలచెరువు మండలం నరజాముల తాండ గ్రామానికి చెందిన పోపావత్ రాములు నాయక్ తండ్రి భామణ నాయక్, 48 సంవత్సరాలు మరోకరు గొర్రెల మందను తోలుకొని త్రిపురాంతకం వైపు వెళుతుండగా మల్లపాలెం ఆవుల వెంకటరెడ్డి కోళ్ల ఫారం దగ్గర వెనుక వైపు నుండి %జుఆ 05 ఏ% 9295 నెంబర్ గల లారీ డ్రైవర్ తన లారీని అతివేగంగా వెనుక నుండి రాములు నాయక్ ని, గొర్రెలని ఢీ కొట్టడంతో రాములు నాయక్ ఐదు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. మృతుని భార్య పోపవత్ సరస్వతి బాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పుల్లల చెరువు ఎస్సై ఎల్ సంపత్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

## స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమానికి శ్రీకారం

### పాల్గొని ప్లాస్టిక్ నిషేధానికి అందరూ కృషి చేయాలి







**పెన్ పవర్, కంభం మార్చి 15 :**

స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను జయప్రదం చేయాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ గట్టి కృషి చేయాలని ఎంపీడీవో వీరభద్రా చారి ఈవో ఆర్ డి విజయలక్ష్మి కోరారు. శనివారం నాడు కంభం మండలంలోని లింగాపురం ఎర్రబాలెం స్వచ్ఛభారత్, స్వర్ణాంధ్ర కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో వీరభద్ర చారి ఈ ఓ ఆర్ డి విజయలక్ష్మి మాట్లాడుతూ ప్లాస్టిక్ వినియోగం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. అందువల్ల ప్లాస్టిక్ భూతాన్ని తరిమివేసి ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణానికి అందరూ పాటుపడాలని ఆయన సూచించారు. సమాజానికి ఇబ్బందికరంగా మారిన ప్లాస్టిక్ వినియోగానికి అందరూ స్వస్తి పలకాలన్నారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పారిశుద్ధ్య సిబ్బంది ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ నివారించండి - పర్యావరణ హిత కనిగిరిగా మార్చుకుందాం

### - కనిగిరిలో స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం

### - శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పిలుపు

**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, మార్చి 15**



కనిగిరిని ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చిదిద్దేందుకు అందరూ సహకరించాలని శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్రనరసింహారెడ్డి కోరారు. శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా సింగిల్ -యూజ్ ప్లాస్టిక్ నిషేధాన్ని అమలు చేయాలని పట్టణ ప్రజలకు, దుకాణదారులకు పిలుపునిచ్చారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. దుకాణదారులను కలిసి ప్లాస్టిక్ కవర్లను ఉపయోగించకుండా గుడ్డ సంచులు, జ్యూట్ బ్యాగులను ప్రోత్సహించాలని అవగాహన కల్పిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈనెల 31వ తేదీ వరకు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించుకోవడానికి అవకాశం ఇస్తున్నామని, ఆతర్వాత సింగిల్-యూజ్ ప్లాస్టిక్ పూర్తిగా నిషేధిస్తామని దుకాణదారులకు సూచించారు. ఈనిబంధనలను పాటించేలా మునిసిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని సాయిబాబా సినిమా హాల్ వద్ద పేరుకుపోయిన చెత్తను మునిసిపల్ సిబ్బందితో కలిసి తొలగించారు. ప్రజలు తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా సహకరించాలని కోరారు. ఇదే విధంగా ప్రైవేట్ స్థలాల్లో చెత్తను వేయకుండా చూడాలని ప్రైవేట్ స్థలాల్లో చెత్త పేరుకుపోయి సమీపంలో ఉండేవారికి అసౌకర్యం కలిగించేలా ఉన్నా సంబంధిత స్థల యజమానులకు నోటీసులు ఇచ్చి కఠిన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, మునిసిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మండల కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయండి

### గంగసాని హుస్సేన్ రెడ్డి మండల అధ్యక్షులు

**పామూరు, పెన్ పవర్, మార్చి15.**

వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ నేడు ఆదివారం ఉదయం 10 గంటలకు స్టానిక పార్టీ కార్యాలయంలో మండల కమిటీలకు సంబంధించి కార్యకర్తల సమీక్ష సమావేశం జరుగుతుందని మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి తెలిపారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ సమావేశానికి ముఖ్యఅతిధిగా కనిగిరి ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ పాల్గొంటారు. కావున పామూరు మండలం వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అందరూ పాల్గొని ఈ సమావేశాన్ని జయప్రదం చేయాలని మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి కోరారు. ఈ సమావేశంలో కో-ఆప్షన్ సభ్యులు మచ్చ నాయబ్ రసూల్, సీనియర్ నాయకులు గట్లా విజయభాస్కర్ రెడ్డి, వైస్ ఎంపీపీ గంధం ఏసురత్నం, షేక్ నాయబ్ రసూల్ (యం80), పావులూరి ఆదినారాయణ, పాలేటి ప్రేమకుమార్, గంధం చిన్న పెద్దయ్య,కోరే శ్రీనివాసులరెడ్డి,ఎలిక నాగరాజు, రెక్కల సాయి,ఇర్రి వెంకటేష్ తదితరులు అన్నారు.



## వైఎస్ఆర్సీపీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శిగా షేక్ బుజ్జి

### పార్టీ బలోపేతానికి కృషి చేస్తా షేక్ బుజ్జి



**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 15**

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు కోవిలంపాడు గ్రామం నకు చెందిన షేక్ బుజ్జి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ విభాగం కార్యదర్శిగా నియమితులైనారు ఈ సందర్భంగా బుజ్జి మాట్లాడుతూ నన్ను గుర్తించి పదవికి సహకరించిన ప్రకాశం జిల్లా వైఎస్ఆర్సీపీ అధ్యక్షులు బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ వైఎస్ఆర్సీపీ ఇంచార్జి చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, ఒంగోలు పార్లమెంట్ మాజీ సభ్యులు వై వి సుబ్బారెడ్డి, కనిగిరి నియోజక వర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి దద్దాల నారాయణ యాదవ్, కనిగిరి మాజీ శాసనసభ్యులు కదిరి బాబురావు పార్టీ నాయకులు కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు క్షేత్రస్థాయిలో వైఎస్ఆర్ సీపీ బలోపేతానికి పార్టీ శ్రేణులతో కలిసి కృషి చేస్తానని అన్నారు.

## మాలకొండ ఆదాయం

## రూ. 8,39,319

**వలేటివారిపాలెం పెన్ పవర్ మార్చి 15**

అయ్యవారి పల్లి పంచాయతీ పరిధిలోని మాలకొండ లో వెలిసియున్న శ్రీ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి వారికి శనివారం భక్తుల నుండి వివిధ రూపాల ద్వారా రూ 8,39,319 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కే వి సాగర్ బాబు ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ అర్చకులు గౌరి శంకర్, నృసింహ చార్యులు స్వామివారిని అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## 16న కొమరోలు మండలంలో విద్యుత్ సరఫరా నిలిపివేత

*విద్యుత్ సబ్స్టేషన్ లోని 33 కె.వి ఫీడర్ లో ప్రీ మానుసూన్ ప్రోగ్రాం చేయవలసి ఉన్నందున సరఫరా నిలిపివేత.*
*ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం.*
*వినియోగదారులు సహకరించాలని విజ్ఞప్తి.*
*కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాసులు.*



**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**

కొమరోలు మండలంలోని అన్ని గ్రామాలకు ఈ నెల 16వ తేదీ ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేయవలసి వస్తుందని కొమరోలు విద్యుత్ శాఖ ఏఈ ఎం శ్రీనివాసులు తెలిపారు .కొమరోలు లోని సబ్ స్టేషన్ లో గల 33 కెవి ఫీడర్లో ప్రీ మాన్సూన్ ప్రోగ్రాం చేయవలసి ఉన్నదని ,అందువల్ల విద్యుత్ సరఫరాను వలసి వస్తున్నదని ఆయన తెలిపారు .ఆ సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి 11:30 వరకు విద్యుత్ సరఫరా కు అంతరాయం కలుగుతుందన్నారు .కావున వినియోగదారులు సహకరించాలని ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

# పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం ప్రజలకు అవగాహన కల్పించిన గ్రామపంచాయతీ ఉద్యోగులు, సిబ్బంది.
పరిసరాల పరిశుభ్రత పై ర్యాలీ ప్రతిజ్ఞలతో అవగాహన -ప్రజల సహకారంతోనే పరిసర పరిశుభ్రత సాధ్యం.
కొమరోలు గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య









**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని ,ప్రజల సహకారంతోనే ఆ కార్యక్రమం విజయవంతం కాగలదని కొమరోలు గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈనెల 15వ తేదీ శనివారం కొమరోలు లోని గ్రామపంచాయతీ కార్యాలయం ఆవరణలో గ్రామ సచివాలయాల ఉద్యోగులు, పారిశుద్ధ కార్మికులు, స్వచ్ఛంగా తరలివచ్చిన ప్రజలతో పరిశుభ్రత కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం గ్రామపంచాయతీ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ డి బ్రహ్మయ్య ఆధ్వర్యంలో గ్రామ సచివాలయాల ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, ప్రజలతో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఆ సందర్భంగా ప్రజలకు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలపై అవగాహన కల్పించేందుకు ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు .ఆంజనేయస్వామి ఆలయ కూడలిలో ఉద్యోగులు పారిశుధ్య కార్మికులు మానవహారంగా ఏర్పడి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని , ఆరోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రత ఎంతో దోహదపడుతుందని పేర్కొంటూ నినాదాలు చేశారు .ఆ సందర్భంగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ బ్రహ్మయ్య ఉద్యోగులు ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు .ఆ కార్యక్రమంలో కొమరోలు గ్రామ సచివాలయ కార్యదర్శులు జనార్దన్ రెడ్డి ,శ్రీనివాసులు, మూడు గ్రామ సచివాలయాల ఉద్యోగులు, పారిశుధ్య కార్మికులు, ప్రజలు పాల్గొన్నారు.

## అయ్యాలూరివారిపల్లిలో కుంకుమ పూజ మరియు హారతి





**చంద్రశేఖరపురం పెన్ పవర్ మార్చి 15**

చంద్రశేఖరపురం మండల పరిధిలో అయ్యలూరివారి పల్లి గ్రామంలో లక్ష్మీగణపతి దేవస్థానం దగ్గర మరియు రామాలయం దగ్గర హోలీ పౌర్ణమి సందర్భంగా కుంకుమ పూజా కార్యక్రమం మరియు సామూహిక హారతి ఘనముగా నిర్వహించారు ఈ కార్యక్రమానికి జిల్లా మహిళా సహా కన్వీనర్ యం. గోవర్ధని మండల కమిటీ సభ్యులు నేలటూరిరమణారెడ్డి , గ్రామ ధార్మిక సమితి సభ్యులు గ్రామస్తులు మరియు ఖండ ధర్మప్రచారక్ %ఖ%.అచ్యుతరావు పాల్గొన్నారు.

## బెల్లంకొండ విద్యాసంస్థ అధ్యాపకురాలికి అరుదైన గౌరవం



**పొదిలి, పెన్ పవర్ మార్చి 15**

మండలంలోని కంబాలపాడు గ్రామంలో గల బెల్లంకొండ విద్యాసంస్థ అధ్యాపకురాలుకి అరుదైన గౌరవం దక్కింది బెల్లంకొండ ఫార్మసీ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్న ఝూన్సీ ప్రియకు డాక్టరేట్ లభించింది ఈ మేరకు రాజస్థాన్ లోని రఫెల్స్ యూనివర్సిటీ ఝూన్సీ ప్రియ సబ్మిట్ చేసిన ప్రయోగానికి మిర్చి ఆమెకు డాక్టరేట్ ప్రధానం చేయడం జరిగింది ఈ సందర్భాన్ని పునస్కరించుకొని శనివారం నాడు డాక్టరేట్ సాధించిన లెక్చరర్ ఝూన్సీ ప్రియను బెల్లంకొండ విద్యాసంస్థల అధినేతలు డాక్టర్ బెల్లంకొండ శ్రీనివాసరావు, బెల్లంకొండ విజయలక్ష్మి, డైరెక్టర్ మద్దుల శ్రీనివాసరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ నారపు శెట్టి నాయుడు, ఇతర అధ్యాపకులు, సిబ్బంది తదితరులు ఘనంగా సత్కరించారు.

## గంజాయి స్వాధీనం

### ముగ్గురు వ్యక్తులను అదుపులోకి

**గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15**

గిద్దలూరు ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ ఎమ్. జయరావు సిబ్బంది , ఎన్ ఫోర్సిమెంట్ సబ్ ఇన్స్పెక్టర్ మౌలాలి ఎక్సైజ్ నేరముల కొరకు దాడులు నిర్వహించుచుండగా మధ్యాహ్నం సమయంలో గిద్దలూరు పట్టణం రాచర్ల పోవు రహదారిలో గంజాయి మత్తు పదార్థం కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను అదుపులోనికి తీసుకొని వారి వద్ద 900 గ్రాములు గంజాయిని స్వాధీనం ముగురు వ్యక్తులపై కేసు నమోదు చేశారు.



# జిల్లా పోలీసుల స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛ దివస్







**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 15**

ప్రతి నెల మూడవ శనివారం "స్వచ్ఛ ఆంధ్ర - స్వచ్ఛత దివస్" కార్యక్రమన్ని నిర్వహించాలని ప్రకాశం జిల్లా ఎస్పీ ఏఆర్ దామోదర్ ఆదేశాల మేరకు పోలీస్ అధికారులు, సిబ్బంది జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని పోలీస్ స్టేషన్లలో "క్లీన్ అండ్ గ్రీన్" కార్యక్రమం నిర్వహించారు. పోలీస్ స్టేషన్ లలో శుభ్రం చేయడంతో పాటు ఆవరణం, చుట్టూ ఉన్న చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి శుభ్రం చేశారు. నెలలో మూడో శనివారం ఈ కార్యక్రమాన్ని అన్ని పోలీస్ స్టేషన్లలో చేపట్టాలని ఎస్పీ ఆదేశించారు. దీంతో జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచే విధంగా ఈ కార్యక్రమం చేపట్టారు. మన పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడం మన బాధ్యత. అందరూ భాగస్వాములు కావాలని, ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారులు సూచించారు.

# ఉన్నత లక్ష్యాల సాధనకు యువత కృషి చేయాలి

- శర్మ కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావ - నృత్యాలతో అలరించిన విద్యార్థులు









**కార్పొరేషన్ పెన్ పవర్, ఒంగోలు మార్చి 15**

భవిష్యత్ భారతం తరగతి గదుల్లోనే యువత రూపంలో రూపుదిద్దుకుంటుందని యువతను ప్రోత్సహిస్తే వారు సమున్నత లక్ష్యాల సాధనకు తప్పక కృషి చేస్తారని విజయ శిఖరాలను అధిరోహిస్తారని సి ఎస్ ఆర్ శర్మ కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు పేర్కొన్నారు. శనివారం శర్మ కళాశాల సెమినార్ హాలులో ఏర్పాటైన కళాశాల వార్షికోత్సవ సభకు ఆయన అధ్యక్షత వహించి ప్రసంగించారు. యువత నాయకత్వ లక్షణాలను అల వరచుకోవాలని సూచించారు. సిఎస్ఆర్ శర్మ కళాశాల పాలకవర్గ అధ్యక్షులు డాక్టర్ గంజాం శ్రీనివాసమూర్తి, ట్రెజరర్ ఓరుగంటి నరసింహ శాస్త్రి మాట్లాడుతూ ఏడు దశాబ్దాలకు పైగా చరిత్ర కలిగిన సిఎస్ఆర్ శర్మ కళాశాలలో చదివిన ఎంతోమంది తర్వాత కాలంలో పలు రంగాలలో రాణించి తామేమిటో రుజువు చేశారని పేర్కొన్నారు, శర్మ కళాశాల విద్యార్థులు పలు పోటీలలో పాల్గొని బహుమతులను సాధించడం పట్ల వారు హర్షం వ్యక్తం చేశారు.విజేతలను జ్ఞాపికలతో మెడల్స్ తో సత్కరించారు. విద్యార్థుల అభ్యున్నతికి వారిని ప్రోత్సహించేందుకు శర్మ కళాశాల యాజమాన్యం ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటుందని వివరించారు. సిఎస్ఆర్ శర్మ విద్యాలయ ప్రిన్సిపాల్ దిగ్విజయ్ మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు మానవీయ విలువలను చక్కటి వ్యక్తిత్వాన్ని సంస్కారాన్ని అలవర్చుకోవాలని సమాజానికి మార్గదర్శకులుగా మారాలని కోరారు. శర్మ కళాశాల తెలుగు లెక్చరర్ మాజేటి వెంకట సుబ్బయ్య శాస్త్రి తదితరులు పాల్గొని ప్రసంగించారు. ఇంగ్లీష్ లెక్చరర్ గాయత్రి పర్యవేక్షణలో విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు కోలాట ప్రదర్శన అందరిని అలరించాయి, శర్మ కళాశాల విద్యార్థులు కళాశాలకు వాటర్ క్యాన్లు , వైట్ బోర్డులను బహూకరించారు. వారిని కళాశాల ప్రిన్సిపాల్ ఎం శ్రీనివాసరావు , కళాశాల యాజమాన్య ప్రతినిధులు అభినందించారు.

## కన్నుల పండుగగా వేంకటేశ్వర స్వామి కళ్యాణం



**కొనకనమిట్ల పెన్ పవర్ మార్చి 15**

మండలంలోనీ వెలుగొండ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.శనివారం తెల్లవారు జామున లక్ష్మి అలివేలు మంగ సమేత వేంకటేశ్వర స్వామి కళ్యాణం అత్యంత వైభవంగా నిర్వహించారు.ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.తొలుత స్వామి వారికి మంగళ స్నానాలు,అభిషేకాలు చేశారు.ఆలయ ప్రాంగణంలో వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని పండితులు వేద మంత్రొచ్చరణలతో స్వామి వార్లకు ప్రత్యేక పూజలు చేసి కన్నుల పండుగగా కళ్యాణం చేశారు.అనంతరం స్వామి వారిని సూర్య వాహనంపై కొలువుదీర్చి వెలుగొండ పుర వీధుల్లో పల్లకిలో అంగరంగ వైభవంగా ఊరేగించారు.ఈ సందర్భంగా స్వామి వారి పల్లకిని మోసేందుకు భక్తులు పోటీపడ్డారు.కళ్యాణ మహోత్సవాన్ని దేవస్థానం ఈవో చెన్నకేశవ రెడ్డి,ఉత్సవ కమిటీ చైర్మన్ కుందూరు కాశిరెడ్డి పర్యవేక్షించారు.

## ప్లాస్టిక్ రహిత సమాజం కొరకు ప్రతి ఒక్కరూ నడుం బిగించాలి

**డాక్టర్ గద్దె ఏడుకొండలు**
**(ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులు)**



**పామూరు, పెన్ పవర్, మార్చి 15**

మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల నందు డాక్టర్ ఏడుకొండల ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ దివస్ కార్యక్రమం జరిగినది. ఈ కార్యక్రమంలో గద్దె ఏడుకొండలు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్ వినియోగం మానుకోవాలని ప్లాస్టిక్ నివారణ కు కంకణం కట్టుకోవాలని ప్రమాణము చేపించినారు. ఈ కార్యక్రమంలో కంబాలదిన్నె టిడిపి అధ్యక్షులు మన్నం రమణయ్య, గొల్ల భాస్కరరావు గొల్ల వీరబాబు, సూర గోవిందమ్మ, ఓరుగంటి సుబ్బమ్మ ,మల్లెల శ్రీనివాసులు, ఉమ్మడి పద్మ , నల్లబోతులజయమ్మ, యాదాల చెన్నకేశవులు, పోక శ్రీనివాసులు తదితరులు ప్లాస్టిక్ నివారణకు ప్రమాణము చేసినారు.

## సీతారాముల విగ్రహాల ప్రతిష్ట మహోత్సవాన్ని ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలి

**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**

కొమరోలు మండలం నారాయణ పల్లె గ్రామంలో నిర్వహిస్తున్న సీతారాముల నూతన విగ్రహ ప్రతిష్ట వేడుకలను శనివారం కొమరోలు ఎస్సై నాగరాజు తమ సిబ్బందితో కలిసి వెళ్లి పర్యవేక్షించారు .ఆ గ్రామంలో గల సీతారామస్వామి ఆలయంలో నూతన విగ్రహాల ధ్వజ ప్రతిష్ట కార్యక్రమం శనివారం ప్రారంభమైంది.ఆ సందర్భంగా ఎస్సై నాగరాజు ఆలయనిర్వహకులకు భక్తులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.తిరుణాల వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎలాంటి వివాదాలకు ఘర్షణకు అవకాశం లేకుండా అవసరమైన జాగ్రత్తలు తీసుకోవాలని వేడుకల నిర్వాహకులకు భక్తులకు సూచనలు సలహాలు ఇచ్చారు.ఆ సందర్భంగా దాతల సహకారంతో ఆలయంలో ప్రాంగణంలో గ్రామంలో మూడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేయించారు .తమ గ్రామంలో గతంలో ఎప్పుడు కూడా ఎలాంటి ఘర్షణలు వివాదాలు లేకుండా తామంతా ప్రశాంత వాతావరణంలో జీవనం సాగిస్తున్నామని ,అదేవిధంగా తిరుణాల వేడుకలను కూడా ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో ఆనందోత్సవాలతో నిర్వహించుకుంటున్నట్లుగా గ్రామస్తులు ఆలయ కమిటీ సభ్యులు పోలీసులకు వివరించారు.

# మహిళా రక్షణే మా ప్రథమ కర్తవ్యం - జిల్లా ఎస్పీ ఏ.ఆర్ దామోదర్





**క్రైం రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 15**

మహిళలు,చిన్నారుల రక్షణ కు రాష్ట్ర ప్రభుత్వం శక్తి టీమ్ లు ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎస్పీ ఏ. ఆర్. దామోదర్ పేర్కొన్నారు. శనివారం శక్తి టీమ్ లను ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మహిళలు, చిన్నారులకు భద్రతే లక్ష్యంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన 'శక్తి' యాప్ పట్ల అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో క్రొత్తగా ఏర్పాటు చేసిన శక్తి టీమ్స్ తో జిల్లా పోలీసు కార్యాలయంలో మమేకమై, వారు నిర్వర్తించే విధులు, చేపట్టాల్సిన కార్యక్రమాలను జిల్లా ఎస్పీ వివరించారు. రాష్ట్రంలో మహిళల పట్ల ఎటువంటి దాడులు,అఘాయిత్యాలు, వేధింపులు లేకుండా చేసేందుకుగాను ప్రత్యేకంగా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలతో 'శక్తి టీమ్స్' ను జిల్లాలో ఏర్పాటు చేసామని ఎస్పీ తెలిపారు. ఈ శక్తి టీమ్స్ జిల్లాలోని కళాశాలలు, పార్కులు, ఆర్టీసీ బస్టాండ్లు, ముఖ్య కూడళ్ళను మఫ్టీలో నిఘా ఉంటుందని, ఈ శక్తి టీమ్స్ బహిరంగ ప్రదేశాల్లో మహిళలు, పిల్లలపై వేధింపులు అరికట్టడం, నేరాలను నిరోధించడం, తక్షణ సాయం అందించి వారికి రక్షణ కవచంగా నిలిచేలా పని చేస్తారు. మహిళా వివక్ష, హింస, లైంగిక వేధింపులకు సమాజంలో స్థానం లేదన్నారు. మహిళల రక్షణకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యతనిస్తుందని అందుకు అనుగుణంగా అనేక కార్యక్రమాలను చేపట్టడంతో పాటు క్షేత్ర స్థాయిలో అమలు చేస్తుందని అన్నారు. నూతనంగా ఏర్పాటు చేసిన ఆరు బృందాలు ఒంగోలు -3, దర్శి -1, కనిగిరి -1, మార్కాపురం -1 సబ్ డివిజన్లలో విధులు నిర్వర్తిస్తాయన్నారు. ఈ టీమ్స్ లో ఎస్సై నేతృత్వంలో ఇద్దరు మహిళా సిబ్బంది, ముగ్గురు కానిస్టేబుళ్లు మొత్తం ఆరుగురు సభ్యులు ఉంటారన్నారు. ఈ బృందాలు మఫ్టీలో విధులు నిర్వహిస్తాయన్నారు. ఆపద సమయంలో శక్తి యాప్ నకు వచ్చే ఎస్.ఓ.ఎస్.కాల్స్, డయల్ 112/100 కాల్స్ తో సంఘటన స్థలంకు ఈ టీమ్స్ వెళ్తాయన్నారు. కాల్స్ వచ్చిన వెంటనే శక్తి బృందాలు అప్రమత్తమై సకాలంలో సంఘటనా స్థలంనకు చేరుకొని సమస్యలను చట్టబద్ధంగా పరిష్కారమయ్యేలా చర్యలు చేపట్టేలా సూచించారు. మహిళలకు రక్షణగా ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన శక్తి మొబైల్ యాప్ పట్ల ప్రజల్లో విస్తృతంగా ప్రచారం కల్పించేలా సూచనలు చేశామన్నారు. ఆపద సమయాల్లో శక్తి యాప్ ఏవిధంగా పని చేస్తుందన్న విషయాన్ని మహిళలకు వివరించేలా టీమ్స్ తెలియజేశామన్నారు. వారితో బాడీ వరన్ కెమెరా, డ్రోన్ లతో నిఘా ఉంటుందన్నారు. ఒన్ టచ్ ఎస్ఓఎస్ బటన్- వెంటనే పోలీసులను అలర్ట్ చేసి సహాయం అందిస్తుంది. షేక్ ట్రిగ్గర్, హ్యాండ్ గెస్చర్ ఎస్ఓఎస్ - యాప్ ఓపెన్ చేయకుండానే ఎస్ఓఎస్ అలర్ట్ పంపించవచ్చు. లైవ్ ట్రాకింగ్ అండ్ ఎవిడెన్స్ షేరింగ్ కాలర్ లోకేషన్, 10 సెకన్ల ఆడియో, వీడియో కంట్రోల్ రూమ్ కి పంపబడుతుంది తద్వారా పోలీసు అధికారుల తక్షణ స్పందించారు. కీ ఫ్యూచర్స్: ఫిర్యాదు నమోదు, తప్పిపోయిన పిల్లల గురించి రిపోర్టు చేయడం, అక్రమ కార్యకలాపాలపై రిపోర్టు చేయడం, నైట్ షెల్టర్స్, భద్రతతో కూడిన ప్రయాణం, పోలీసు అధికారుల వివరాలు మరియు మొబైల్ నంబర్లు, వాట్సాప్ గవర్నెన్స్, అత్యవసర కాంటాక్ట్... లాంటి ఎన్నో అధునాతన ఫీచర్స్ ను ఈ "శక్తి" యాప్ లో పొందుపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ కె నాగేశ్వరరావు, ఒంగోలు డిఎస్పీ రాయపాటి. శ్రీనివాసరావు, ఎస్బీ ఇన్స్పెక్టర్ రాఘవేంద్ర, మహిళా పియస్ సిఐ సుధాకర్, ఒంగోలు వన్ టౌన్ సీఐ నాగరాజు, ఒంగోలు తాలూకా అజయ్ కుమార్, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

# దయాలసిస్ పేషెంట్లకు అండగా ఉంటాం

**- శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి**







**కనిగిరి ఆర్సీఇంచార్జ్, పెన్ పవర్, మార్చి 15**

డయాలసిస్ పేషంట్లకు ఎల్లవేళలా అండగా ఉంటానని శాసనసభ్యులు నరసింహారెడ్డి అన్నారు. శనివారం డయాలసిస్ సెంటర్ కు నూతనంగా వచ్చిన "ఫ్రెజనీస్" మిషన్లను శాసనసభ్యులు డా. ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి మాట్లాడుతూ ఈరెండు కొత్త మిషన్ల ద్వారా, అదనంగా మరొక 10 మంది రోగులకు డయాలసిస్ సేవలు అందించే అవకాశం లభించనుందని అన్నారు. దీని ద్వారా కిడ్నీ సంబంధిత సమస్యలతో బాధపడుతున్న రోగులకు మెరుగైన వైద్యం అందుబాటులోకి రానుందని అన్నారు. కంగారు మదర్ కేర్ సెంటర్ లో తల్లీబిడ్డల పరామర్శ ఆసుపత్రిలో సిజేరియన్ ప్రసవం చేసిన తల్లి, బిడ్డను ఎమ్మెల్యే ప్రత్యేకంగా కలుసుకున్నారు. కంగారు మదర్ కేర్ సెంటర్ లో ఉన్న తల్లీబిడ్డల ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని, వారికి అవసరమైన సౌకర్యాలు నిరంతరంగా అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. కేఎంసి ప్రాముఖ్యత, శిశు ఆరోగ్య సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. **ఆసుపత్రి అభివృద్ధికి విరాళాలు**

ఈసందర్భంగా కనిగిరి ప్రభుత్వాసుపత్రిలో డయాలసిస్ సెంటర్ ఆధునీకరణ కోసం, అచ్చాల తిరుపతమ్మ 20,000 రూపాయలు, గుంటక సుబ్బారెడ్డి 51,000 రూపాయలు విరాళంగా అందించారు.అభిమానులు, సేవాభావం కలిగిన వ్యక్తులు ఆసుపత్రి అభివృద్ధికి సహకరించాలని ఉగ్ర పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆసుపత్రి వైద్యాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# అమ్మాయిలూ ఆల్ ది బెస్ట్..!!

**- 10 వ తరగతి విద్యార్థులలో స్ఫూర్తి నింపిన కలెక్టర్**







**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 15**

విద్య ఆవశ్యకతను తెలియజేస్తూ విద్యార్థులలో స్ఫూర్తిని నింపుతున్న జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఈ దిశగా మరింత చొరవ చూపారు. ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు రాసే సంక్షేమ హాస్టళ్లలోని విద్యార్థులతో ఈనెల ఒకటో తేదీన జూమ్ మీటింగ్ నిర్వహించిన కలెక్టర్... ఇప్పుడు పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులతోనూ అదే రీతిలో ముచ్చటించారు! ఈసారి ప్రత్యక్షంగా వారితో కలిసి కొన్ని నిమిషాలు గడిపారు !!. ఔను... శనివారం ఒంగోలులోని పి.వి.ఆర్. బాలికల ఉన్నత పాఠశాలకు వెళ్లి పదవ తరగతి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థినులతో కలెక్టర్ మాట్లాడారు. ఆహ్లాదకరమైన వాతావరణంలో పరీక్షలు రాసేలా ఆయా కేంద్రాలలో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలను జిల్లా యంత్రాంగం కల్పిస్తున్నట్లు చెప్పారు. ఒత్తిడికి గురికాకుండా ప్రశాంతంగా, సానుకూల దృక్పథంతో పరీక్షలు రాయాలని విద్యార్థినులకు సూచించారు. విద్యార్థుల భవిష్యత్తు లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. వాటిని చేరుకోవడానికి, ఉన్నత విద్యాభ్యాసానికి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు పాస్పోర్ట్ లాంటివని కలెక్టర్ వ్యాఖ్యానించారు. ఈ పరీక్షలు బాగా రాయాలని " ఆల్ ది బెస్ట్ " చెప్పి విద్యార్థినులలో స్ఫూర్తిని నింపారు. ప్రతీ ఆడపిల్ల కనీసం డిగ్రీ పూర్తి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. జిల్లా విద్యాధికారి కె. కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ప్రత్యేక కార్యక్రమంలో జిల్లా కామన్ ఎగ్జామినేషన్స్ బోర్డు కార్యదర్శి శ్రీనివాసరావు, మండల విద్యాధికారి టి.కిషోర్ బాబు, పాఠశాల ఇన్చార్జి ప్రధానోపాధ్యాయురాలు ఏ.సుధారాణి , ఇతర టీచర్లు పాల్గొన్నారు.

# ఆరోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరం





**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**

ఆరోగ్య పరిరక్షణకు పరిసరాల పరిశుభ్రత ఎంతో అవసరమని కొమరోలు మండల పరిషత్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, గ్రామ సచివాలయాలు స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు .కాగా ఈ నెల 15వ తేదీ శనివారం కొమరోలు మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆ కార్యాలయ ఉద్యోగులు ,సిబ్బంది, ఉపాధి హామీ పథకం , వెలుగు కార్యాలయం సీసీ, అంగన్వాడి కార్యకర్తలు మండల పరిషత్ కార్యాలయం పరిసర ప్రాంతాల్లో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని అమలు చేశారు. ఆ సందర్భంగా ఉద్యోగులు చెట్ల నుంచి రాలిన ఎండు ఆకులను తొలగించి శుభ్రం చేశారు, దట్టంగా పెరిగిన చిల్ల చెట్ల మొక్కలను పెకలించి శుభ్రపరిచారు. పరిసరాల పరిశుభ్రత తోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ,అందువల్ల ప్రజలు కూడా స్వచ్ఛందంగా తమ ఇళ్ల పరిసరాలలో, వీధులలో పరిశుభ్రత పాటించి పచ్చదనాన్ని పెంచుకోవాలని సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర్ రెడ్డి కోరారు .కాగా మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల పరిధిలో శనివారం స్వర్ణాంధ్ర స్వచ్ఛంధ్ర కార్యక్రమాలు జరిగాయని ఆయన తెలిపారు .ఆ కార్యక్రమాలలో గ్రామ సచివాలయాల సిబ్బంది పారిశుధ్య కార్మికులు స్వచ్ఛందంగా ప్రజలు పాల్గొన్నారని వెంకటేశ్వర రెడ్డి చెప్పారు. కొమరోలు మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో జరిగిన స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వర రెడ్డి ,జూనియర్ అసిస్టెంట్ శ్రీనాథ్ , ఆఫీస్ అవార్డినేటర్ శ్రీనివాసులు ఉపాధి హామీ పథకం టెక్నికల్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది ,వెలుగు కార్యాలయం సీసీ జక్కుల స్వప్న, ఆరో నెంబర్ అంగన్వాడి కేంద్ర టీచర్ అంజలి తదితరులు పాల్గొన్నారు.

# నెలకుర్తి వారి ఇంట వైభవంగా జరిగిన వివాహ మహోత్సవ వేడుకలు

**నూతన వధూవరులను ఆశీర్వదించిన అల్లినగరం హెడ్మాస్టర్ గురుస్వామి ఉపాధ్యాయ బృందం.**



**కొమరోలు పెన్ పవర్ మార్చి 15**

నూతన వధూవరులైన డాక్టర్ నెలకుర్తి వెంకట ప్రదీప్, శ్రీ వైష్ణవి లను పలువురు ప్రముఖులతో పాటు అల్లినగరం హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆశీర్వదించి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.కొమరోలు గ్రామానికి చెందిన నెలకుర్తి వెంకటనారాయణ అల్లినగరం హై స్కూల్లో స్కూల్ అసిస్టెంట్గా పనిచేస్తున్నారు.వెంకటనారాయణ, ప్రభావతి దంపతుల కనిష్ట కుమారుడు డాక్టర్ వెంకట ప్రదీప్, గుంటూరు జిల్లా పొన్నూరు మండలం చింతలపూడి గ్రామానికి చెందిన శ్రీ వైష్ణవిల వివాహ మహోత్సవం ఈ నెల 14వ తేదీన చింతలపూడిలో రంగ రంగ వైభవంగా జరిగింది, వేద పండితుల మంత్రోచ్ఛారణలు, ఆకాశాన్నంటి మార్మోగిన మేళ తాళాలు భాజా భజంత్రీలతో, బంధుమిత్రులు పెద్దలు, ప్రముఖుల అక్షింతలు ఆశీర్వచనాలతో మాటే మంత్రము.., మనసే బంధము..., ఈ మమతే, ఈ సమతే మంగళవాద్యము...ఇది కళ్యాణం..కమనీయం....జీవితం అనే విధంగా కన్నుల పండుగగా జరిగింది. వివాహ మహోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం కొమరోలు లోని నెలకుర్తి వెంకటనారాయణ నివాస గృహంలో సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. ఆ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి బంధుమిత్రులు, ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అల్లినగరం హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు దాసరి గురుస్వామి నూతన వధూవరులను ఆశీర్వదించి వారికి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలియజేశారు.అల్లినగరం హై స్కూల్ ఉపాధ్యాయులు కోటేశ్వరరావు, సుజాత, చంద్రమోహన్ ,శివరాం, గురువయ్య, ప్రకాశరావు ,బోధ నేతల సిబ్బంది పకీరయ్య ,వీరారెడ్డి, అశ్వినీ దేవి తో పాటు అల్లినగరం గ్రామానికి చెందిన పలు వర్గాల ప్రజలు, సత్యనారాయణ స్వామి వ్రతానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. తమ కుమారుడు డాక్టర్ వెంకట ప్రదీప్ వివాహ మహోత్సవానికి ,తమ గృహంలో నిర్వహించిన సత్యాన్ని స్వామి వ్రతానికి హాజరైన ప్రముఖులు, బంధుమిత్రులకు నెలకుర్తి వెంకటనారాయణ ధన్యవాదాలు తెలిపారు.

# డ్రోన్ కెమెరా, సిసి కెమెరాలతో పటిష్ట రక్షణ వలయంలో పామూరు

**సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు**



**పామూరు, పెన్ పవర్, మార్చి 15.**

ప్రకాశం జిల్లా ఎస్పీ ఆదేశాలమేరకు కనిగిరి డిఎస్ పి సాయి ఈశ్వర్ యశ్వంత్, సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం. బీమా నాయక్ ఆదేశాలతో పట్టణంలోని పలు వ్యాపార కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం, పట్టణంలోని ప్రధాన వీధులలో సీసీ కెమెరాలు ఏర్పాటు దిశగా అడుగులు వేస్తున్న క్రమంలో శనివారం ఒక డ్రోన్ కెమెరా కూడా అందుబాటులోకి రావడంతో పామూరు పట్టణం మొత్తం పోలీస్ రక్షణ వలయంలో ఉన్నదని పామూరు సబ్ ఇన్స్పెక్టర్ టి కిషోర్ బాబు అన్నారు. శనివారం సాయంత్రం స్థానిక మమ్మీ డాడీ సెంటర్ నందు డ్రోన్ కెమెరాను పైకి పంపి పట్టణ పరిసరాల ను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పలువురు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రజలు వినియోగ చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలి

**పొదిలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి శోభన్ బాబు**

**పొదిలి, పెన్ పవర్ మార్చి 15**

ప్రజలు వినియోగ చట్టాల పట్ల సరైన అవగాహన కలిగి ఉండాలని పొదిలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి శోభన్ బాబు చెప్పారు ప్రపంచ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా శనివారం నాడు పొదిలిలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా విచ్చేశారు సమావేశానికి పొదిలి వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షులు, ప్రముఖ న్యాయవాది ధర్నాసి రామారావు అధ్యక్షత వహించారు ఈ సందర్భంగా ఎంపీడీవో శోభన్ బాబు మాట్లాడుతూ ప్రజలు వినియోగ చట్టాల పట్ల అవగాహన పెంచుకుంటే, సమాజంలో మోసాలకు గురి అయ్యే అవకాశం ఉండదన్నారు సమాజంలో వినియోగదారులు తమకు తెలియకుండానే పలుచోట్ల మోసాలకు గురి అవుతున్నారని ఆయన చెప్పారు తీసుకున్న వస్తువుకు విధిగా బిల్లు తీసుకోవాలని, అప్పుడే వినియోగదారునికి నష్టపరిహారం పొందే అవకాశం ఉంటుందన్నారు పొదిలి వినియోగదారుల రక్షణ సమితి అధ్యక్షులు రామారావు మాట్లాడుతూ తమ సంఘం ద్వారా ప్రజలకు ఏ విధంగా సేవలందిస్తున్నారో వివరించారు అలాగే వినియోగదారుల రక్షణ సమితి ఆశయాల గురించి ఆశయాల గురించి సవివరంగా తెలియజేశారు రాష్ట్రవ్యాప్తంగా వినియోగ దారుల రక్షణ సమితి లు ప్రజలకు అండగా నిలుస్తున్నాయని ఆయన చెప్పారు సమావేశంలో హబీబుల్లా స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్ కరిముల్లా బేగ్, మాట్లాడుతూ వినియోగదారుల రక్షణ సమితి ప్రజలకు చేస్తున్న సేవల గురించి చెప్పారు ప్రపంచ వినియోగదారుల రక్షణ సమితి దినోత్సవ సందర్భంగా పొదిలిలోని వివిధ పాఠశాలల్లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు ఈ కార్యక్రమంలో బిఆర్ కె శర్మ, మూసా జానీ, ఎస్ మదార్ వలి, ఎండి జిలాని, జిబి షా, జానీ బేగ్, పెద్దన్న, పి కొండయ్య, పి బాల నరసయ్య, ఓ డి షకీలా, ఎన్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.






## ఫోక్సో చట్టంపై అవగాహన






**కందుకూరు పెన్ పవర్ మార్చి 15:**

మండల న్యాయ సేవాధికార సంస్థ కందుకూరు కోర్టు వారి ఆధ్వర్యంలో కందుకూరులోని వివేక డిగ్రీ కళాశాల నందు ఫోక్సో చట్టంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ న్యాయవాది కోటయ్య మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాల బాలికల రక్షణ కొరకు ఫోక్సో చట్టము 2012 వ సంవత్సరం రూపొందిందని,అనంతరం 2019 వ సంవత్సరం కొన్ని కఠినమైన నిబంధనలతో చట్టంలో మార్పులు తెచ్చారని తెలియజేశారు. విద్యార్థులు నేరాలకు దూరంగా ఉంటూ యుక్త వయసులో యువత ఆకర్షణకు గురికాకుండా చదువుపై దృష్టి సారించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని సూచించారు. కందుకూరు బార్ అసోసియేషన్ సభ్యులు సంపత్ ర్యాగింగ్ వలన దుష్పరిణామాలు, విద్యార్థుల భవిష్యత్తుపై చూపించే ప్రభావాలు అనే అంశాన్ని వివరించారు. న్యాయవాది పంతగాని వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థి దశలో తాత్కాలిక సుఖాలకు ఆశపడకుండా కనీసం 25 సంవత్సరాలు చదువుపై దృష్టి సారిస్తే మిగతా జీవితం ఆ చదివే తమకు మంచి జీవితాన్నిస్తుందని తెలియజేశారు.కార్యక్రమంలో వివేకా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## టిఆర్ఆర్ లో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం





**కందుకూరు పెన్ పవర్ మార్చి 15**

పట్టణంలోని టి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(స్వయం ప్రతిపత్తి) ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం స్వర్ణాంధ్ర-2047 దార్శనిక పత్రం ఆధారంగా, ముఖ్యమంత్రి పిలుపు మేరకు ప్రతి నెల మూడవ శనివారం ప్రభుత్వ కార్యాలయాలలో స్వర్ణాంధ్రను సాధించడానికి స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తూ ఉన్నారు. గత నెల ఈ కార్యక్రమాన్ని కందుకూరు పట్టణంలోనే ముఖ్యమంత్రి ప్రారంభించి ఉన్నారు. స్వచ్ఛాంధ్ర - స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని మార్చి నెలలో ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ కాకుండా, మళ్లీ మళ్లీ వాడే పర్యావరణ హిత వస్తువులను వాడండి అనే ఇతివృత్తంతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు ఒకసారి వాడిపడేసే ప్లాస్టిక్ వ్యర్థాలతో వచ్చే అనర్థాలను ఇన్చార్జి ప్రిన్సిపాల్ డా.కె.సుజాత తెలియజేశారు. విద్యార్థులు మరియు అధ్యాపకులు కళాశాల ఆవరణలోని ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించి, ప్లాస్టిక్ ఫ్రీ జోన్ లోని చెత్త కుండీలో వేసి, పర్యావరణహిత, ప్లాస్టిక్ వ్యతిరేక నినాదాలు చేశారు. తదుపరి విద్యార్థులు మరియు అధ్యాపకులు కలిసి ర్యాలీగా వెళ్లి అవగాహన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఐక్యూఏసి కో-ఆర్డినేటర్ డా.పి.రాజగోపాల్ బాబు, అకాడమిక్ కోఆర్డినేటర్ డా.ఎన్.వి.శ్రీహరి, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ కోటపాటి నరేష్ రాజా మరియు కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కరించిన సర్పంచ్ బండి

గిద్దలూరు పెన్ పవర్ మార్చి 15

గిద్దలూరు మండలంలోని నరవ గ్రామపంచాయతీ పరిధిలోని బయనపల్లి లో మంచినీటి సమస్యను పరిష్కరించినట్లు నరవ గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాసులు తెలిపారు. గ్రామంలోని దూదేకుల వీధిలో మంచినీటి ఇబ్బందులతో వీధి ప్రజలు అవస్థలు పడుతుండగా గ్రామ సర్పంచ్ బండి శ్రీనివాసులు నూతన బోరు ఏర్పాటు చేసి శనివారం మోటారు బిగించి నీటి సరఫరా చేశారు. గత కొంతకాలంగా గ్రామస్తులు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాబోయే వేసవిలో నీటి కోసం గ్రామస్తులు ఇబ్బందులు పడకుండా నూతన బోరు ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ బండి శ్రీనివాసులు తెలిపారు. నూతన బోరు ఏర్పాటు చేసి నీటి సమస్య పరిష్కరించిన గ్రామ సర్పంచి శ్రీనివాసులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.



# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగంపై జాగురకత అవసరం

# ప్రజలకు జిల్లా కలెక్టర్ పిలుపు

### - స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ రావు, మేయర్ సుజాత













**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు,పెన్ పవర్ మార్చి 15**

సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ను వినియోగించకుండా ప్రజలందరూ తమ వంతు బాధ్యత వహించాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. పరిసరాలను శుభ్రంగా ఉంచడంతో పాటు జీరో వేస్ట్ మార్కెట్ల ఆవిష్కరణ దిశగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు ప్రజలందరూ సహకరించాలని ఆమె కోరారు. ' స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర ' కార్యక్రమంలో ప్రతినెలా మూడో శనివారం నిర్వహిస్తున్న స్వచ్ఛత దివస్ లో భాగంగా ఒంగోలు నగరంలో నిర్వహించిన పలు కార్యక్రమాలలో స్థానిక శాసనసభ్యులు దామచర్ల జనార్ధన రావు, నగర మేయర్ గంగాడ సుజాత లతో కలిసి ఆమె పాల్గొన్నారు. తొలుత దక్షిణ బైపాస్ రోడ్డులోని జిల్లా ట్రెజరీ కార్యాలయం సమీపంలో జాతీయ రహదారి వెంట మొక్కలను వీరు నాటారు. అనంతరం పి.టి.సి. రోడ్డు లోని ఒంగోలు మునిసిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఏ.బి.సి. సెంటర్ ప్రాంగణంలో వ్యర్థాలతో ఆకర్షణీయంగా రూపొందించిన పార్కును జిల్లా కలెక్టర్ ప్రారంభించారు. ఆ ప్రాంగణం మొత్తాన్ని వీరు కలియతిరిగి ఆసక్తిగా పరిశీలించారు. కుక్కలకు కుటుంబ నియంత్రణ చేస్తున్న విధానాన్ని వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. చివరగా కొత్త కూరగాయల మార్కెట్లో మెప్మా మహిళలకు నిర్వహించిన ప్రత్యేక అవగాహన కార్యక్రమంలో వీరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి బట్టతో, జ్యూట్ తో చేసిన



సంచుల వినియోగాన్ని పెంచేందుకు అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు ఇతర వ్యర్థాలను కూడా సుందరీకరణ దిశగా వినియోగించుకునేలా దృష్టి సారించినట్లు తెలిపారు. ఒంగోలు నగరంతో పాటు జిల్లాలోని అన్ని మార్కెట్లలోనూ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి జీరో వేస్ట్ మార్కెట్లుగా వాటిని తీర్చి దిద్దడంపై ప్రత్యేక దృష్టిసారించామన్నారు. కూరగాయల వ్యర్థాలను కూడా కంపోస్టుగా మారుస్తామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంలో మహిళలు, ముఖ్యంగా స్వయం సహాయక సంఘాలలోని వారు చురుకైన పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. శాసనసభ్యులు జనార్ధన్ మాట్లాడుతూ పరిశుభ్రమైన ఒంగోలు ఆవిష్కరణ లక్ష్యంగా చర్యలు చేపట్టామన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు నగరంలో గ్రీనరీ పెంచుతున్నామని, ప్లాంటేషన్ కు ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. తద్వారా ప్రజల ఆరోగ్యంతో పాటు పర్యావరణ పరిరక్షణ పై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిపారు. ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యలకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ బ్యాగుల విక్రయాలపై భారీగా జరిమానాలు విధిస్తామన్నారు.

మేయర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేలా చట్టం ఉన్నదని, ప్రజలు కూడా సహకరించాలని కోరారు. క్లీన్ అండ్ గ్రీన్ పర్యావరణం కోసం ప్రతినెలా ప్రత్యేక ఇతివృత్తంతో రాష్ట్ర ప్రభుత్వం కార్యక్రమాలు చేపడుతున్నట్లు చెప్పారు. వీటిపై ప్రజలు కూడా అవగాహన పెంచుకోవాలని మేయర్ సూచించారు. కమిషనర్ డాక్టర్ కోడూరి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించేందుకు మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో చేపట్టిన చర్యలను వివరించారు. చికెన్, మటన్ కోసం దుకాణాలకు వచ్చే ప్రజలు ప్లాస్టిక్ కవర్లు కాకుండా ప్రత్యేకంగా స్టీల్ బాక్సులు తెచ్చుకుంటే వారికి కేజీ ధరలో ఐదు రూపాయలు చొప్పున తగ్గిస్తామని దుకాణదారులు ముందుకు వచ్చినట్లు ఆయన తెలిపారు.

# రాజకీయ చరిత్రలో సీఎం చంద్రబాబు అరుదైన రికార్డు

### చంద్రన్న రాజకీయ జీవితం అందరికీ ఆదర్శం
### కఠోర శ్రమ క్రమశిక్షణ ఆయుధం
### నిరంతర కృషివలుడు చంద్రబాబు
### కార్యకర్తలే బలమే శ్రీరామరక్ష
### ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

**స్టాఫ్ రిపోర్టర్ ఒంగోలు, పెన్ పవర్ మార్చి 15**

ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజల ఆశీస్సులతో అరుదైన గౌరవం దక్కించుకున్నారని ఆయన రాజకీయ ప్రయాణం...అందరికీ ఆదర్శనీయమని,అభివృద్ధి.. సంక్షేమం.. కఠోర శ్రమ, సామాజిక న్యాయానికి చంద్రబాబు ప్రతీకని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ మాజీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. సీఎం చంద్రబాబుకు కార్యకర్తలే బలమే శ్రీరామరక్ష అన్నారు.సీఎం చంద్రబాబు శాసనసభలో తొలి ప్రమాణస్వీకారానికి నేటితో 47 ఏళ్లు పూర్తి చేసుకున్నారని ఆయన రాజకీయ జీవితం అందరికీ ఆదర్శమన్నారు. శాసనసభ్యునిగా 15 మార్చి 1978న మొదటిసారిగా ఎమ్మెల్యేగా చంద్రబాబు శాసనసభలో ప్రమాణస్వీకారం చేశారన్నారు. నేటితో 47 ఏళ్లు పూర్తయ్యాయని ఎమ్మెల్యేగా 41 ఏళ్లు, సీయంగా 15 ఏళ్లు పూర్తిచేసుకుని ఏపీ చరిత్రలో అరుదైన రికార్డు సొంతం చేసుకున్న ప్రథమస్థానంలో చంద్రబాబు ఉన్నారన్నారు. అభివృద్ధి.. సంక్షేమం.. సామాజిక న్యాయం చేయడంలో బహుముఖ ప్రజ్ఞ చూపడం వల్లనే ఇంత సుదీర్ఘకాలం చంద్రబాబును ప్రజలు ఆదరించారని పేర్కొన్నారు. విజన్ 2020 నిజమై లక్షలాది ఉద్యోగాలు కల్పించిందని, సంపద సృష్టించిందని. నేడు స్వర్ణాంధ్ర విజన్ 2047తో పౌరుల తలసరి ఆదాయం 35 లక్షలకు పెంచేందుకు అహరహం కృషి జరుగుతున్నదన్నారు.

**చారిత్రక విజయాలు... చంద్రబాబు సొంతం**

సైబరాబాద్, ప్రజా రాజధాని అమరావతి, పోలవరం సృష్టికర్త.. అభివృద్ధి ప్రధాతః ఉమ్మడి ఏపీలోని 23 జిల్లాల యువత 30 లక్షల మందికి సైబరాబాద్ ఉద్యోగాలు, ఉపాధి కల్పించింది. ఐటీ విప్లవం తెచ్చి తెలుగుబిడ్డల్ని 100కు పైగా దేశాలలో పెద్ద ఉద్యోగస్తుల్ని చేశారు.

**విద్యుత్ వెలుగులు నింపిన నేత**

రాష్ట్రంలో 18 మంది సీయంలు స్థాపించిన విద్యుత్ స్థాపిత సామర్థ్యం సుమారు 5 వేల మెగావాట్లు - చంద్రన్న ఒక్కరే 15 వేల మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ ప్లాంట్లు స్థాపించారు. ఇవే లేకపోతే కరెంటు కోతలు వుండేవి. పారిశ్రామిక ప్రగతి వుండేది కాదు. వ్యవసాయ మోటార్లకు ఉచిత విద్యుత్ ఉండేది కాదు. బీసీ వృత్తులు, ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ ఉండేది కాదు. ఆక్వా రైతులకు రూ.1.50కే విద్యుత్ ఉండేది కాదు.



**రహదారుల నిర్మాణం**

సమైక్య రాష్ట్రంలో 51 వేల కి.మీ., నవ్యాంధ్రలో ఇప్పటికి 35 వేల కి.మీ. రోడ్లు నిర్మించారు. నెల్లూరు- చెన్నై జాతీయ రహదారి నిర్మాణానికి బీజం వేసి నేటి జాతీయ రహదారుల నిర్మాణాలకు ప్రేరణ ఇచ్చారు

**పోలవరం.. పట్టిసీమ.. బనకచర్ల., నదుల అనుసంధానకర్త :**

ఎన్టీఆర్ తెలుగుగంగ ద్వారా కృష్ణా-పెన్నా అనుసంధానం చేశారు. చంద్రన్న పట్టిసీమ ద్వారా గోదావరి, కృష్ణా అనుసంధానం చేశారు. అలాగే పురుషోత్తమపట్నం ద్వారా వంశధార, నాగావళి అనుసంధానానికి కృషి జరుగుతున్నది.

**పెట్టుబడుల ఆకర్షణ.. ఉద్యోగ కల్పన:**

సైబరాబాద్ 30 లక్షల ఉద్యోగాలు, ఉపాధి కల్పించారు. 2014-19 మధ్య రూ.5 లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షించి 5.13 లక్షల ఉద్యోగాలు కల్పించారు. 1.80 లక్షల ఉపాధ్యాయ నియామకాలు చేశారు నేడు 16,347 ఉద్యోగాలతో డీయస్సీ నేడు రూ.6.5 లక్షల కోట్లు పెట్టుబడులు ఆకర్షించి 4 లక్షల ఉద్యోగ కల్పనకు కృషి జరుగుతున్నది.

**సంక్షేమ సారధి చంద్రన్న....**

జగన్, ఆయన తండ్రి కలిపి పించన్లకు ఇచ్చింది రూ.1,125 కాగా, చంద్రబాబు ఒక్కరే రూ.2,775 పెంచి ఇచ్చారు. ఐదేళ్లలో రూ.1.60 లక్షల కోట్లు పించన్లు ద్వారా ఇస్తున్న పేదల పెన్నిధి చంద్రన్న. జగన్ పదిచ్చి వంద కొట్టేసే మోసకారి సంక్షేమ పథకాలు పెట్టారు. పేదలు సొంత కాళ్ళపై నిలబెట్టే విదేశీ విద్య, ఇన్నోవా కార్లు, ఆదరణ పథకాలు రద్దు చేశారు.సబ్ నిధులు దారిమళ్లించారు. చంద్రబాబు పేదల్ని సొంత కాళ్ళపై నిలబెట్టే సంక్షేమ పథకాలిచ్చాడు. ఆదరణ పరికరాల ద్వారా బీసీల్ని సొంత కాళ్లపై నిలబెట్టారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులతో ఇన్నోవా కార్లిచ్చి డ్రైవర్లని ఓనర్లు చేశారు. అంబేద్కర్ విదేశీ విద్య, సివిల్స్ కోచింగ్ పెట్టారు.భూమి కొనుగోలు పథకమిచ్చారు. వ్యాపార, పారిశ్రామిక రాయితీలు భారీగా ఇచ్చి సొంత కాళ్లపై నిలబెట్టిన నిజమైన సంక్షేమ సారధి చంద్రన్న 12 లక్షల నాణ్యమైన ఇళ్లు నిర్మించి పేదలకు ఇచ్చారు చంద్రన్న.

**సామాజిక న్యాయానికి మారు పేరు చంద్రన్న**

**మహిళా సాధికారత :** విద్య, ఉద్యోగాల్లో 33% రిజర్వేషన్ స్థానిక సంస్థల ఎన్నికల్లో 33% రిజర్వేషన్ కల్పన. డ్వాక్రా వ్యవస్థను దేశంలోనే మొదటిస్థానంలో నిలిపారు. నేడు రూ.60 వేల కోట్లు బ్యాంకు రుణాలు తీసుకునే స్థాయికి కోటిమంది డ్వాక్రా మహిళలు ఎదిగారు. దీపం-1 ద్వారా నాడు 65 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు... దీపం-2 ద్వారా 93 లక్షల ఉచిత గ్యాస్ కనెక్షన్లు ఇచ్చారు. పాడి పరిశ్రమలో, ఐటీ ఉద్యోగులుగా అధిక శాతం మహిళలు ఉద్యోగాలు, ఉపాధి పొందుతున్నారంటే అది చంద్రన్న సంకల్పమే. జగన్ ఏజెన్సీలో గంజాయి పెంచగా... చంద్రన్న కాఫీ తోటలు పెంచారు. అరకు కాఫీని ప్రపంచవ్యాప్తం చేశారు.

**ఆపద్బాంధవుడు చంద్రన్న**

వరదలు, ప్రకృతి విపత్తుల్లో చిక్కుకున్న బాధితుల పాలిట ఆపద్బాంధవుడు. హుదుద్ అతలాకుతలమైన విశాఖను వాయువేగంతో పునర్నిర్మించారు. కోనసీమ సైక్లోన్, తిల్లి సైక్లోన్తో శ్రీకాకుళం, తుంగభద్ర వరదలకు, కర్నూలు, విజయవాడ వరదలు, ఉక్రెయిన్ యుద్ధంతో చిక్కుకున్న విద్యార్థులు, చార్ దామ్ వరదల్లో చిక్కుకున్న తెలుగువారిని ఆదుకోవడంలో ఆయనకు అయనే సాటి. స్థానిక సంస్థలకు నిధులు, విధులు బదలాయించి వికేంద్రీకరణ పంచాయితీలు, మున్సిపాలిటీలకు కేంద్ర విడుదల చేసిన 15 వేల కోట్లు జగన్ దారి మళ్లించి నిజమైన వికేంద్రీకరణకు గండికొట్టారు. పంచాయితీలు, మున్సిపాలిటీలకు కేంద్ర ఆర్థిక సంఘం ఇచ్చిన నిధులు రూ.27 వేల కోట్లు దారి మళ్లించకుండా చంద్రబాబు ప్రభుత్వం స్థానిక సంస్థలకు విడుదల చేసి నిజమైన వికేంద్రీకరణకు పట్టం కట్టారు. చంద్రబాబు 29 అంశాలలో పంచాయితీలకు అధికారాన్ని బదలాయించారు. లోకేష్ 32 వేల కి.మీ. రోడ్లు వేశారు. రాయలసీమ, ఉత్తరాంధ్ర సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు అత్యధిక భాగం చంద్రన్న పాలనలో నిర్మించినవే.

**ఉద్యోగ కార్మిక సంక్షేమం :**

చంద్రబాబు ఉద్యోగులు, పెన్షనర్లకు 43 శాతం ఫిట్మెంట్ పీఆర్సీ ఇవ్వగా, దీన్ని జగన్ 27 శాతానికి కోతకోశారు. ఒక కోటి 30 లక్షల మంది అసంఘిటత కార్మికులకు చంద్రన్న బీమా ఇచ్చారు. జగన్ అన్న క్యాంటీన్లు రద్దు చేయగా, చంద్రబాబుగారు తిరిగి 204 అన్న క్యాంటీన్లు పెట్టారు.

**ఎన్టీఆర్ ట్రస్టు ద్వారా సేవలు:**

19 లక్షల మందికి ఉచిత వైద్యం అందించారు. 83 వేల యూనిట్ల రక్తాన్ని అందించారు. విపత్తుల్లో 20 లక్షల మందికి సాయం చేశారు.

వేలాది మందికి విద్యాదానం చేశారు. చట్టబద్ధ పాలన చేస్తూ ల్యాండ్, శాండ్, వైన్, మైన్, ఎర్రచందనం, గంజా, డ్రగ్స్, రేషన్ బియ్యం మాఫియాలపై చర్యలు తీసుకుంటూ చంద్రబాబుగారు ప్రజల ధన, మాన, ప్రాణాలకు, ఆస్తులకు రక్షణ కల్పిస్తున్నారు.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com

# మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఉద్దేశపూర్వకంగా వాయిదా

- సభ్యులు వేసి చూస్తున్న ఉద్దేశపూర్వకంగా వాయిదా వేసి వెళ్లిపోయిన ఎంపీడీవో
- ఎంపీడీవో నాసా రెడ్డి పై చర్యలు తీసుకోవాలని మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం చేసిన సభ్యులు
- ఇటీవల మండల పరిషత్ నిధులను దుర్వినియోగంపరిచిన ఎంపీడీవో నాసర్ రెడ్డి పై చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులతో మాట్లాడిన ఎమ్మెల్యే చంద్రశేఖర్ -ఎంపీడీవో ను సస్పెండ్ చేయాలి నినాదాలు






**పెద్ద దోర్నాల పెన్ పవర్ మార్చి 15**

మండల కేంద్రంలోని మండల పరిషత్ సర్వసభ్య సమావేశం మార్చి నెలలో తేదీని ప్రకటించి వాయిదా వేసి తిరిగి శనివారం సమావేశం నిర్వహిస్తున్నట్లు స్థానిక ఎంపీడీవో సభ్యులకు సమాచారం ఇవ్వడం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా యర్రగొండపాలెం శాసనసభ్యులు తాటిపర్తి చంద్రశేఖర్ హాజరు కావడానికి రావడంజరిగింది. సభ్యులు అందరూ హాజరైన సరియైన సమయానికి ఎంపీడీవో సమావేశం మందిరానికి రాకుండా దొంకదారిలో వేరే ఆఫీస్ కార్యాలయంలో తీర్మానం రిజిస్టర్లో సభ్యుల హాజరు కాలేదని కారణముతో వాయిదా వేసినట్లు తెలియజేసి సభ్యులకు కనపడకుండా వెళ్లిపోవడం జరిగింది. ఈ విషయం తెలుసుకున్న ఎర్రగొండపాలెం యర్రగొండపాలెం శాసనసభ్యులు చంద్రశేఖర్ ఫోన్ లైన్ లో మాట్లాడిన ఫోన్ స్విచ్ ఆఫ్ చేసుకుని ఉండటంతో పాత్రికేయుల సమావేశం ఏర్పాటు చేసి జిల్లా అధికారులైన సీఈఓ తో మాట్లాడి జరిగిన విషయం మొత్తం తెలియజేయడం జరిగింది. ముఖ్యంగా ఇక్కడ పనిచేస్తున్నటువంటి ఇన్చార్జి ఎంపీడీవో నాసర్ రెడ్డి అనేక అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నాడని ఇటీవలనే మండల పరిషత్తు నిధులను దుర్వినియోగపరిచి నిధులను డ్రా చేయడం జరిగిందని ఈ విషయాలపై సభలో చర్చ జరుగుతుందనేటువంటి ఉద్దేశ్యంతో అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో నడుస్తూ సభ్యులను అవమానపరచడం జరిగిందని ఈ విషయంపై వెంటనే చర్యలు తీసుకొని ఎంపీడీవోను విధుల నుంచి తొలగించాలని ఆయన ఉన్నతాధికారులకు ఫోన్ లైన్ ద్వారా ఫిర్యాదు చేయడం జరిగింది. ముఖ్యంగా మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలు చేస్తూ వాటిని ఎం బుక్ లలో రికార్డు చేస్తున్న నిధులను డ్రా చేసుకోకుండా అనేక అవాంతరాలు పెడుతున్నట్లు ఎమ్మెల్యే ఉన్నతాధికారులకు తెలియజేయడం జరిగింది. ఇక్కడ పనిచేస్తున్నటువంటి ఎంపీడీవో ఉద్దేశపూర్వకంగా గత కొన్ని పర్యాయాలు ఇదేవిధంగా సభ్యులపై అవమానకరమైన రీతిలో ప్రవర్తిస్తున్నాడని సరియైన సమాచారం సైతం ఇవ్వడం లేదని ఆయనపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయడం జరుగుతుందని కనుక పంచాయతీరాజ్ శాఖలో కొనసాగుతున్న ఆయనను రాష్ట్ర మంత్రి పవన్ కళ్యాణ్ సైతం దృష్టి పెట్టి ఇలాంటి అధికారులను విధుల నుంచి తప్పించాలని ఆయన డిమాండ్ చేశారు. గ్రామాలలో ముఖ్యంగా వేసవికాలం ప్రారంభమవడంతో తాగునీటి సమస్య అధికంగా ఉందని ఈ సమస్యలపై సమావేశంలో చర్చించడం ఎంతో ఆవశ్యకమైనటువంటి విషయమని ఎలాంటి విషయాలను చర్చకు రాకుండా వారు చేసిన తప్పులను కప్పిపుచ్చుకోవడానికి ఈ సమావేశాన్ని ఉద్దేశపూర్వకంగా వాయిదా వేయడం జరిగిందని ఆరోపించారు. ఇకనుండి సభ్యులందరూ కలసికట్టుగా ఉండి ప్రతి ఒక్క తీర్మానాలను క్షుణ్ణంగా పరిశీలించి అవసరమైన విషయాలను తీర్మానాలను చేర్చే విధంగా డిమాండ్ చేసి అలా చేసిన తీర్మానాలకు ఓటు వేయాలని సభ్యులకు సూచించారు. మండలంలోని వివిధ శాఖల అధికారులు సైతం ఎవరికి ఇష్టం వచ్చినట్లు వారు వచ్చి కార్యాలయంలో ఉన్న రిజిస్టర్ లో సంతకాలు చేసి వెళ్లిపోవడం కొసమెరుపు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అధ్యక్షురాలు గుమ్మ పద్మజా ఎల్లేష్ జడ్పిటిసి లత చంద్రకాంత్ నాయక్ ఎంపీటీసీలు సర్పంచులు మండల కన్వీనర్ గంట వెంకట రమణారెడ్డి నియోజకవర్గ గ్రీవెన్స్ అధ్యక్షుడు వెన్నా వెంకటేశ్వర్ రెడ్డి, మైనార్టీ కార్యదర్శి షేక్ షేక్షావలి బీసీ సెల్ నియోజకవర్గ కన్వీనర్ వంటేరు నాగేశ్వరరావు మండల ఉపాధ్యక్షులు దర్శనం నాగయ్య. చిన్న గుడిపాడు సర్పంచి వల్లపునేని పవన్ కుమార్. కటకానిపల్లె సర్పంచి పిక్కిలి కోటిలింగం ఎంపీటీసీలు సర్పంచులు వైసిపి నాయకులుతదితరులు పాల్గొన్నారు.

## సూర్యలంకను షూటింగ్ స్పాట్ గా చేయండి



**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 15:**

ఏపీ వ్యవస్థాపకుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా విన్నపం

ఇప్పటివరకు పర్యాటక కేంద్రంగా ఉన్న సూర్యలంక బీచ్ తీరాన్ని సినిమా షూటింగులకు స్పాట్ గా ఏర్పాటు చేయవలసిందిగా మా- ఏపీ( మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ 24 విభాగాల యూనియన్ ) వ్యవస్థాపక అధ్యక్షుడు, సినీ దర్శకుడు దిలీప్ రాజా కోరారు. ఈ మేరకు ఆయన శనివారం బాపట్ల జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళిని కలసి వినతి పత్రం అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ లో సినీ పరిశ్రమ అభివృద్ధిపై దృష్టి సారించిన నేపద్యంలో సూర్యలంక బీచ్ లో సినిమా షూటింగులు చిత్రీకరించు కోవడానికి తగిన మౌలిక సదుపాయాలను కల్పించవలసిందిగా జిల్లా కలెక్టర్ ను కోరారు. సినిమాల చిత్రీకరణకు అందమైన లోకేషన్లు సూర్యలంకలో ఉన్న నేపథ్యంలో చిత్రీకరణకు వచ్చే నటీనటులకు సాంకేతిక నిపుణులకు వసతి సౌకర్యంతో పాటుగా షూటింగ్ చేయటానికి రెండు గృహాలను ఆర్టు డైరెక్టర్లకు ఏర్పాటు చేయవలసిందిగా దిలీప్ రాజా కోరారు. జిల్లా కలెక్టర్ %ఐబిదీబి% కలిసిన వారిలో సినీ దర్శకులు: అచ్చన కిషోర్, శ్రీనివాస యాదవ్, మణి వరుణ్, నరేష్ దోనె ఉన్నారు.

## స్వచ్ఛ ఆంధ్ర కోసం అందరూ కృషి చేయాలి




**చీరాల,పెన్ పవర్,మార్చ్ 15**

స్వచ్ఛ ఆంధ్ర కోసం అందరు కృషి చేయాలని చీరాల డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి డి గంగాధరరావు అన్నారు. మార్చి 15వ తేదీ శనివారము చీరాలలోని కస్తూరిబా గాంధీ మునిసిపల్ గరల్స్ హైస్కూల్ సందర్శించి రివ్యూ రిజిస్టర్ మరియు ఎస్ఎంసి రిజిస్టర్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా పాఠశాల లో మొక్కలు నాటారు. చేతుల పరిశుభ్రత పై విద్యార్థులకు అవగాహన కల్పించినారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి శ్రీమతి సుధావాణి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కృష్ణ మోహన్ రావు, పి వి బాబు మరియు విద్యార్థులు పాల్గొన్నారు

## ఎ.పి మోడల్ స్కూల్, కళాశాలలో చేరేందుకు దరఖాస్తుల ఆహ్వానం



**పెన్ పవర్ కారంపూడి మార్చ్ 15వ**

కారంపూడి మండలంలోని ఏపీ మోడల్ స్కూల్ జూనియర్ కాలేజీ లో 2025-26 విద్యా సంవత్సరానికి ఇంటర్ మొదటి సంవత్స రంలో ప్రవేశానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ప్రిన్సిపాల్ నయోమి శనివారం ఓ ప్రకటన తేలిపారు. ఈ నెల 17 నుంచి మే నెల 22 వరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకోవచ్చుని ప్రిన్సిపల్ తెలిపారు.అలాగే 6వ తరగతిలో ప్రవేశానికి ఈ నెలాఖరుకు గడువు ముగుస్తుందని తెలిపారు. వివరాలకు 9441422431 ను సంప్రదించాలని ప్రిన్సిపాల్ నయోమి కోరారు.

## ఇంటి పన్నులు చెల్లించండి పురపాలక సంఘం అభివృద్ధికి సహకరించండి కమిషనర్

**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 15:**

బాపట్ల:పట్టణ ప్రజలు సకాలంలో ఇంటి పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి అన్నారు. ఇప్పటికే తమ సిబ్బంది ద్వారా ప్రజల వద్దకు పంపించి ఇంటి పన్నులు, నీటి కులాయి పన్నులు వసూళ్లు చేస్తున్నామని చెప్పారు. ఇంటి పన్ను వసూలు,నీటి పన్ను వసూలు చెల్లించకుండా ఉంటే మన బాపట్ల అభివృద్ధిని బాపట్ల ప్రజలే అడ్డుకున్న వారు అవుతారని నూటికి నూరు శాతం పన్ను చెల్లించి రాష్ట్రస్థాయిలో బాపట్ల పురపాలక సంఘాన్ని మొదటి స్థానంలో నిలబెట్టడంతో పాటు, ప్రస్తుత ఆర్థిక సంవత్సర ఇంటి పన్ను వసూళ్లతో ముడిపడి ఉన్న 15వ ఆర్థిక సంఘం నిధులను బాపట్ల తెచ్చుకునే విధంగా బాపట్ల ప్రజలు సహకరిస్తారని ఆశిస్తున్నామన్నారు. ఆర్థికవంతులు,విద్యావంతులు, వివిధ రకాలుగా ఉన్న పారిశ్రామిక వ్యక్తులు, వ్యాపారస్తులు, ప్రజలందరూ ఇంటి పన్ను చెల్లించి బాపట్ల అభివృద్ధికి దోహదపడాలని మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి కోరారు. పట్టణ అభివృద్ధి ప్రజల పైనే ఆధారపడి ఉందని ప్రజలందరి సహకారంతోనే అభివృద్ధికి శ్రీకారం చుడతామని ఆయన పిలుపునిచ్చారు.



## వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు




**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 15:**

బాపట్ల నియోజకవర్గం పిట్టలవాని పాలెం మండలం చందోలు లో వేగేశన ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు కార్యక్రమంలో గుంటూరు తూర్పు నియోజకవర్గ ఎమ్మెల్యే అబ్దుల్ నజీర్ తో కలిసి బాపట్ల నియోజకవర్గ ఎమ్మెల్యే , వేగేశన ఫౌండేషన్ చైర్మన్ వేగేశన నరేంద్ర వర్మ రాజు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యనిర్వాహ కార్యదర్శి తాతా జయప్రకాష్ నారాయణ, చందుల మండల పార్టీ అధ్యక్షులు ఆఫ్జల్, గ్రామ పార్టీ అధ్యక్షులు రజాక్ మరియు తెలుగుదేశం,జనసేన, బిజెపి నాయకులు,ముస్లిం సోదర సోదరీమణులు పాల్గొన్నారు.





## పందిల్లపల్లిలో ప్లాస్టిక్ నిషేదంపై స్పెషల్ డ్రైవ్

**వేటపాలెం,పెన్ పవర్,మార్చ్ 15**

వేటపాలెం మండలం పందిల్లపల్లి గ్రామ

పంచాయతీలో పారిశుద్ధ్య కార్యక్రమంలో భాగంగా శనివారం ప్లాస్టిక్ నిషేధం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్ లో గ్రామంలోనీ ప్రతి ఇంటి నుండి చెత్తను సేకరించి షెడ్ కు తరలించాలని తెలిపారు. 'స్వచ్ఛ ఆంధ్ర-స్వర్ణ పందిళ్ళపల్లి' అనే కరపత్రికను పంచాయితి వీవోలకు, స్కూల్ పిల్లలకి కార్యదర్శి మాల్యాద్రి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేష్ బాబు , ఎమ్మార్వో పార్వతి పాల్గొన్నారు.




# పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

## తాహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్

**పెన్ పవర్ కారంపూడి మార్చి 15**

పరిసరాలను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచుకోవాలని కారంపూడి తాహసిల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ అన్నారు. కారంపూడి పట్టణంలో తహశీల్దార్ వెంకటేశ్వర్లు నాయక్ ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర-స్వచ్ఛ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ.. ప్రజలు తాము నివసించే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీధులను శుభ్రంగా ఉంచాలని కోరారు. అంటు వ్యాధులు ప్రబలకుండా



జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం లో ఇంచార్జ్ ఆర్ ఐ వేముల. శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాలుగోన్నారు.

పెన్ పవర్
గుంటూరు । బాపట్ల । పల్నాడు

# ప్లాస్టిక్ నిషేధంపై ప్రజలకు అవగాహన కల్పించాలని

## రాష్ట్ర ఇంటర్మీడియట్ బోర్డు కమిషనర్ మరియు జిల్లా ప్రత్యేక అధికారి కృతిక శుక్ల









**పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 15:**

బాపట్ల సూర్యలంక బీచ్ లో స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో స్వచ్ఛ ఆంధ్ర స్వచ్ఛ స్వర్ణ కార్యక్రమాలు భాగా జరుగుతున్నాయని ఆమె చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను జిల్లాలో పర్యవేక్షించడానికి ప్రత్యేక అధికారులను నియమించిందన్నారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై వివరాలు సేకరించి ప్రభుత్వానికి నివేదిక రూపంలో ఇస్తామని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి మాట్లాడుతూ స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలకు రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతినెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలను అమలు చేస్తున్నారని వివరించారు. ఇందుకోసం అధికారులకు దిశా నిర్దేశం చేశారన్నారు. స్వచ్ఛఆంధ్ర స్వర్ణ ఆంధ్ర కార్యక్రమాలు జయప్రదానికి ప్రజల భాగస్వామ్యం కావాలని ఆయన అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలు, గ్రామాల్లో పారిశుద్ధ కార్యక్రమాలు చేపట్టి తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను వేరు చేసే విషయంపై మహిళలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. సేకరించిన తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకర చెత్తను చెత్త సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. చెత్త సేకరించే సమయంలోనే వేర్వేరుగా చేసి తిరిగి వాటిని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. జిల్లాలోని 17 లక్షల మంది ప్రజలు ఉన్నారని, వీరి కొరకు ఈ కార్యక్రమం జరుగుతుందని ప్రతి ఒక్కరికి తెలియజేయాలని ఆయన అన్నారు. ఈరోజు సూర్యలంక బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో వేలాది మంది ప్రజలు భాగస్వాములయ్యారన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బాపట్ల శాసనసభ్యులు శ్రీ వేగేశన నరేంద్ర వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం స్వచ్ఛంగా ఉండాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలను నిర్వహిస్తుందన్నారు. పచ్చదనం పరిశుభ్రతా కార్యక్రమాల అమలులో ఇప్పటికీ కొంత వెనకబడి ఉన్నామన్నారు. రాబోయే రోజుల్లో సింగపూర్, లండన్ లాంటి దేశాలకు దీటుగా మన రాష్ట్రంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు అమలు చేయాలని ఆయన అన్నారు. మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమాలు నిర్వహించడం పండుగ వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. ఈ సందర్భంగా సూర్యలంక బీచ్ క్లీనింగ్ కార్యక్రమంలో జిల్లా ప్రత్యేక అధికారి కృతిక శుక్ల, జిల్లా కలెక్టర్ జై వెంకట మురళి, శాసన సభ్యులు నరేంద్ర వర్మ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులు, పారిశుద్ధ కార్మికులు, అధికారులతో మానవహారం నిర్వహించి ప్రతిజ్ఞ చేయించారు. స్వచ్ఛ ఆంధ్ర స్వర్ణాంధ్ర కార్యక్రమంపై విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బాపట్ల అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ చైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా ఎస్పీ తుషార్ డూడి, జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా రెవెన్యూ అధికారి జి. గంగాధర్ గౌడ్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్, జిల్లా అటవీ శాఖ అధికారి బీమయ్య, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి జెన్నెమ్మ, జిల్లా విద్యాశాఖ అధికారి పురుషోత్తం, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డి.ఆర్.డి.ఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ పద్మజ, తదితరులు పాల్గొన్నారు.

# పదవ తరగతి పరీక్షల రాస్తున్న దివ్యాంగ విద్యార్థులకు వసతులు కల్పించాలి

## నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా



**వేటపాలెం,పెన్ పవర్,మార్చ్ 15**

బాపట్ల జిల్లా లో పదవ తరగతి పరీక్షలు వ్రాస్తున్న దివ్యాంగ విద్యార్థులకు వసతులు కల్పించాలని నవ్యాంధ్ర వికలాంగుల హక్కుల సేవాసమితి రాష్ట్ర అధ్యక్షులు షేక్ కాలేషా డిమాండ్ చేశారు శనివారం ఆయన దివ్యాంగుల హక్కుల చట్టం 2016 చట్టం అమలు చేయాలని పత్రిక ప్రకటన విడుదల చేశారు పరీక్షలు రాస్తున్న కేంద్రంలో వీల్ చైర్లు, ర్యాంపులు, మంచినీటి వసతి వారికి అనుకూలమైన వాతావరణంలో గ్రౌండ్ ఫ్లోర్ లోనే పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇస్తున్న చాలాచోట్ల అమలుపరచడం లేదని వాపోయారు వేటపాలెంలోని బిబి హెచ్ జూనియర్ కాలేజీలో దివ్యాంగ విద్యార్థులకు కనీసం వీల్ చైర్లు ఏర్పాటు చేయకుండా దోగాడే విద్యార్థులకు కనీసం వారి కొరకు ఒక వాలంటీర్ ను కూడా ఏర్పాటు చేయలేదంటే దివ్యాంగుల పట్ల ఎంత చులకన భావం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు ఇలాంటివి తరుచూ జరుగుతున్న ఉన్నతాధికారులు మాత్రం పట్టించుకోవటం లేదని విమర్శించారు బాపట్ల జిల్లా వ్యాప్తంగా ఇలాంటివి ఎన్నో జరుగుతున్నాయి ప్రస్తుతం ఇంటర్మీడియట్ పరీక్షలు జరుగుతున్నాయి. 17 నుండి 10వ తరగతి ప్రధాన పరీక్షలు జరగబోతున్నాయి ఇప్పటికైనా దివ్యాంగుల పట్ల నిర్లక్ష్యం వీడి వారికి అనుకూలమైన వాతావరణంలో పరీక్షలు రాసే వెసులు బాటు కల్పించి వీల్ చైర్ లు, ర్యాంపులు వారికి అనుకూలంగా మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాలంటీర్లను కూడా సిద్ధం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు లేని పక్షంలో జాతీయ దివ్యాంగుల హక్కుల చట్టం 2016 ప్రకారం సంబంధిత అధికారుల మీద శాఖపరమైన చర్యలు తీసుకోవదానికి పోరాటం చేపడతామన్నారు

## కౌన్సిలర్లు, అధికారులు వారానికోసారి

# ప్రజల్ని కలిసి వారి సమస్యలు తెలుసుకోవాలి

**మున్సిపాలిటీ పరిధిలో జరిగిన గ్రీవెన్స్ లో ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన ప్రత్తిపాటి.**

**రోడ్లపై గుంతలు, డ్రైనేజ్ ల నిర్మాణం, చేపలమార్కెట్ ఏర్పాటు, కుక్కల బెడద, టిడ్కో ఇళ్ల సముదాయంలో ప్రార్థనా మందిరాల నిర్మాణ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు.**




**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 15:**

ప్రజా సమస్యల పరిష్కారం కోసం కూటమిప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు ఫలించాలంటే, అధికారులు... స్థానిక ప్రజాప్రతినిధులు క్షేత్రస్థాయిలో నిత్యం ప్రజలకు అందుబా టులో ఉండాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు. శనివారం ఆయన పట్టణంలోని మున్సిపాలిటీలో నిర్వహించిన గ్రీవెన్స్ లో పాల్గొని ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. పట్టణవ్యాప్తంగా వివిధ వార్డుల నుంచి వచ్చిన ప్రజలతో నేరుగా మాట్లాడిన మాజీమంత్రి, వారి సమస్యల పరిష్కారం దిశగా అప్పటికప్పుడే అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణంలోని ప్రజలు తాము ఎదుర్కొంటున్న సమస్యల్ని ఫిర్యాదుల రూపంలో తన దృష్టికి తీసుకొచ్చారని, ఎక్కువగా రోడ్లు ఎగుడుదిగుడుగా, గుంతలతో ఉండటం, డ్రైనేజ్ ల నిర్మాణం, తాగునీటి సమస్యలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రజల సమక్షంలోనే అధికారులతో మాట్లాడిన మాజీమంత్రి, సమస్యల పరిష్కారానికి అధికారులకు తగు సూచనలు ఆదేశాలిచ్చారు. స్థానిక కౌన్సిలర్లు, అధికారులు వారానికోసారి వార్డుల్లో పర్యటించి, ప్రజలకు అందుతున్న సేవల్ని పరిశీలించి, వారి సమస్యలు తెలుసుకోవాలని ఈ సందర్భంగా ప్రత్తిపాటి ఆదేశించారు. గ్రీవెన్స్ లో ఇచ్చిన ప్రతి అర్జీదారుని సమస్య పరిష్కారం కావాలని, మరలా తానే స్వయంగా వారితో మాట్లాడి, వారి సంతృప్తిని తెలుసుకుంటానని ఆయన తెలిపారు. చేపలమార్కెట్ నిర్మాణ ప్లాన్ త్వరగా సిద్ధం చేయాలని అధికారుల్ని ఆదేశించిన ఆయన, 2019కి ముందు కొత్తగా చేపలమార్కెట్ నిర్మాణం చేపట్టడటం జరిగిందని, వైసీపీప్రభుత్వం రావడంతో ఆ పనులన్నీ నిలిచిపోయాయన్నారు. శివారు కాలనీలకు కూడా తాగునీరు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, పట్టణంలో ఎక్కడా తాగునీటి ఇబ్బందులు ఉండకూడదన్నారు. పట్టణంలో కుక్కల సంచారం లేకుండా చూడాలని, వీధికుక్కల్ని పట్టి, జనావాసాలకు దూరంగా తరలించాలన్నారు. టిడ్కో ఇళ్ల సముదాయంలో ప్రార్థనా మందిరాల నిర్మాణానికి అనువైన స్థలాన్ని ఎంపిక చేయాలని అధికారులకు సూచించిన మాజీమంత్రి, అక్కడ అసాంఘిక కార్యకలపాలకు తావు లేకుండా పోలీసులు తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ షేక్ రఫానీ, మున్సిపల్ కమిషనర్ శ్రీహరి, డిఈ రహీం, పట్టణ సీఐ రమేష్ బాబు, మున్సిపల్ కౌన్సిలర్లు, కూటమి నాయకులు ,అధికారులు, తదితులున్నారు.



# అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు



**చీరాల,పెన్ పవర్,మార్చి 15:**

రైళ్లలో ప్రయాణికులకు మత్తుమందు కలిపిన తినుబండారాలు ఇచ్చి వారి ఆభరణాలు దోచుకుపోతున్న హర్యానాకు చెందిన అంతర్రాష్ట్ర దొంగ విజేంద్రకుమార్ ను చీరాల రైల్వే ఎస్సై కొండయ్య తన సిబ్బందితో కలిసి చాకచక్యంగా అరెస్టు చేశారు. ముద్దాయిని హర్యానాలోని మాచివ్యాలీలో పట్టుకొని అక్కడి కోర్టులో హాజరు పరిచి ట్రాన్సిట్ వారెంట్ పై తీసుకొచ్చి శనివారం నెల్లూరు రైల్వే కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్సై కొండయ్య చెప్పారు.

# వికాస్ స్కూల్ బస్సు నిర్వాహకం వల్ల ఒక వ్యక్తి మృతి



**పెన్ పవర్ చిలకలూరిపేట మార్చి 15:**

చిలకలూరిపేట రూరల్ పరిధిలోని వేలూరు గ్రామానికి చెందిన చౌటుపల్లి ఆశీర్వాదం, వయసు 55 సం.లు., అను అతను పొలము పనుల నిమిత్తం వెళ్ళి తిరిగి పొగాకు బైళ్ళతో ట్రాక్టర్ ఇంజన్ నందు డ్రైవర్ ప్రక్కనా కూర్చొని వస్తుండగా, కుక్కపల్లివారిపాలెం గ్రామం, రైతుభరోసా కేంద్రం వద్దకు వచ్చు సరికి, చిలకలూరిపేట లోని వికాస్ స్కూల్ కు చెందిన బస్సు వెనకనుంచి ట్రాక్టర్ ట్రక్ నీ గుద్దడంతో చౌటుపల్లి ఆశీర్వాదం ట్రాక్టర్ ఇంజన్ పై నుండి రోడ్డు మీద పడి చనిపోవడం జరిగినది.ఆ విషయం మై ఆశీర్వాదం కొడుకు రామయ్య ఇచ్చిన రిపోర్ట్ గాను చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ ఎస్సై జి అనిల్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నవనగరాల నిర్మాణాల పూజకు మోడీ



**అమరావతి, మార్చి 15, పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్‌లో కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఓవైపు పోలవరం, రెండోవైపు అమరావతిని పరుగులు పెట్టించే పనిలో ఉంది. కేంద్రంలోని ప్రభుత్వ సహకారంతో నిధులకు కొరత లేకుండా చూసుకుంటూ గతంలో చేసిన తప్పిదాలు జరగకుండా జాగ్రత్తపడుతోంది. ఇప్పటికే ఫైనలైజ్ అయిన నిర్మాణాలు పూర్తి చేసేందుకు సిద్ధమైంది.ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణాన్ని వేగవంతం చేసింది కూటమి ప్రభుత్వం. అధికారంలోకి వచ్చిన వెంటనే అక్కడ పేరుకుపోయిన చెత్తను తొలగించింది. ఇప్పుడు వివిధ దశల్లో ఆగిపోయిన నిర్మాణాలూ పూర్తి చేసేందుకు టెండర్లు పిలిచింది. గతంలో వివిధ సంస్థలకు కేటాయించిన టెండర్లను రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలించింది. వాటిని ఫైనలైజ్ చేసింది. అమరావతి నిర్మాణంలో భాగంగా సగంలో ఆగిపోయిన బిల్డింగ్స్‌ను పూర్తి చేస్తూనే కొత్త నిర్మాణ పనులు చేపట్టనుంది. అందులో భాగంగా నవ నగరాల శంకుస్థాపనకు ముహూర్తం ఖరారు చేయబోతోంది. దీనికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీని ఆహ్వానించబోతోంది. ఆయన ఇచ్చే షెడ్యూల్ ఆధారంగా ముహూర్తం ఖరారు చేయనున్నారు. నవనగరాల శంకుస్థానకు ఏప్రిల్ 15 నుంచి 20 మధ్య ప్రధానమంత్రి రానున్నారు. ఇంకా షెడ్యూల్ ఫైనల్ కాలేదు. ఒకసారి పీఎవో నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఈ విషయాన్ని ప్రకటించనుంది. ఇప్పటికే ఈ విషయం గురించి చంద్రబాబు చూచాయిగా చెప్పారు. ఏపీలో కూటమి ప్రభుత్వం రాజధాని అమరావతి పునర్నిర్మాణాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. క్యాపిటల్ సిటీలో నవ నగరాల నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమం త్వరలోనే జరగనుంది. అయితే ఈ కార్యక్రమాన్ని ప్రధాని మోదీ చేతుల మీదుగా నిర్వహించాని ఏపీ సర్కార్ ఇప్పటికే నిర్ణయం తీసుకుంది. అయితే ఇందులో పాల్గొనేందుకు ప్రధాని మోదీ.. ఏప్రిల్ 15 నుంచి 20 తేదీల మధ్య అమరావతికి వచ్చే ఛాన్స్ ఉన్నట్లు తెలుస్తోంది. మొదటిదశలో రాజధానిలో నిర్మాణాల కోసం, మౌలకి సదుపాయాలు కల్పించేందుకు రాష్ట్ర సర్కార్ రూ.64,721 కోట్లు ఖర్చు చేయనుంది. ఇప్పటికే రూ.37,702 కోట్ల పనులకు టెండర్లు ఖరారు చేసింది. అయితే ఈ నిర్మాణ పనులను మిషన్ మోడ్‌లో చేపట్టేలా ప్రణాళికలు రెడీ చేస్తోంది. మార్చి 17న రాష్ట్ర కేబినెట్ సమావేశం జరగనుంది.అయితే ఈ సమావేశంలో వీటికి ఆమోదం లభించిన తర్వాత కాంట్రాక్ట్ ఏజెన్సీలకు అగ్రిమెంట్ లెటర్లు జారీ చేయనుంది. వర్క్ ఆర్డర్లు జారీ కాగానే ఏజెన్సీలు పనులు ప్రారంభించనున్నాయి. ఇదిలాఉండగా 2014లో చంద్రబాబు ఏపీకీ సీఎం అయినప్పుడు ఏపీ రాజధానిగా అమరావతిని నిర్ణయించిన సంగతి తెలిసిందే. కానీ వాటి పనులు మధ్యలోనే ఆగిపోయాయి. 2019లో వైసీపీ అధికారంలోకి రావడంతో అమరావతిలో పనులు ఆగిపోయాయి. అప్పటి సీఎం జగన్ మూడు రాజధానుల ప్రస్తావన తీసుకురావడంతో రాజధాని నిర్మాణానికి అడుగులు పడలేదు. చివరికి 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మళ్లీ రాజధానిగా అమరావతినే నిర్ణయించారు. దీంతో అక్కడ పనులు పునఃప్రారంభమయ్యాయి.

అమరావతికి పునాది రాయి వేసింది మోదీ అని తర్వాత దశల్లో కూడా ఆయన సహకరం, ఆశీస్సులతోనే నిర్మాణాలు పూర్తి అవుతాయని అసెంబ్లీలోనే ప్రకటించారు. నిర్మాణ పనులకు సంబంధించిన కాంట్రాక్ట సంస్థలకు పనులు అప్పగించే ప్రక్రియకు ఆమోదం తెలపనున్నారు. అనంతరం టెండర్లు దక్కించుకున్న సంస్థలకు పనులు ఇస్తూ ఆదేశాలు జారీ చేస్తారు. వారికి లెటర్లు పంపిస్తారు. అనంతరం అమరావతిలో మౌలిక సదుపాయాల కల్పన, ఇతర నిర్మాణ పనులు ఊపందుకోనున్నాయి.

# విజయసాయిరెడ్డి భవిష్యత్ పక్కా ప్లాన్...



**విజయవాడ, మార్చి 15, పెన్ పవర్**
వైసీపీలో పడిన అవమానాలకు ప్రతీకారం తీర్చుకునేందుకు మాజీ ఎంపీ సాయిరెడ్డి తహతహలాడుతున్నట్టు తెలుస్తోంది. నాలుగున్నరేళ్లుగా తనలో దాచుకున్న అసంతృప్తి, ఆ పార్టీ అధ్యక్షుడితో ట పడిన అవమానాలకు బదులు తీర్చుకునే క్రమంలోనే తాజా రాజకీయ పరిణామాలు చోటు చేసుకున్నట్టు తెలుస్తోంది.సాయిరెడ్డి ప్రదర్శిస్తున్న దూకుడు వెనుక జగన్ ప్రత్యర్థుల అండదండలు ఉన్నాయనే అనుమానం వైసీపీలో ఉంది. సాయిరెడ్డి డైరెక్ట్ అటాక్ నేపథ్యంలో మున్ముందుజరిగే పరిణమాలపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.చార్టర్డ్ అకౌంటెంట్‌గా కెరీర్ ప్రారంభించిన విజయ సాయిరెడ్డి... వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డి వ్యాపార సామ్రాజ్యాన్ని నిర్మించడంలో కీలక పాత్ర పోషించారు. ఈ క్రమంలో జగన్‌తో పాటు కేసులు, జైలు జీవితాన్ని కూడా అనుభవించారు. వైసీపీ ఆవిర్భావం తర్వాత ఆ పార్టీలో జగన్ తర్వాత స్థానం తనదేనని భావించారు.వైసీపీలో సాయిరెడ్డి అంతులేని అధికారాన్ని, హోదాను అనుభవించారు. ఎంత వేగంగా వైసీపీలో ఎదిగారో అంతే వేగంగా వైసీపీలో ఆయన ప్రభావాన్ని కోల్పోయారు. వైసీపీలో జగన్ స్థానాన్ని కుదిస్తూ చివరకు పార్టీని వీడే వరకు పరిణామాలు నడిచాయి. ఈ క్రమంలో ఎవరి వాదన కరెక్ట్ అనే దానిపై కూడా భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పదవి, అధికారం అనుభవించి తన దారి తాను చూసుకున్నారనే విమర్శలతో పాటు ఆత్మాభిమానం కోసం వెళ్లిపోయారనే వాదన కూడా ఉంది.2024 ఓటమికి ముందు జరిగిన పరిణామాలతో మనస్తాపం చెందిన సాయిరెడ్డి అదను కోసం ఎదురు చూసినట్టు తెలుస్తోంది. ఈ క్రమంలో స్వీయ రాజకీయ భవిష్యత్తు కోసం జాగ్రత్త పడినట్టు తెలుస్తోంది. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో జగన్‌కు ఎదురు తిరిగితే జరిగే పరిణామాలను ఊహించే ఆయన తన టైమ్ కోసం ఎదురు చూసినట్టు సన్నిహితులు చెబుతున్నారు. ఈ క్రమంలో గత జూన్‌లో వైసీపీ ఓటమి తర్వాత సాయిరెడ్డి తన దారి తాను చూసుకోవడం ప్రారంభించారు.వైసీపీలో రెండు సార్లు రాజ్యసభకు అవకాశం కల్పించినా ఆ పార్టీలో కొనసాగడం అనవసరం అనే భావనకు రావడం వెనుక చాలా కారణాలు ఉన్నట్టు సాయిరెడ్డి సన్నిహితులు చెబుతున్నారు. వైసీపీ అధికారంలో ఉండగా కీలక విషయాలపై సాయిరెడ్డి ప్రమేయాన్ని, ప్రాధాన్యతను తగ్గించడం, అధికారుల ఎదుట చులకన చేయడం, సాయిరెడ్డి బాధ్యతలు చెవిరెడ్డి నిర్వహిస్తారని ఐఏఎస్ అధికారులకు నేరుగా స్పష్టం చేయడం వంటి అంశాలతో జగన్‌తో దూరం పెరిగినట్టు తెలుస్తోంది.తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలకు ముందు వెలుగులోకి వచ్చిన ఢిల్లీ లిక్కర్ స్కామ్, సౌత్ గ్రూప్ పరిణామాలతో జగన్ - సాయిరెడ్డి మధ్య దూరం మరింత పెరిగినట్టు తెలుస్తోంది. సౌత్ గ్రూప్ వ్యవహారంలో సాయిరెడ్డి సమీప బంధువు శరత్ చంద్రారెడ్డి అరెస్ట్ కావడం వైసీపీ అధినేత జగన్‌ను చికాకు పెట్టినట్టు తెలుస్తోంది. మరోవైపు ఢిల్లీ లిక్కర్ స్కామ్ వ్యవహారంలో జరిగిన పరిణామాలతో సాయిరెడ్డి ప్రమేయం ఉందంటూ జరిగిన ప్రచారం ఆయన్ని మనస్తాపానికి గురి చేసిందనే వాదన కూడా ఉంది. ఈ క్రమంలో ఇటీవల రాజ్ కసిరెడ్డి పేరును నేరుగా సాయిరెడ్డి బయటపెట్టారు. ఈ మొత్తం పరిణామాలు ఆర్థిక లావాదేవీలతో ముడిపడినవి కావడంతో సాయిరెడ్డి-జగన్ మధ్య విభేదాలు తీవ్రమైనట్టు తెలుస్తోంది.నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పార్టీని వీడటం వెనుక సాయిరెడ్డి ప్రోత్సాహం ఉందంటూ ఆయన వ్యతిరేక వర్గం తాడేపల్లిలో విస్తృతంగా ప్రచారం చేసింది. సాయిరెడ్డి లోక్‌సభకు వెళితే ఆ స్థానంలో మరొకర్ని నియమించుకోవచ్చని భావించారు. నిజానికి సాయిరెడ్డికి లోక్‌సభకు వెళ్లడం ఇష్టం లేదు. రెండు విడతల్లో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీకి దగ్గర కావడానికి ఆయన రాజ్యసభ పదవి ఉపయోగపడింది. రాజ్యసభలో బీజేపీకి తగినంత బలం లేకపోవడం కూడా ఇందుకు కారణమైంది. బలవంతంగా లోక్‌సభకు పంపే ప్రయత్నాలు చేయడంతో వైసీపీని వీడాలనే భావన బలపడినట్టు తెలుస్తోంది.సాయిరెడ్డి ధిక్కార స్వరం వెనుక పూర్తి స్థాయి రాజకీయ అండదండలు ఆశీస్సులు ఉన్నట్టు తెలుస్తోంది. ఆయన రాజకీయ భవిష్యత్తుకు ఢిల్లీ స్థాయిలో భరోసా లభించిన తర్వాతే ఆయన స్వరంలో మార్పు వచ్చినట్టు తెలుస్తోంది. వైసీపీని వీడాలని నిర్ణయించుకున్న తర్వాత కేంద్రంలోని బీజేపీ పెద్దలతో సంప్రదింపులు కూడా జరిపినట్టు ప్రచారం జరుగుతోంది. ఏపీలో ఎన్డీఏ కూటమి ఏర్పడటంతో సాయిరెడ్డి చేరికు చిక్కులు ఏర్పడినట్టు తెలుస్తోందిఈ క్రమంలోనే కాకినాడ సీ పోర్ట్ వ్యవహారంలో సాయిరెడ్డిపై కేసు నమోదైంది. తన పేరును ఇరికించడం వెనుక కుట్ర ఉందని సాయిరెడ్డి అనుమానిస్తున్నారు. దీంతో నేరుగా జగన్ సోదరుడు విక్రాంత్ రెడ్డి పేరును తెరపైకి తెచ్చారు. వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్ రెడ్డి పేరుతో పాటు లిక్కర్ స్కామ్‌లో రాజ్ కసిరెడ్డి పేరును కూడా ప్రస్తావించారు. ఇదంతా యాధృచ్ఛికంగా జరిగింది కాకపోవచ్చనే సందేహాలు ఉన్నాయి.సాయిరెడ్డి నేరుగా కొన్ని పేర్లను ప్రస్తావించడం భవిష్యత్తులో జరగబోయే పరిణామాలకు సంకేతాలనే అనుమానాలు కూడా ఉన్నాయి. ఇప్పటికే ఆయనకు గవర్నర్ పదవి గ్యారంటీ అనే ప్రచారం ఢిల్లీలో జరుగుతోంది. ఇటీవల ఉపరాష్ట్ర పతి హైదరాబాద్ పర్యటనకు వచ్చినపుడు సాయిరెడ్డి అక్కడ ప్రత్యక్షం అయ్యారు. రాజకీయాల నుంచి తప్పుకుంటున్నట్టు ప్రకటించినా నిత్యం సోషల్ మీడియాలో యాక్టివ్‌గానే ఉంటున్నారు.అధ్యక్షుడు జగన్మోహన్ రెడ్డిపై విమర్శలు చేయడం ద్వారా సాయిరెడ్డి ఆ పార్టీ ముద్ర నుంచి బయటపడే ప్రయత్నాలు చేస్తున్నారనే వాదన కూడా ఉంది. ఆయన ఏ పార్టీలో చేరాలన్నా మొదట వైసీపీ ముద్ర నుంచి వదిలించుకోవాలనే కండిషన్‌తోనే తాజా పరిణామాలు జరుగుతున్నట్టు సమాచారం. తన తర్వాత తన కుటుంబ సభ్యులకు పొలిటికల్ కెరీర్ అందించే క్రమంలోనే సాయిరెడ్డి వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారనే ప్రచారం ఉంది.

# అర్ధరాత్రి గోవుల అపహరణ

**గూడూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్ లో వరుస ఫిర్యాదులు**

**గుడూరు: పెన్ పవర్** తిరుపతి జిల్లా గూడూరులో గోవులు మాయం మిస్టరీగా మారింది. వరుస ఘటనలతో "పుష్ప" స్మగ్లింగ్ ను తలపించేలా నెంబరు ప్లేట్ లేని రక రకాల వాహనాల్లో గోవులను స్మగ్లింగ్ చేయడం తిరుపతి జిల్లా గూడూరులో ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. గత 20 రోజులుగా సుమారు 150కి పైగా, కోటి రూపాయల విలువైన గోవులు మాయం అయినట్లు అంచనా. ఇక్కడ మాయమవుతున్న గోవులు సముద్ర మార్గంలో విదేశాలకు అక్రమంగా ఎగుమతి అవుతున్నాయా..? అనే అనుమానాలు లేకపోలేదు. భారతీయ జీవన విధానంలో భాగమైన గోవులను అంతం చేసేందుకు రెండు, మూడు ముఠాలుగా ఏర్పడి గోవులకు మత్తు ఇచ్చి వాటిని ప్యాసింజర్, ట్రక్ లలో ఎక్కించి అర్ధరాత్రి వేళ అక్రమంగా తరలించుకు వెళుతున్నట్లు సిసి కెమెరాల్లో రికార్డయిన వీడియోల్లో కనిపిస్తోంది. గూడూరు నిమ్మ మార్కెట్లో ఎద్దుల బండ్లు వద్ద కట్టి ఉంచిన ఎద్దుల అపహరణతో మొదలు పెట్టిన పర్వం నేటికీ కొనసాగుతోంది. గోవుల అదృశ్యం పై గూడూరు రెండో పట్టణ పోలీసు స్టేషన్ లో సుబ్బారెడ్డి అనే వ్యక్తి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. సిసి పుటేజీలను పరిశీలించిన పోలీసులు ఆశ్చర్యానికి లోనవుతున్నారు. ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున గోవులను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. జాతీయ రహదారిపై భూదనం టోల్ ప్లాజా వద్ద సిసి పుటేజీల పరిశీలించారు. గూడూరు శివారు ప్రాంతాల్లో గోవధ ఏమైనా జరుగుతుందా అనే కోణంలో పోలీసు దర్యాప్తు సాగుతుంది.

# ఖజానా నిల్? బిల్లులు ఫుల్?

**విజయవాడ, మార్చి 15, పెన్ పవర్**ఆంధ్రప్రదేశ్‌లో కాంట్రాక్టర్లకు బిల్లుల చెల్లింపు వ్యవహారంపై ఆర్థిక శాఖతో తలెత్తిన వివాదం నేపథ్యంలో పలు అంశాలు తెరపైకి వచ్చాయి. బిల్లుల చెల్లింపుపై ఫస్ట్ ఇన్ ఫస్ట్ ఔట్ విధానం అమలు చేయాలని కాంట్రాక్టర్లు మొదట్నుంచి డిమాండ్ చేస్తున్నారు.సీఎఫ్ఎంఎస్ విధానంలో అమలు చేస్తున్న విధానాల్లో లోపాలను కాంట్రాక్టర్లు ఎత్తి చూపుతుంటే తమ చేతుల్లో ఏముందని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా దాదాపు 7వేల మంది కాంట్రాక్టర్లకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి దాదాపు రూ.3వేల కోట్ల రుపాయల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి. మార్చి నెలాఖరులోగా బ్యాంకు రుణాలను రీ షెడ్యూల్ చేయడం కోసం బకాయిల్లో కొంత మేరకు విడుదల చేయాలని కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.ఏపీలో కాంట్రాక్టర్లు చేపట్టిన హై ఇంపాక్ట్ పనులు, డిజాస్టర్ మేనేజ్మెంట్ పనులు, పోలవరం పునరావాస కాలనీల నిర్మాణం, పీహెచ్‌సీల నిర్మాణం, తాగునీటి పైప్‌లైన్ల నిర్మాణం, 15వ ఆర్థిక సంఘం నిధులతో చేపట్టిన పనులు, కాల్వల మరమ్మతులు ఉన్నాయి. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రోడ్ల నిర్మాణం, మరమ్మతులు, హౌసింగ్, డ్రైనేజీ వంటి పనులు కూడా చేశారు.గత ఐదేళ్లలో చేపట్టిన పనులతో పాటు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 9 నెలలుగా చేపట్టిన పనులకు సంబంధించి బిల్లులు కూడా భారీగా బకాయి పడ్డారు. నియోజక వర్గాల్లో అత్యవసరం చేపట్టాల్సిన పనుల్ని స్థానిక ఎమ్మెల్యేలు, మంత్రుల సిఫార్సులతో ఆగమేఘాలపై పనులు అప్పగించి పూర్తి చేయించారు.బిల్లుల చెల్లింపు వ్యవహారంలో గత ఐదేళ్లుగా కొత్త పద్ధతులు మొదలయ్యాయి. ముందు పూర్తి చేసిన పనులకు ముందుగా చెల్లించే విధానానికి తిలోదకాలు ఇచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కూడా అదే పద్ధతి అనుసరిస్తున్నారు. బడా కాంట్రాక్టు సంస్థలకు మాత్రమే చెల్లింపులు చేస్తూ చిన్నాచితక కాంట్రాక్టర్లను వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎల్వోసిల నుంచి చెల్లింపుల వరకు కొందరికే ప్రాధాన్యత ఇవ్వడంపై కాంట్రాక్టర్లలో అసహనం నెలకొంది.ఈ క్రమంలో రాయలసీమలోని చిత్తూరు, కడప, పులివెందులలో చేసిన పనులకు బిల్లులు చెల్లించడం వెలుగు చూసింది. అయా ప్రాంతాల్లో చేపట్టిన పనుల్ని క్యాపిటల్ హెడ్స్ నుంచి నిధులు కేటాయించడంతో ప్రభుత్వం మారినా వాటికి నిధుల కొరత లేకుండా చెల్లింపులు జరిగిపోయినట్టు కాంట్రాక్టర్లు ఆరోపిస్తున్నారు. మరోవైపు ఆర్థిక శాఖ బాధ్యులు సూచించిన వారికి మాత్రమే చెల్లింపులు జరిగాయని, గత ప్రభుత్వంలో నష్టపోయినట్టే ఇప్పుడు కూడా చిన్న కాంట్రాక్టర్లు రోడ్డున పడుతున్నారని చెబుతున్నారు. కాంట్రాక్టర్లకు ఏప్రిల్ వరకు బిల్లులు చెల్లించలేమని ఆర్థిక శాఖ అధికారులు తేల్చి చెప్పడం కాంట్రాక్టర్లను ఆందోళనకు గురి చేస్తోంది. అధికారుల వాదన మాత్రం మరోలా ఉంది. బిల్లుల చెల్లింపు ప్రాధాన్యతలు ప్రభుత్వమే నిర్ణయిస్తుందని ఇందులో ఆర్థిక శాఖ పాత్ర నామమాత్రంగా ఉందని చెబుతున్నారు. బిల్లుల చెల్లింపు కోరుతూ ఆర్థిక శాఖకు కాంట్రాక్టర్లు వచ్చినపుడు కూడా ప్రభుత్వ పెద్దలను సంప్రదించాలని సెక్రటరీ సూచించినట్టు చెబుతున్నారు.రాష్ట్ర ప్రభుత్వ ప్రస్తుత ఆర్థిక స్థితి బిల్లులకు చెల్లింపుకు అనువుగా లేదని,ఉద్యోగుల జీతభత్యాల చెల్లింపు, తప్పనిసరిగా అమలు చేయాల్సిన పథకాలకు అతి కష్టమ్మీద నిధులు సమీకరిస్తున్నట్టు వివరించినట్టు చెబుతున్నారు. కాంట్రాక్టర్ల సమస్యపై అధికారులకు సానుభూతి ఉన్నా ఖజానా ఉన్న పరిస్థితుల్లో చెల్లింపులపై సొంతంగా నిర్ణయాలు తీసుకునే పరిస్థితి లేదని ఏపీ ఆర్థిక శాఖ వర్గాలు చెబుతున్నాయి.కొందరికే చెల్లింపులు జరుగుతున్నాయనే ఆరోపణల్ని కూడా ఆర్థిక శాక వర్గాలు తోసిపుచ్చాయి. ప్రాధాన్యత క్రమంలో అందరికి పెండింగ్ బిల్లుల్ని క్లియర్ చేస్తున్నట్టు చెప్పారు. 2014-19 మధ్య కాలంలో పెండింగ్ ఉన్న బిల్లుల్ని ఇప్పుడు క్లియర్ చేస్తున్నట్టు తెలిపారు. బిల్లులు ఎవరికి చెల్లించాలనే నిర్ణయం అధికారుల వద్ద ఉండదనే సంగతి కాంట్రాక్టర్లకు కూడా తెలుసని, ప్రభుత్వంతోనే ఈ వ్యవహారాన్ని తేల్చుకోవాలని సూచిస్తున్నారు.

# ఏపీలో ఫేక్ పెన్షన్ల గుట్టు

**నెల్లూరు, మార్చి 15, పెన్ పవర్** ఏపీలో ఫేక్ పెన్షన్ల గుట్టు వీడుతోంది. గత కొన్ని నెలలుగా రాష్ట్ర వ్యాప్తంగా వికలాంగుల పెన్షన్ల తనిఖీలు జరుగుతున్నాయి. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత వికలాంగులకు వైకల్యాన్ని బట్టి గరిష్టంగా రూ.15వేల వరకు పెన్షన్లు చెల్లిస్తున్నారు. ఈ క్రమంలో గ్రామీణ ప్రాంతాల్లో నకిలీ పత్రాలతో పెన్షన్లు పొందుతున్నారనే అభియోగాలపై ఆరోపణలు రావడంతో వికలాంగుల పెన్షన్లను తనిఖీ చేపట్టారు. ఇప్పటి వరకు పూర్తైన తనిఖీల్లో వేల సంఖ్యలో అక్రమార్కులు బయట పడ్డారు.వైకల్యం లేకున్నా అడ్డదారిలో ధృవీకరణ పత్రాలను సంపాదించి పెన్షన్లు పొందుతున్న వారి గుట్టు రట్టవుతోంది. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన తనిఖీలలో వేలాదిమంది అక్రమార్కులు పొందుతున్నట్టు గుర్తించారు. రూ.6వేలు, రూ.15వేల పెన్షన్లు పొందే వారిలో అనర్హులను గుర్తించి వారి పెన్షన్లను తొలగించేందుకు ప్రభుత్వం సిద్ధమైంది.రాష్ట్రంలో రూ.15వేల పెన్షన్లు పొందుతున్న 25వేల మందిలో 19వేల మందిని ఇప్పటికే సమగ్రంగా తనిఖీ చేశారు. వాటిలో ఉన్న వివరాల ఆధారంగా 3వేల మందికి రూ.15వేల పెన్షన్లకు అనర్హులుగా గుర్తించారు. ప్రకాశం జిల్లాలో స్వల్ప వైకల్యం ఉన్న 300మందికి రూ.15వేల పెన్షన్లు చెల్లిస్తున్నారు. 19వేలమందిలో దాదాపు 10వేల మందికి రూ.6వేల పెన్షన్ పొందడానికి మాత్రమే వైకల్యాన్ని గుర్తించారు. గరిష్ట పెన్షన్ పొందుతున్న వారిలో ఇప్పటికే 24వేల మందికి వైద్య పరీక్షలు పూర్తి చేశారు.మరోవైపు రాష్ట్రంలో 7.96లక్షల మంది ప్రస్తుతం రూ.6వేల పెన్షన్ పొందుతున్నారు. వీరిలో2లక్షల మందికి వైద్య పరీక్షలు పూర్తి చేసి లక్షన్నర మంది సమాచారాన్ని ఆన్‌లైన్ చేశారు. వారిలో స్వల్ప వైకల్యం, వైకల్యం లేకున్నా 40వేల మంది పెన్షన్లు పొందుతున్నట్టు గుర్తించారు.రాష్ట్రంలో గత ఐదేళ్లలో వృద్ధాప్య, వితంతు పెన్షన్లతో వికలాంగుల పెన్షన్లలో భారీ ఎత్తున అక్రమాలు చోటు చేసుకున్నాయి. వృద్ధాప్య పెన్షన్ రూ.4వేల చెల్లిస్తుండగా దివ్యాంగులకు సగటున దివ్యాంగులకు గరిష్టంగా రూ.15వేలు చెల్లిస్తుండటంతో పెద్ద ఎత్తున అనర్హులను పెన్షన్లలో చేర్చారు. పెన్షన్ల కోసం కూటమి ప్రభుత్వం ప్రతి నెల రూ.3వేల కోట్లను ఖర్చు చేస్తోంది.మరోవైపు ఏపీలో ప్రతి నెలల దాదాపు 63లక్షల మందికి రకరకాల పెన్షన్లను చెల్లిస్తున్నారు. రాష్ట్రంలోని మొత్తం కుటుంబాల్లో 90శాతం మందికి తెల్ల రేషన్ కార్డులను మంజూరు చేశారు. రైస్ కార్డుల ప్రతిపాదికన ప్రతి కుటుంబంలో వృద్ధాప్య, వితంతు పెన్షన్లను మంజూరు చేశారు. ఈ క్రమంలో అడ్డదారిలో పెన్షన్లను దక్కించుకున్న వారి సంఖ్య లక్షల్లో ఉంది. రాజకీయ సిఫార్సులు, సిబ్బంది అవినీతితో అర్హత లేకున్నా పెన్షన్లను ఎడాపెడా ఇచ్చేశారు. అనర్హులను గుర్తించే విషయంలో రాజకీయ విమర్శలకు ప్రభుత్వం వెనుకంజ వేస్తోంది.

# అందరిని దూరం చేసుకుంటున్నారే...

**ఒంగోలు, మార్చి 15, పెన్ పవర్** వైసీపీ అధినేత వైఎస్ జగన్ కు దగ్గర వాళ్లంతా దూరమవుతున్నారు. నా అనే వాళ్లు ఎవరూ ఆయన వద్ద ఉండకుండా పోతున్నారు. అయిన వాళ్లే శత్రువులుగా మారుతున్నారు. జగన్ కు అధికార పక్షం కంటే ఇప్పుడు స్వపక్షమే పెద్ద ఇబ్బందిగా మారింది. అసలు ఎందుకీ పరిస్థితి? జగన్ లో లోపమా? లేక పక్కన ఉన్న వాళ్లు పక్కదోవ పట్టిస్తున్నారా? ఐఏఎస్ లు కావచ్చు.. సొంత మనుషులు కావచ్చు. ఎవరైనా చెప్పిన మాటలను విని తనను కష్టకాలంలో ఆదుకున్న వారిని దూరం చేసుకుంటే ఎవరికి నష్టమన్నది జగన్ ఆలోచిస్తున్నారా? లేదా? అని అనిపిస్తుంది. ఎందుకంటే 2019 ఎన్నికల తర్వాత నుంచే ఈ రకమైన పరిస్థితిని జగన్ ఎదుర్కొంటున్నారు. సాధారణంగా రాజకీయ నేతలు కుటుంబ సభ్యులపై ఆధారపడతారు. అందరినీ కలుపుకుని వెళ్లాలని ప్రయత్నిస్తారు. వారికి పదవులు ఇచ్చో.. మరొక రూపంలోసాయం అందించో.. తనకు వ్యతిరేకంగా మారకుండా చేసుకుంటారు. చంద్రబాబు నాయుడును చూసైనా నేర్చుకోకపోతే ఎట్లా? ఎన్టీఆర్ ను దించేసి పార్టీని చేతుల్లోకి తీసుకున్నప్పటికీ నందమూరి కుటుంబాన్ని ఆయన దూరం చేసుకోలేదు. ఒక్క దగ్గుబాటి కుటుంబంతో మాత్రమే నిన్నటి వరకూ కొంత పొరపచ్చాలుండేవి. అవి కూడా మొన్నటితో మాసిపోయాయి. ఎన్టీఆర్ వారసులెవరు తన రాజకీయాలలకు అడ్డుపడకుండా వారిని చూసుకోగలిగారు. ఇక తన సొంత కుటుంబంలో కూడా చంద్రబాబు ఎప్పుడూ విభేదాలు పెట్టుకోలేదు. చంద్రబాబు నాయుడు సోదరుడు రామ్మూర్తి నాయుడు కొంతకాలం విభేదించినా తర్వాత మళ్లీ అన్న పంచన చేరిపోయారు.కానీ జగన్ అధికారంలోకి రాగానే చెల్లి వైఎస్ షర్మిలను దూరం చేసుకున్నారు. తర్వాత తల్లికి దూరమయ్యారు. చివరకు చెల్లి, తల్లిపైన న్యాయస్థానాన్ని ఆశ్రయించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక అధికారం కోల్పోయిన తర్వాత తన దగ్గర బంధువు అయిన బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా పార్టీని వీడి వెళ్లారు. జగన్ వైఖరి నచ్చకే ఆయన పార్టీని వదిలి తన ప్రత్యర్థి పంచన చేరారు. ఇక తాజాగా విజయసాయిరెడ్డి కూడా దూరమయ్యారు. విజయసాయిరెడ్డి బంధువు కాకపోయిన దగ్గర బంధువు కింద లెక్కే. ఎందుకంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాం నుంచి ఆయన కుటుంబానికి ఆడిటర్ గా ఉన్న విజయసాయిరెడ్డి తర్వాత క్రమంగా రాజకీయాల్లోకి వచ్చారు. ఆయనకు తగిన గౌరవం ఇవ్వాల్సిన బాధ్యత జగన్ పైనే ఉంది. విజయసాయిరెడ్డి ఏదైనా పొరపాటు చేసినా పిలిచి మందలించే స్వేచ్ఛ కూడా జగన్ కు ఉంది. కానీ ఆ రెండూ కాదని సాయిరెడ్డి తనంతట తానే దూరమయ్యేలా జగన్ చేసుకున్నారంటే జగన్ కు బంధువుల పొడగిట్టదన్న విషయం స్పష్టంగా అర్థమవుతుంది. జనంలోకి కూడా ఈ ఘటనలు తప్పుడు ప్రచారానికి వెళతాయి. జనం కూడా అదినమ్మి జగన్ కు వ్యతిరేకమయ్యే అవకాశముంది. అదే సమయంలో దగ్గర బంధువులే దూరమయి ఆరోపణలు చేస్తుంటే చూసే వారికి నిజం అనిపించక మానదు. జగన్ ది స్వయంకృతాపరాధమేననిచెప్పాలి. ఇందులో ఎవరి తప్పిదం లేదు

# జట్టులోకి నితీష్ కుమార్ ఎంట్రీ ఇచ్చేశాడు..!



**హైదరాబాద్ పెన్ పవర్:** మరో వారం రోజుల్లో ఐపీఎల్-2025 ఫీవర్ మొదలు కాబోతోంది. అన్ని టీమ్ లు తమ ప్లేయర్స్ ను సిద్ధం చేసుకుంటున్నాయి. ఇప్పటికే తమ తమ హోమ్ గ్రౌండ్స్ లో ప్రాక్టీస్ మొదలు పెట్టాయి. సన్ రైజర్స్ హైదరాబాద్ (SRH) కూడా ఉప్పల్ స్టేడియంలో చెమటోడ్చుతోంది. ఈ టైమ్ లో SRH కు బీసీసీఐ గుడ్ న్యూస్ చెప్పింది.

ఫిట్ నెస్ టెస్ట్ కోసం ఇప్పటి వరకు ప్రాక్టీస్ కు దూరంగా ఉన్న హైదరాబాద్ ఆల్ రౌండర్ నితీశ్ కుమార్ రెడ్డికి బీసీసీఐ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇక నుంచి స్కాడ్ లో చేరిపోవచ్చునని పచ్చజెండా ఊపింది. తాజాగా బెంగళూరులో నిర్వహించిన యోయో టెస్ట్ లో పాస్ అయ్యాడు నితీశ్. శనివారం నిర్వహించిన ఫిట్ నెస్ టెస్ట్ లో పాస్ అవ్వడంతో ఈ ఐపీఎల్ లో ఫస్ట్ మ్యాచ్ నుంచే నితీశ్ కుమార్ హైదరాబాద్ కు ఆడనున్నాడు.

ఈ సీజన్ లో SRH తొలి మ్యాచ్ రాజస్థాన్ రాయల్స్ SRH ఆడనుంది. హోమ్ గ్రౌండ్ ఉప్పల్ స్టేడియంలో మార్చి 23 న స్టార్ట్ అయ్యే ఈ మ్యాచ్ కి ఈ ఆల్ రౌండర్ వస్తున్నాడు. అయితే ఆదివారం (మార్చి 16) ఉప్పల్ గ్రౌండ్ లో ప్రాక్టీస్ కు అటెండ్ అవుతాడని మేనేజ్ మెంట్ ప్రకటించింది.

శుక్రవారం నితీశ్ కు బెంగళూరులో యోయో టెస్ట్ నిర్వహించింది బీసీసీఐ. ఈ టెస్ట్ లో పాసయ్యాడు ఈ ఆల్ రౌండర్. అయితే ఇటీవల నితీశ్ కు మూడు వారాల రెస్ట్ ఇచ్చింది బీసీసీఐ. మరో 15 రోజులు ఎక్కువ తీసుకున్న నితీశ్.. తాజా టెస్ట్ లో పాసవ్వడంతో SRH బౌలింగ్ కు స్కాడ్ కు మరింత బలాన్ని చేకూర్చినట్లు అయ్యింది. గత సీజన్ లో నితీశ్ చేసిన అద్భుత పర్ఫార్మెన్స్ ను దృష్టిలో ఉంచుకుని SRH మేనేజ్ మెంట్ రిటైన్ చేసుకుంది. మొత్తం 5 మంది ప్లేయర్లను రిటైన్ చేసుకుంటే.. అందులో నితీశ్ కూడా ఒకరు.

పాట్ కమ్మిన్స్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్, హెన్రిచ్ క్లాసెన్ లతో పాటు మన హైదరాబాదీ ఆల్ రౌండర్ ను కూడా రిటైన్ చేసుకుంది మేనేజ్ మెంట్. ఐపీఎల్ - 2024 లో సూపర్ పర్ఫార్మెన్స్ తో అదరగొట్టిన నితీశ్.. SRH కు చాలా వాల్యుయేబుల్ ఆల్ రౌండర్ గా నిలిచాడు. గత సీజన్ లో 15 మ్యాచ్ లలో 142.92 స్ట్రైక్ రేట్ తో 303 రన్స్ చేసి ఫ్యూచర్ లో తన అవసరం ఎంతుందే చెప్పకనే చెప్పాడు. వీటితో పాటు బంగ్లాదేశ్, ఇంగ్లండ్ తో ఆడిన 20లలో కూడా బౌలింగ్, బ్యాటింగ్ లో డీసెంట్ పర్ఫార్మెన్స్ చేసి.. ఇండియాకు తన అవసరం ఉందని నిరూపించుకున్నాడు. ఇండియా ఫ్యూచర్ ప్లాన్స్ లో నితీశ్ కు చోటు ఉంటుందనేలా మేనేజ్ మెంట్, సెలెక్టర్ల దృష్టిలో పడ్డాడు. తాజాగా ఫిట్ నెస్ టెస్ట్ లో పాసై మళ్లీ టీమ్ లో చేరుతుండటంతో మన ఆల్ రౌండర్ ఈసారి తన విశ్వరూపం చూపిస్తాడని అనుకుంటున్నారు హైదరాబాద్ ఫ్యాన్స్.

# లెక్క మారింది.. ఈ సీజన్‌లో కెప్టెన్లు అంతా మనోళ్లే..!




**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ క్రికెట్ లో BCCI ట్యాలెంట్ హంట్ సక్సెస్ అయ్యింది. మంచి ఫలితాలను ఇస్తోంది. గల్లీ నుంచి ఢిల్లీ వరకు ట్యాలెంటెడ్ ప్లేయర్లను వెతికి పట్టుకునేందుకు తీసుకొచ్చిన IPL కారణంగా.. ఎంతో మంది ఆణిముత్యాల్లాంటి ప్లేయర్లు వెలుగులోకి వచ్చారు. వస్తున్నారు. ఐపీఎల్ ప్రారంభమైన 17 ఏళ్ల నుంచి ఇప్పటి వరకు కొత్త కొత్త ప్లేయర్లు ఇంటర్నేషనల్ ప్లేయర్లను కూడా డామినేట్ చేస్తున్నారంటే మనోళ్ల సత్తా ఏంటో అర్థం చేసుకోవచ్చు. కొత్త కొత్త ప్లేయర్లు ట్యాలెంట్ చూపించడమే కాదు.. జట్టును నడిపించే సత్తా కూడా తమలో ఉందని నిరూపించుకుంటున్నారు మనవాళ్లు. ఒకప్పుడు ఐపీఎల్ లో కెప్టెన్లుగా సగం వరకు విదేశీ కెప్టెన్లే ఉండేవారు. ఆటలో అనుభవం.. జట్టును నడిపించే సామర్థ్యం, క్రికెట్ లో వారికున్న రికార్డ్స్ దృష్ట్యా విదేశీ ప్లేయర్లకే కెప్టెన్ బాధ్యతను ఇచ్చేవారు. కానీ ఇప్పుడు లెక్క మారుతోంది. మారింది కూడా. జట్టును నడిపించడంలో, విజయం అందిచడంలో మనవారు ఎక్కడా తీసిపోరు అన్నట్లుగా దాదాపు అన్ని టీమ్స్ కు ఇప్పుడు మన వాళ్లే కెప్టెన్లుగా ఉన్నారు. "పేరుకేమో ఇండియన్ ప్రీమియర్ లీగ్.. డామినేషన్ అంతా విదేశీయులదే.. ఏ మనవాళ్లు చేయలేరా కెప్టెన్సీ.." అనే చర్చ నడిచేది ఫ్యాన్స్ లో ఇన్నాళ్లు. దీనికి తగ్గట్లుగానే.. ఇండియన్ ప్రీమియర్ లీగ్ అంటే.. ఇండియన్సే కెప్టెన్స్ అన్నట్లుగా ఈసారి దాదాపు అంతా మనవాళ్లే కెప్టెన్లుగా వ్యవహరించడం విశేషం. ఈ సీజన్ లో 10 జట్లలో 9 టీమ్ లకు ఇండియన్సే కెప్టెన్స్. గత సీజన్ లో బెంగళూర్ కు ఫాఫ్ డూప్లెసిస్, హైదరాబాద్ కు కమిన్స్ కెప్టెన్స్ గా ఉండేవారు. అయితే ఈసారి ఓన్లీ హైదరాబాద్ మాత్రమే విదేశీ ప్లేయర్ కు జట్టు కెప్టెన్ బాధ్యతలు అప్పగించింది. మిగత జట్లన్నీ బాద్యతలు ఇండియన్స్ కే ఇవ్వడం గమనార్హం.

**ఏ ఏ టీమ్స్‌కు మన కెప్టెన్స్ ఉన్నారు:**

గత సీజన్ లో గుజరాత్ టైటాన్స్ కు కెప్టెన్ గా ఉన్న హార్దిక్ పాండ్యా ముంబై కెప్టెన్ గా వెళ్లాడు. ముంబై భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఇప్పుడే కెప్టెన్ ను తయారు చేసుకునేందుకు పాండ్యాను జట్టులో చేర్చుకుంది. పాండ్యా వెళ్లడంతో గుజరాత్ కు 2024కు ముందు శుభ్‌మన్ గిల్ కెప్టెన్ అయ్యాడు. ఈఎడిషన్‌లో కూడా కెప్టెన్‌గా కొనసాగనున్నాడు. ఇక చెన్నై సూపర్ కింగ్స్ కు రుతురాజ్ గైక్వాడ్ కెప్టెన్ గా వ్యవహరిస్తున్నాడు. ధోనీ సలహాలతో కెప్టెన్సీలో ఓనమాలు నేర్చేసుకున్నాడు. పంజాబ్ కింగ్స్ ను నడిపించిన శిఖర్ ధావన్ రిటైరవ్వడంతో ఈసారి శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకున్నాడు. ఇక డిఫెండింగ్ ఛాంపియన్ కోల్ కత్తా నైట్ రైడర్స్ ను 2024 లో ఛాంపియన్ గా నిలిపిన శ్రేయస్ అయ్యర్ పంజాబ్ కింగ్స్ వెళ్లాడు. దీంతో కేకేఆర్ కూడా కొత్త కెప్టెన్ సారథ్యంలోనే బరిలోకి దిగుతోంది. అజింక్య రహానే కోల్ కత్తా ను నడిపించనున్నాడు. ఇక ఆర్సీబీ కూడా ఈ సారి కొత్త కెప్టెన్ తోనే బరిలోకి దిగుతోంది. మేనేజ్ మెంట్ ఈ సారి ఫాఫ్ డుప్లెసిస్ ను వదిలేసి..రి రజత్ పటీదార్‌ను కెప్టెన్‌గా నియమించింది. ఐపీఎల్ లో అతి తక్కువ వయసున్న లక్నో సూపర్ జెయింట్స్ కూడా చాలా తొందరగా కెప్టెన్ ను మార్చుతోంది. 2022లో ఎంట్రీ ఇచ్చిన లక్నో సూపర్ జెయింట్స్ ను ఇన్నాళ్లు కేఎల్ రాహుల్ నడిపించాడు. మెగావేలానికి ముందు రాహుల్ ను ఆ ఫ్రాంచైజీ వదిలేసి.. ఈ సీజన్‌కు రిషబ్ పంత్ కు కెప్టెన్ బాధ్యతలు అప్పగించింది మేనేజ్ మెంట్. ఇక్కడ మరో ఇంట్రెస్టింగ్ సిచ్యువేషన్ ఏంటంటే.. పంత్ ను ఢిల్లీని వదిలేయడంతో.. కొత్త కెప్టెన్ గా కూల్ ఆల్ రౌండర్, మంచి ఫామ్ లో ఉన్న అక్షర్ పటేల్ ను కొత్త సారథిగా నియమించింది ఢిల్లీ. మరో బెస్ట్ టీం రాజస్థాన్ రాయల్స్ తమ కెప్టెన్ గా సంజూ శాంసన్ నే కొనసాగిస్తోంది.

ఇక ఫ్యాన్స్ ఎంతగానో ఎదురు చూస్తున్న ఐపీఎల్ 2025 మార్చి 22న ప్రారంభం అవుతుంది. ఫస్ట్ మ్యాచ్ కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టు రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్టుతో తలపడనుంది. మార్చి 22న కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. ఈసారి అంతా యంగ్ ప్లేయర్స్.. అది కూడా ఇండియన్స్ టీమ్స్ కు కెప్టెన్లుగా ఉండటంతో ఈ సీజన్ మరింత రసవత్తరంగా ఉండనుందని ఫ్యాన్స్ ఎదురుచూస్తున్నారు.

# ఐపీఎల్‌లో అత్యధిక సెంచరీలు చేసింది వీరే!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఈ నెల 22 నుంచి ఐపీఎల్ 18వ సీజన్ ప్రారంభం కానుంది. దీంతో ప్రపంచ వ్యాప్తంగా అభిమానులకు మరో మెగా క్రికెట్ ఈవెంట్ కనువిందు చేయనుంది. బ్యాటర్లు బౌండరీలతో విరుచుకుపడే ఈ మెగా టోర్నీలో ఇప్పటివరకూ అత్యధిక శతకాలు నమోదు చేసిన ఆటగాళ్లు ఎవరో ఇప్పుడు చూద్దాం.

ఈ జాబితాలో విరాట్ కోహ్లీ 8 సెంచరీలతో అగ్రస్థానంలో ఉన్నాడు. టోర్నీ ఆరంభ ఎడిషన్ 2008 నుంచి రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ)కే ఆడుతున్న ఈ రన్‌మెషీన్ ఆ జట్టు తరఫున 252 మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 8,004 రన్స్ చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 113(నాటౌట్). విరాట్ తర్వాతి స్థానంలో ఇంగ్లండ్ ఆటగాడు జోస్ బట్లర్ ఉన్నాడు. ఇప్పటివరకు 7 శతకాలు బాదాడు. మొత్తం 107 మ్యాచ్‌లు ఆడిన బట్లర్ 3,582 పరుగులు చేశాడు. అతని అత్యధిక వ్యక్తిగత స్కోర్ 124. మొన్నటివరకు రాజస్థాన్ రాయల్స్‌కు ఆడిన అతడు.. ఈసారి గుజరాత్ టైటాన్స్ తరఫున బరిలోకి దిగబోతున్నాడు.

బట్లర్ తర్వాత అత్యధిక సెంచరీలు బాదింది క్రిస్ గేల్. 142 ఐపీఎల్ మ్యాచ్‌లు ఆడిన యూనివర్సల్ బాస్ 6 శతకాలు నమోదు చేశాడు. మొత్తంగా 4,965 రన్స్ చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 175(నాటౌట్).

ఇక టీమిండియా యువ ఓపెనర్ శుభ్‌మన్ గిల్ తన ఐపీఎల్ కెరీర్‌లో 4 సెంచరీలు చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 129. మొత్తం 103 మ్యాచ్‌లలో 3,216 రన్స్ చేయడం విశేషం.

అలాగే కేఎల్ రాహుల్ కూడా 4 శతకాలు బాదాడు. 132 ఐపీఎల్ మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించిన రాహుల్ 4,683 రన్స్ చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 132(నాటౌట్). గత సీజన్ వరకు లక్నో సూపర్ జెయింట్స్ కు ఆడిన అతడు.. ఈ ఎడిషన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఆడనున్నాడు.

ఆసీస్ మాజీ ఆటగాళ్లు షేన్ వాట్సన్, డేవిడ్ వార్నర్‌లు సైతం తమ ఐపీఎల్ కెరీర్ లో 4 సెంచరీలు చొప్పున సాధించారు.

భారత జట్టు టీ20 ప్లేయర్ సంజూ శాంసన్ ఐపీఎల్‌లో 3 శతకాలు బాదాడు. రాజస్థాన్ రాయల్స్ కెప్టెన్ అయిన సంజూ ఇప్పటివరకు 168 ఐపీఎల్ మ్యాచ్‌లకు ప్రాతినిధ్యం వహించాడు. మొత్తం 4,419 పరుగులు చేశాడు. అత్యధిక వ్యక్తిగత స్కోర్ 119.

సంజూతో పాటు ఆర్‌సీబీ మాజీ ప్లేయర్ ఏబీ డివిలియర్స్ కూడా 3 సెంచరీలు నమోదు చేశాడు. అతని అత్యధిక వ్యక్తిగత స్కోర్ 133(నాటౌట్). మొత్తం 184 మ్యాచ్‌లు ఆడి 5,162 రన్స్ చేశాడు.

# నియమ నిబంధనలతో సాయి పల్లవికి సమస్యేనా?



ఫరియా అబ్దుల్లా అద్భుతమైన నీలిరంగు చీరలో..



సాయి పల్లవి గ్లామర్ పాత్రలకు దూరంగా ఉంటుందన్నది తెలిసిందే. ఎన్ని కోట్లు ఆఫర్ చేసినా? పాత్ర కోసం పనిచేస్తుంది తప్ప పారితోషికం కాదని ఇప్పటికే చాలా సినిమాలతో ప్రూవ్ చేసింది. గ్లామర్ పాత్రల్లో నటించాలని ఎన్నో అవకాశాలు..కోట్లు గుమ్మరించడానికి నిర్మాతలు ముందుకొచ్చినా? నో వే అనేసింది. దర్శక, రచయితలు ఆమెను ఒప్పించడానికి ఎంతగా కష్టపడాలి? అన్నది ఇటీవలే చందు మొండేటి మాటల్లో అర్థమైంది.కెరీర్ మొదలైన దగ్గర నుంచి నేటివరకూ కేవలం డీసెంట్ రోల్స్ మాత్రమే చేసింది. తాను ఏ సినిమా చేసినా? అందులో హీరో ఉన్నా? హీరోతో పాటు తన పాత్ర కూడా అంతే బలంగా ఉండేలా చూసుకుంది. ఈ విషయంలో సాయి పల్లవి ఎంతో తెలివిగా సక్సస్ అయింది. ఎక్కడా గ్లామర్ , స్కిన్ షోలకు చోటు ఇవ్వకుండా నటించింది. దీంతో సాయి పల్లవితో సినిమా తీయాలనుకుంటే కొన్ని కండీషన్లు ఉంటాయి? అని దర్శకులకు అర్థం చేసుకుని..ఆమె అభిరుచి మేరకు పాత్రలు రాయడం మొదలు పెట్టారు.ఇంతవరకూ బాగానే ఉంది. మరి ఇలాగే ఉంటే ఇండస్ట్రీలో లాంగ్ కెరీర్ ఉంటుందా? అంటే అది కష్టమనే నిపుణులు భావిస్తున్నారు. ఇండస్ట్రీకి కొత్త నీరు వచ్చే కొద్దీ పాత నీరు పోవడం సహజం అన్న మాటను గుర్తు చేస్తున్నారు. ఎంత ఫేం ఉన్నా? సీన్ డిమాండ్ చేసిందంటే? నటి పూర్తిగా డైరెక్టర్ కోణంలో నటించాల్సి ఉంటుందని ఇప్పటి వరకూ ఆ ఛాన్స్ సాయి పల్లవి విషయంలో ఏ డైరెక్టర్ తీసుకోకోపోవడంతో సమస్య మొదలవ్వలేదని అంటున్నారు.ఆరోజు వచ్చిన నాడు సాయి పల్లవి కెరీర్ ప్రతికూల పరిస్థితుల్లో పడే అవకాశం ఉంటుందని భావిస్తున్నారు. కీర్తి సురేష్ కూడా 'మహానటి' సక్సెస్ తర్వాత వచ్చిన ఎన్నో అవకాశాలను ఇలాగే వదులుకుందని..చివరికి ఛాన్సులు తగ్గడంతో? తాను కూడా ఓ మెట్టు దిగాల్సి వచ్చిందన్న విషయాన్ని గుర్తు చేస్తున్నారు. ఇండస్ట్రీలో లాంగ్ కెరీర్ ఉండాలంటే సక్సెస్ , ట్యాలెంట్ తో పాటు దర్శక, రచయితల విజన్ ని కూడా అర్థం చేసుకోవాలన్నారు. మొండి పట్టుదలకు పోతే కెరీరే ప్రశార్థకం అవుతుందని భావిస్తున్నారు.



దయానా పెంటీ తన కోసమే రూపొందించబడినట్లుగా ప్రతీదీ కనిపించేలా చేయడానికి ఒక మార్గం ఉంది

## మెగా - అనిల్.. అసలు మోత ముందుగానే..

మెగాస్టార్ చిరంజీవి - అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోయే చిత్రం ఇప్పటికే భారీ అంచనాలు పెంచేసింది. మెగా ఫ్యాన్స్‌కు ఫుల్ ఎంటర్‌టైన్‌మెంట్ కలిగించే సినిమా వస్తుందని అనిల్ రావిపూడి ఇప్పటికే క్లారిటీ ఇచ్చేశాడు. ఫ్యామిలీ ఆడియన్స్‌ను ఎడాపెడా నవ్వించే స్క్రీన్‌ప్లే, మాస్ ఎలిమెంట్స్, ఎమోషనల్ డ్రామాతో ఓ ఫుల్ కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా సినిమాను డిజైన్ చేస్తున్నాడట. అయితే ఈ సినిమాకు మ్యూజిక్ ఎవరు అందిస్తారనే విషయంపై గత కొన్ని రోజులుగా చర్చ జరుగుతోంది.ఇప్పుడు ఆ సస్పెన్స్‌కు దాదాపు తెరపడినట్లే అని తెలుస్తోంది. 'సంక్రాంతికి వస్తున్నాం' సినిమాకు చార్ట్‌బస్టర్ ఆల్బమ్ ఇచ్చిన భీమ్స్ సిసిరోలియోను మెగాస్టార్ మూవీకి సంగీత దర్శకుడిగా తీసుకున్నట్లు టాక్. ఇంకా అఫీషియల్ గా క్లారిటీ రాకపోయినా దాదాపు అతనే బెస్ట్ అని అనిల్ డిసైడ్ అయ్యారట. మరో ఆసక్తికరమైన విషయం ఏమిటంటే.. భీమ్స్ ఈ సినిమాలో నాలుగు పాటల్ని ఇప్పటికే కంపోజ్ చేసేశాడట. ఇది మెగాస్టార్ సినిమాలకు ఇప్పటివరకు లేని ట్రెండ్ అని చెప్పుకోవాలి.సాధారణంగా సినిమాకు స్క్రిప్ట్ పూర్తి అయ్యాక, ఒకట్రెండు షెడ్యూల్స్ అయిన తర్వాత మ్యూజిక్ వర్క్ ప్రారంభమవుతుంది. కానీ అనిల్ రావిపూడి తన స్టైల్ లో ముందుగానే మ్యూజిక్ వర్క్‌ను కంప్లీట్ చేయిస్తున్నాడు. అందులోనూ భీమ్స్ ప్రస్తుతం మాస్ ఆల్బమ్‌లకు స్పెషలిస్ట్‌గా మారిపోయాడు. 'మ్యాడ్,' 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి సినిమాలకు ఇచ్చిన పాటలు ఎంతగా వైరల్ అయ్యాయో ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.ఇక చిరు సినిమాలో అద్భుతమైన మాస్ బీట్‌తో ఒక పాట, మరో పూర్తి ఫోక్ సాంగ్ ఉండబోతున్నాయని టాక్. ఇప్పటి వరకు వచ్చిన సమాచారం ప్రకారం, వీటిలో ఒక పాట ఏకంగా మెగాస్టార్ ఫ్యాన్స్ కు పునకాలు తెప్పించేలా ఉంటుందట. ఇంకా షూటింగ్ మొదలుకాకముందే ఈ తరహా వర్క్ కొంత వరకు ఫినిష్ అవ్వడం చాలా గ్రేట్. అసలే నెక్స్ట్ సంక్రాంతిని టార్గెట్ చేస్తూ వస్తున్న సినిమా కాబట్టి ముందే మ్యూజిక్ వర్క్ ఫినిష్ అయితే పెద్ద భారం తగ్గుతుంది. . చిరంజీవితో చేసిన ఈ సినిమా తర్వాత టాలీవుడ్‌లో అతని రేంజ్ మరింత పెరిగే అవకాశం ఉంది. మెగాస్టార్ - అనిల్ రావిపూడి సినిమాను 2026 సంక్రాంతికి విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. అంటే 2025 చివరి నాటికి షూటింగ్ పూర్తవ్వాల్సి ఉంటుంది. సినిమా షూటింగ్ పూర్తి కాకముందే ఆల్బమ్ రెడీ అవ్వడం అనేది ఇండస్ట్రీలో చాలా అరుదుగా జరిగే విషయం.

On behalf of Printed, Published and owned by GANTYADA APPA RAO, Published at D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Printed by GANTYADA APPARAO, Printed At SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS, D.NO: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Ongole, Prakasam District -523001,Andhrapradesh. Editor: G.APPARAO, (Responsible for selection of news under the PRB Act ) RNI : APTEL/2014/58046 e-mail:penpower9@gmail.com